**నమస్తే తెలంగాణ**

జిల్లా టాబ్లాయిడ్ వార్తల కోసం 10, 11పేజీలు చూడండి.





మన రాష్ట్రం మన పత్రిక

# నమస్తే తెలంగాణ



**బతుకమ్మ**

నమస్తే తెలంగాణ ప్రత్యేక అనుబంధం

ఆదివారం సంచికతో ఉచితంగా అందుకోండి





శనివారం 11.4.2020 • సంపుటి 9 • సంచిక 287 • వెల. రూ. 6.50 | కరీంనగర్ పేజీలు : 12 | చవితి

సూర్యోదయం: 6.01, సూర్యాస్తమయం: 6.26, శార్వరి సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, కృష్ణపక్షం చతుర్థి రాత్రి 7.02 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: అనురాధ రాత్రి 8.11 వరకు, తదుపరి జ్యేష్ఠ, అమృతఘడియలు: ఉదయం 10.33 నుంచి మధ్యాహ్నం 12.02 వరకు, రాహుకాలం: ఉదయం 9.07 నుంచి 10.41 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.01 నుంచి 7.40 వరకు, వర్జ్యం: అ.రా. 1.34 నుంచి తె.జా. 3.06 వరకు.

PUBLISHED FROM KARIMNAGAR • HYDERABAD • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline


## దేశానికే గరిశె.. తెలంగాణ మెరిసె



- రికార్డుస్థాయిలో పెరిగిన పంట దిగుబడి
- రాష్ట్ర విభజన అనంతరం అనూహ్య వృద్ధి
- లాక్‌డౌన్‌లోనూ ఇక్కడి బియ్యానికి డిమాండ్
- కనిపిస్తున్న నీటి ప్రాజెక్టుల నిర్మాణ ఫలితం
- 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ అశ్వినీకుమార్‌గుప్తా

దేశానికే అన్నం పెట్టేస్థాయికి తెలంగాణ ఎదిగింది. లెక్కకు మించి ధాన్యం దిగుబడులతో విలసిల్లుతూ దేశ ధాన్యాగారం (రైస్ బౌల్ ఆఫ్ ఇండియా)గా అవతరించింది. సమైక్య రాష్ట్రంలో అతి తక్కువ దిగుబడులు ఉండగా.. ప్రస్తుతం అవి ఏటికేడు పెరుగు తున్నాయి. యాసంగిలో 50 లక్షల టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నాం. తన ప్రజలను ఆదుకొంటూనే పొరుగు రాష్ట్రాల్లోని పేదల కడుపు నింపేందుకు సిద్ధమవుతుండటం ఇక్కడి ప్రజల అదృష్టం. ఆకుపచ్చ తెలంగాణ చూడాలని కలలుగన్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు.. అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ రికార్డ్ టైంలో నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తిచేసి తెలంగాణ దశదిశలా సాగునీరు అందేలా చూస్తున్నారు. ఆయా ప్రాజెక్టుల ఫలితాలు ప్రస్తుతం కండ్ల ముందే సాక్షాత్కరిస్తున్నాయి.

2



### భూమికి బంగారం కాసినట్టు..



కాళేశ్వరం జలాలు పారడంతో ఈసారి రాష్ట్రంలో అనేక చెరువులు, రిజర్వాయర్లు జలకళలాడుతున్నాయి. వాటికింద రికార్డుస్థాయిలో పంటలు.. ప్రత్యేకించి మునుపెన్నడూ లేనంతస్థాయిలో వరి పండుతున్నది. ప్రస్తుతం కోత దశకు వచ్చిన వరిపంట రాష్ట్రమంతటా స్వర్ణకాంతులు వెదజల్లుతున్నది. అలాంటి ఒక బంగారు రాశి.. శుక్రవారం కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలోని చింతకుంట గ్రామంలో ఇలా కనువిందుచేసింది!

# పట్టు సడలొద్దు

**కరోనా వ్యాప్తి నిరోధానికి ఇదే స్ఫూర్తి కొనసాగాలి**

## ప్రజలకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పిలుపు

**నిత్యావసరాలకు కొరత రానివ్వొద్దు.. యథావిధిగా పంటల కొనుగోళ్లు.. అధికారులకు ఆదేశం**

**నేటి ప్రధాని వీడియో కాన్ఫరెన్స్, రాష్ట్ర క్యాబినెట్ భేటీ అంశాలపై ఉన్నతస్థాయి సమీక్ష**



సీఎంఆర్‌ఎఫ్‌కు మైహోమ్ ఇండస్ట్రీస్ గ్రూప్ చైర్మన్ జూపల్లి రామేశ్వర్‌రావు ప్రకటించిన రూ.3 కోట్ల విరాళం చెక్కును శుక్రవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు అందజేస్తున్న సంస్థ డైరెక్టర్లు జూపల్లి రామారావు, జూపల్లి శ్యాంరావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వ్యాప్తిని నిరోధించేందుకు ప్రస్తుతం అమలుచేస్తున్న లాక్‌డౌన్‌ను ఇదే స్ఫూర్తితో కొనసాగించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. వైరస్ సోకినవారికి చికిత్స అందించడంతోపాటు వారితో కలిసినవారిని గుర్తించి, క్వారంటైన్ చేసే ప్రక్రియ కొనసాగుతున్నదని చెప్పారు. లాక్‌డౌన్ కారణంగా నిత్యావసరాలకు కొరత రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వరికోతలు, ధాన్యం, ఇతర పంటల కొనుగోళ్లు యథావిధిగా కొనసాగించాలని సూచించారు. కరోనా బాధితులకు అందుతున్న చికిత్స, లాక్‌డౌన్ అమలు, వ్యవసాయ సంబంధ కార్యక్రమాలు తదితర అంశాలపై ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం ప్రగతిభవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. శనివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో జరిగే వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రస్తావించాల్సిన అంశాలు, మధ్యాహ్నం మంత్రివర్గ సమావేశంలో చర్చకు పెట్టాల్సిన అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు, అధికారులకు పలు సూచనలు చేశారు. లాక్‌డౌన్ కారణంగానే ఇతర దేశాల్లో మాదిరిగా కాకుండా మన దేశంలో, రాష్ట్రంలో కరోనా వైరస్ ఎక్కువగా విస్తరించడంలేదని చెప్పారు. ఈ సత్యాన్ని గ్రహించి ప్రజలు సహకరించాలని

మిగతా 2వ పేజీలో



సీఎం సహాయనిధికి రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తరఫున రూ.5 కోట్ల విరాళం పత్రాన్ని మంత్రి కేటీఆర్‌కు అందజేస్తున్న జియో సీఈవో కేసీ రెడ్డి, రిలయన్స్ ప్రతినిధి కమల్ పొట్లపల్లి

**ఏడాదికి 10 రోజులు**

## ప్రపంచమంతా లాక్‌డౌన్ చేద్దాం

**కాలుష్యాన్ని తగ్గిద్దాం.. భూమిని కాపాడుకుందాం**

**ట్విట్టర్ లైవ్‌లో మంత్రి కేటీఆర్ వినూత్న ప్రతిపాదన**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రపంచంలో అనేకదేశాల్లో ప్రస్తుతం లాక్‌డౌన్ కొనసాగుతుండటంతో వాతావరణ కాలుష్యం, భూతాపంలో గణనీయమైన మార్పులు వస్తున్నాయని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు అన్నారు. ప్రపంచమంతా ఒప్పుకొంటే వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ఏడాదికి కనీసం పదిరోజులపాటు పరిమితస్థాయిలో లాక్‌డౌన్ ప్రకటిస్తే బాగుంటుందని వినూత్న ప్రతిపాదన చేశారు. కరోనా వ్యాప్తిని కట్టడిచేసేందుకు లాక్‌డౌన్‌ను మరికొంతకాలం కొనసాగించాలన్నది తన వ్యక్తిగత అభిప్రాయమని, అయితే దీనిపై సమిష్టిగా నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నదని తెలిపారు. కరోనా మహమ్మారి నుంచి బయటపడ్డాక దేశాలన్నీ వైద్య,మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఐటీ రంగం తర్వాత లైఫ్ సైన్సెస్ రంగాన్ని అభివృద్ధి

మిగతా 3వ పేజీలో



## బయటకువస్తే మాస్క్ తప్పనిసరి!

- ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం సూచన
- వాడకం, తొలగించే విధానంపై తాజా మార్గదర్శకాలు జారీ

3

## మరో రెండు వారాలు కీలకం



- ఒకస్థాయికి పెరిగాకే కరోనా తగ్గుముఖం
- లాక్‌డౌన్‌తో వైరస్ విస్తరణకు అడ్డుకట్ట
- ప్రభుత్వ చర్యలు భేష్

పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

3

## మొండికిపోతే మనకే నష్టం



ప్రాణాలను కబళిస్తున్న కరోనా వైరస్‌ను తరిమికొట్టాలంటే హాట్ స్పాట్ ప్రాంతాల్లో ఇండ్ల నుంచి ఎవరూ బయటకురావద్దు. కొందరు మొండికిపోతే వారే బలవుతారు. కుటుంబ సభ్యులను కూడా సంకటంలో పెట్టినవారవుతారు. నమాజును సామూహికంగా కాకుండా ఎవరి ఇండ్లలోవారు చేసుకోవాలి.

**- ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ**

## గతేడాది మార్చి బిల్లులే ఇప్పుడూ చెల్లించాలి

**విద్యుత్ బిల్లులపై టీఎస్‌ఎస్పీడీసీఎల్**

2

### ఇవి ఖాళీ కార్లు కావు..



అమెరికాలో కరోనా విలయానికి సాక్ష్యమిది.. విశ్వమారి ప్రభావంతో టెక్సాస్ రాష్ట్రంలో లాక్‌డౌన్ విధించడంతో ప్రజలకు ఉచితంగా నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నారు. శాన్ ఆంటోనియో ప్రాంతంలో ఉన్న ఓ ఫుడ్ బ్యాంక్‌లో ఆహారపదార్థాలు తీసుకునేందుకు దాదాపు ఆరువేల కుటుంబాలు కార్లలో తరలివచ్చి.. క్యూ కట్టిన దృశ్యమిది.

## డాలర్‌డ్రీమ్స్‌పై హెచ్1బీ కత్తి

- కరోనాతో కుదేలైన అమెరికా ఆర్థికవ్యవస్థ
- భారీగా ఉద్యోగులను తొలిగిస్తున్న కంపెనీలు
- 90వేల మంది వీసాదారులకు ముప్పు

కరోనా వైరస్.. డాలర్ డ్రీమ్స్‌ను చెదురగొడుతున్నది. డాలర్లు సంపాదించి ఆర్థికంగా స్థిరపడాలనే తపనతో హెచ్1బీ వీసాపై అమెరికాకు వెళ్లిన ప్రవాస భారతీయుల కలలు సమాధి కాబోతున్నాయి. కరోనాతో అమెరికా ఆర్థిక రంగం కుదేలుకాగా.. అనేక సంస్థలు హెచ్1బీ ఉద్యోగులపై వేటువేస్తున్నాయి. ప్రస్తుతం అమెరికాలో దాదాపు మూడు లక్షల మంది హెచ్1బీ వీసాదారులుండగా.. రానున్న 5-7 నెలల్లో 20-30 శాతం మంది అంటే దాదాపు 90 వేల మందిని బలవంతంగానైనా స్వదేశాలకు పంపుతారని ప్రముఖ సంస్థలు స్పష్టం చేస్తున్నాయి. హెచ్1బీ వీసాదారులు 60 రోజులకుపైగా నిరుద్యోగులుగా ఉంటే అమెరికా విడిచివెళ్లిపోవాలన్న నిబంధన వారిపాలిట గండంగా మారనున్నది. ఈ గడువును 180 రోజులకు పెంచాలంటూ ఎన్నారైలు ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు.

5

## హైదరాబాద్‌లో కరోనా కిట్స్

- హువెల్ లైఫ్ సైన్సెస్ టెస్టింగ్ కిట్స్‌కు ఐసీఎంఆర్ ఆమోదం
- రోజుకు గరిష్ఠంగా 4వేల కిట్లు
- తయారీపై కంపెనీ ప్రణాళికలు
- సంస్థ డైరెక్టర్‌కు కేటీఆర్ అభినందన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌కు చెందిన 'హువెల్ లైఫ్ సైన్సెస్' సంస్థ అరుదైన ఘనత సాధించింది. కరోనా నిర్ధారణ పరీక్షలు జరుపడానికి ఆ సంస్థ అభివృద్ధి చేసిన టెస్ట్ కిట్‌కు 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్' (ఐసీఎంఆర్) ఆమోదం లభించింది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు వివిధ సంస్థలు తయారుచేసిన మొత్తం 24 కిట్లలో ఆరింటికి మాత్రమే ఐసీఎంఆర్ అనుమతి ఇచ్చింది. ఇందులో హువెల్ లైఫ్ సైన్సెస్ కిట్ కూడా ఉండటం విశేషం. అమెరికా నేషనల్ పబ్లిక్ హెల్త్ ఏజెన్సీ, సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) ప్రొటోకాల్‌ను అనుసరించి ఈ కిట్‌ను తయారుచేశారు. కొవిడ్-19తోపాటు సార్స్ వంటి ఇతర కరోనా వైరస్‌లను కూడా గుర్తించే విధంగా ఈ కిట్‌ను రూపొందించారు. డిటెక్షన్ కిట్, ఎక్స్‌ట్రాక్షన్ కిట్, మాలిక్యులర్ ట్రాన్స్‌పోర్ట్ మీడియం (ఎంటీఎం), నమూనా సేకరణకు స్వాబ్ సహా అన్నీ ఇందులో ఉంటాయి. తమ కిట్లకు ఐసీఎంఆర్ ఆమోదం లభించిన నేపథ్యంలో సంస్థ

మిగతా 3వ పేజీలో

### పట్నం కోసం ప్యాకింగ్



7

## ఆన్‌లైన్ రైతన్న

**వాట్సాప్‌లో కూరగాయల అమ్మకం**

**ఆదిలాబాద్ అన్నదాతల సృజనాత్మకత**

సమస్యతో కుమిలిపోలేదు! మహా ప్రళయాన్ని ఎదుర్కొనేందుకు విధించిన లాక్‌డౌన్‌తో ఉపాధి దారులు మూసుకుపోయాయని చింతిస్తూ కూర్చోలేదు! సంక్షోభవేళ తమలోని సృజనాత్మకతను బయటకు తీశారు! ఎప్పుడూ తమవద్దకు వినియోగదారులు వస్తే.. ఈసారి వాళ్లే వినియోగదారుల దగ్గరకు వెళ్లారు! వాట్సాప్ ఆసరాగా తమ కూరగాయల వ్యాపారాన్ని యథావిధిగా కొనసాగిస్తున్నారు. కూరగాయలు కావాల్సిన వారు లొకేషన్ షేర్ చేస్తే.. ప్యాక్‌చేసిమరీ నేరుగా ఇంటికి తీసుకెళ్లి ఇస్తున్నారు.. ఆదిలాబాద్ జిల్లా మన్నూర్ రైతులు!

## లక్షమంది బలి

**8 రోజుల్లో రెట్టింపు మరణాలు**

దేశదేశాల్లో కరోనా విలయతాండవం

ప్రపంచవ్యాప్తంగా కేసులు: **16,80,525**

మృతులు: **1,01,762**

కోలుకున్నది: **3,73,587**





దేశంలో కేసులు: **6761**

మృతులు: **206**

కోలుకున్నవారు: **515**

### తెలంగాణలో తగ్గుముఖం

తాజాగా **16** పాజిటివ్ కేసులు నమోదు



రాష్ట్రంలో కేసులు: **487**

మృతులు: **12** కోలుకున్నది: **45**



నిజమైన విద్య ఇతరులకు కూడా సాధికారత లభించేలా చూస్తుంది. ప్రపంచాన్ని ఇంతకన్నా మెరుగైన దిశగా నడిపిస్తుంది.
- మహాత్మా జ్యోతిబాపూలే

లాక్‌డౌన్-డే 19

ఉష్ణోగ్రతలు

| | గరిష్ఠం | కనిష్ఠం | | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|---|---|---|
| హైదరాబాద్ | 35.2°c | 21.5°c | మెదక్ | 36.0°c | 23.0°c |
| కరీంనగర్ | 38.0°c | 25.0°c | ఆదిలాబాద్ | 39.8°c | 22.7°c |
| వరంగల్ | 36.0°c | 21.5°c | నిజామాబాద్ | 39.4°c | 22.9°c |
| రామగుండం | 36.0°c | 23.0°c | మహబూబ్‌నగర్ | 35.7°c | 21.5°c |
| నల్లగొండ | 38.2°c | 23.4°c | ఖమ్మం | 38.0°c | 25.0°c |

## ఇండ్లలోనే పూలే జయంతి

**రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్ నేపథ్యంలో శనివారం మహాత్మా జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా బహిరంగ కార్యక్రమాలు, సభలు నిర్వహించవద్దని, ఇండ్లలోనే జరుపుకోవాలని ప్రభుత్వం సూచించింది. పూలే జయంతి అధికారిక కార్యక్రమాన్ని వాయిదావేస్తున్నట్టు తెలిపింది. ఈ మేరకు బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బీ వెంకటేశం శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

## గతేడాది మార్చి బిల్లులే ఇప్పుడూ చెల్లించాలి

**టీఎస్‌ఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో వివరాలు**



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** గతేడాది మార్చిలో కట్టిన విద్యుత్ బిల్లుల మొత్తమే ఇప్పుడు కూడా చెల్లించాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్‌ఎస్పీడీసీఎల్) అధికారులు కోరారు. ఏప్రిల్‌లో చెల్లించాల్సిన మార్చినెల తాత్కాలిక విద్యుత్ బిల్లుల వివరాలను అధికారులు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. టీఎస్‌ఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్ బిల్ ఎంక్వయిరీ ఆప్షన్ ఎంచుకుంటే బిల్లు మొత్తం ప్రత్యక్షమవుతుందని, దానిని ఆన్‌లైన్‌లోనే చెల్లించాలని సూచించారు. మార్చిలో వినియోగించిన విద్యుత్‌కు ఈ నెలలో బిల్లులు చెల్లించాల్సి ఉన్నది. లాక్‌డౌన్‌తో బిల్లులజారీకి అవకాశం లేకపోయింది. ఈ నేపథ్యంలో విద్యుత్ నియంత్రణ కమిషన్ అనుమతి తీసుకొని గతేడాది మార్చిలో చెల్లించిన విద్యుత్ బిల్లులే ఇప్పుడూ చెల్లించాలని ఉత్తర్వులు జారీచేశారు. గతేడాది మార్చి బిల్లుల వివరాలు డిస్కం అధికారులు వెబ్‌సైట్‌లో పెట్టారు.



## తగ్గిన పాజిటివ్ కేసులు

- తాజాగా 16 కేసులు నమోదు
- మొత్తం 487 మందికి పాజిటివ్
- ప్రజారోగ్యశాఖ బులెటిన్ వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య గణనీయంగా తగ్గింది. శుక్రవారం 16 పాజిటివ్ కేసులు మాత్రమే నమోదైనట్టు తెలంగాణ ప్రజారోగ్యశాఖ ప్రత్యేక బులెటిన్ తెలిపింది. ఇప్పటివరకు మొత్తం 487 మందికి పాజిటివ్ రాగా.. అందులో 12 మంది మరణించారని, 45 మంది కోలుకుని డిశ్చార్జి అయినట్టు తెలిపింది. 430 మంది ప్రభుత్వ దవాఖానల్లో చికిత్స పొందుతున్నట్టు వివరించింది. తెలంగాణలో ఇప్పటివరకు కమ్యూనిటీ ట్రాన్స్‌మిషన్ జరిగినట్టు నిర్ధారణ కాలేదని, 101 హాట్‌స్పాట్లను గుర్తించినట్టు బులెటిన్‌లో పేర్కొన్నారు. కరోనా కట్టడి చర్యలపై ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సోమేశ్ కుమార్ ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 11 గంటల వరకు అన్ని ప్రభుత్వశాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

**కరోనా పాజిటివ్ కేసుల వివరాలు**

| వివరాలు | శుక్రవారం ఒక్కరోజు | ఇప్పటివరకు మొత్తం |
|---|---|---|
| కొవిడ్-19 పాజిటివ్ | 16 | 487 |
| డిశ్చార్జి అయినవారు | -- | 45 |
| మరణాలు | - | 12 |
| చికిత్స పొందుతున్నవారు | 430 | -- |

## గురుకుల విద్యార్థులకు యాప్ బోధన

**అందుబాటులోకి ఓక్స్**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్‌తో ఇండ్లకు పరిమితమైన గిరిజన గురుకులాల విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన కోసం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్) ఆధ్వర్యంలో ఓక్స్ (ఆన్‌లైన్ అడాప్టెడ్ నాలెడ్జ్ సిస్టం) పేరిట విద్యాయాప్‌ను ప్రారంభించారు. ఎస్టీ గురుకులాల్లోని 6 నుంచి 9 తరగతుల విద్యార్థులు గణితం, జీవశాస్త్రం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, ఇతర విషయాలను ఇంటినుంచి నేర్చుకొనేందుకు ఈ యాప్‌ను వినియోగించాలని టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

### లోకం పోకడ




కరోనా నుంచే కాదు,
అప్పులోళ్ల నుంచి కూడా తప్పించుకుని వచ్చేశా!

# దేశానికే గరిశె.. తెలంగాణ మెరిసె

- పంజాబ్, హర్యానా తర్వాతి స్థానం
- రాష్ట్ర విభజన తర్వాత అనూహ్య వృద్ధి
- కనిపిస్తున్న ప్రాజెక్టుల నిర్మాణ ఫలితం
- 'నమస్తే తెలంగాణ'తో ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ అశ్వినీకుమార్‌గుప్తా



వరంగల్ అర్బన్ జిల్లాలో ముమ్మరంగా సాగుతున్న వరికోత పనులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ కొత్త రికార్డులు సృష్టించిందని, రాష్ట్ర విభజన అనంతరం అనూహ్యమైన అభివృద్ధి సాధించిందని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) జనరల్ మేనేజర్ అశ్వినీకుమార్‌గుప్తా చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగాచేపట్టి, పూర్తిచేసిన నీటిపారుదల ప్రాజెక్టుల ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయన్నారు. తాజా గణాంకాలను బట్టి చూస్తే దేశంలో ఆహారధాన్యాలను అత్యధికంగా ఉత్పత్తిచేస్తున్న రాష్ట్రాల్లో పంజాబ్, హర్యానా తర్వాత తెలంగాణ నిలిచిందని తెలిపారు. కేరళ, కర్ణాటకలతోపాటు పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాలకు కూడా ఇక్కడి నుంచే బాయిల్డ్‌రైస్ ఎగుమతి అవుతుండటం శుభపరిణామమని పేర్కొన్నారు. శుక్రవారం 'నమస్తే తెలంగాణ'తో పలు విషయాలపై వెల్లడించిన అభిప్రాయాలు ఆయన మాటల్లోనే..

### దిగుబడి ఊహించలేనిది

ఉమ్మడి రాష్ట్రంలోఎంత పంట దిగుబడి వచ్చేదో ఇప్పుడు ఒక్క తెలంగాణలోనే అంతకుమించి వస్తున్నది. ఈ యాసంగి సీజన్ ఆల్‌టైం రికార్డు ఉత్పత్తి 50 లక్షల టన్నుల ధాన్యం వస్తుందని అంచనా. ఇది గతంతో పోలిస్తే వందశాతం అధిక ఉత్పత్తి. ఆ మేరకు బియ్యం కొనుగోలుకు ఎఫ్‌సీఐ ఏర్పాట్లుచేస్తున్నది. తెలంగాణ ప్రజల అవసరాలకు సరిపోను (సివిల్‌సప్లై కార్పొరేషన్ కొన్న తర్వాత) మిగిలిన వాటిని ఎఫ్‌సీఐ కొనుగోలు చేస్తుంది. వాస్తవానికి ఇంత పెద్ద ఎత్తున ధాన్యం రావడం, ఎఫ్‌సీఐ దాన్ని బాయిల్డ్‌రైస్‌గా అమ్మడం మాకు ఓ పెద్ద సవాల్. మా సంస్థ అంచనాలకు కూడా అందనిది. అయితే, సీఎం కేసీఆర్ తరచూ చెప్పడంతో కొంత వరకు ప్రిపేర్‌రై ఉన్నాం.

### ప్రొడక్షన్ గ్రోత్ ఎక్కువే

ధాన్యం ఉత్పత్తిలో దేశంలోని మరే రాష్ట్రంలో కూడా ఇంత ప్రొడక్షన్ గ్రోత్ నమోదుకాలేదు. వంద శాతానికిపైగా ఉత్పత్తి పెరిగింది. గత వానకాలం సీజన్‌లోనే గ్రోత్ స్పష్టంగా కనిపించింది. యాసంగికి వచ్చేసరికి గ్రోత్‌రేట్ వంద శాతానికిపైగానే ఉన్నది. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు ఇప్పటికే నాలుగు లక్షల టన్నుల బియ్యాన్ని పంపించాం. లాక్‌డౌన్ మొదలయ్యాక 2.80 లక్షల టన్నుల ధాన్యం సరఫరా చేశాం. ఇది ఒక రికార్డు. తాజాగా పశ్చిమ బెంగాల్ నుంచి 2.25 లక్షల టన్నుల ధాన్యం కావాలని అడిగారు. వాస్తవానికి ఛత్తీస్‌గఢ్, ఒడిశాల నుంచి బెంగాల్‌కు బియ్యం వెళ్తాయి. తొలిసారి తెలంగాణ నుంచి వెళ్లనున్నాయి. ప్రస్తుతం తెలంగాణలోని ఎఫ్‌సీఐ వద్ద 15 లక్షల టన్నుల నిల్వలున్నాయి. యాసంగిలో మరో 50 లక్షల టన్నులు రానున్నాయి. ఇక్కడ ఉత్పత్తయ్యే ధాన్యంతో దక్షిణాది రాష్ట్రాలకు పూర్తిగా, బెంగాల్ వంటి రాష్ట్రాలకూ బియ్యం తాత్కాలికంగా సరఫరాచేస్తున్నాం. ఒక రకంగా చెప్పాలంటే దేశానికే తెలంగాణ అన్నం పెడుతున్నదంటే అతిశయోక్తి కాదేమో.

### కనిపిస్తున్న ప్రాజెక్టుల ఫలితం

తెలంగాణ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టింది. దీని ఫలితాలు కనిపిస్తున్నాయి. ఈ స్థాయి ఉత్పత్తి మామూలు విషయం కాదు. గతంలో ఈ తరహా పంట పంజాబ్‌లో కనిపించేది. ఇప్పుడు తెలంగాణలో 50 లక్షల టన్నులు రానున్నాయి. వచ్చే యాసంగికి ఇది మరింత పెరుగడం ఖాయం. లాక్‌డౌన్‌లో కూడా ఎఫ్‌సీఐకి చెందిన వెయ్యిమంది ఉద్యోగులు, రెండు వేలమంది హమాలీలు అద్భుతంగా పనిచేస్తున్నారు. రోజుకు 11 గూడ్స్ రేక్‌లు నింపుతున్నారు. కర్ణాటకకు ఏడురేక్‌ల చొప్పున బియ్యం పంపించాం. ఇప్పుడు బెంగాల్‌కు పంపించే పని మొదలుపెడుతున్నాం.

### అన్నదానానికి బియ్యమిస్తాం..

పేదలకు బియ్యం పంపిణీ చేయాలనుకొనే స్వచ్ఛంద సంస్థగానీ, చారిటీ ట్రస్టుగానీ తమను సంప్రదిస్తే వారికి కిలో రూ.22 చొప్పున ఇస్తాం. ఎంత బియ్యం కావాలంటే అంత ఇస్తాం. అయితే, పది క్వింటాళ్ల బియ్యం కన్నా ఎక్కువ తీసుకోవాలి. ఎఫ్‌సీఐ కార్యాలయాల్లో సంప్రదిస్తే వెంటనే బియ్యం మంజూరు చేస్తాం.

## వైద్య పరికరాలపై పన్ను వద్దు

- కేంద్రమే వాటిని రాష్ట్రాలకు అందజేయాలి
- కేంద్రమంత్రి హర్షవర్ధన్‌కు మంత్రి ఈటల విజ్ఞప్తి



కేంద్రమంత్రి హర్షవర్ధన్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి ఈటల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలో తయారయ్యే మందులు, వైద్యపరికరాలపై పన్ను ఎత్తివేయాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్.. కేంద్రమంత్రి హర్షవర్ధన్‌ను కోరారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకొనే వైద్యపరికరాలకు కూడా కస్టమ్స్, ట్యాక్స్‌ను రద్దుచేయాలని విజ్ఞప్తిచేశారు. దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల వైద్యారోగ్యశాఖ మంత్రులతో హర్షవర్ధన్ శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో మంత్రి ఈటల బీఆర్కేభవన్‌నుంచి పాల్గొన్నారు. వెంటిలేటర్లు, ఎన్-95 మాస్కులు, పీపీఈకిట్లు, టెస్టింగ్ కిట్లు, ఇతర వైద్య పరికరాలను ఈసీఐఎల్, డీఆర్డీవో వంటి సంస్థల్లో తయారుచేయించి రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేయాలని ఈటల కోరారు. కరోనా వైద్య పరికరాలను బ్లాక్‌మార్కెట్ చేయకుండా నియంత్రించాలని, వాటిని కేంద్రమే సేకరించి రాష్ట్రాలకు అందించాలని విన్నవించారు. కరోనా నేపథ్యంలో తెలంగాణలో నెలకొన్న పరిస్థితులను వివరించిన ఆయన.. లాక్‌డౌన్ పొడిగించే అంశంపై అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను తీసుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో కమ్యూనిటీ ట్రాన్స్‌మిషన్ జరుగలేదని, ఇక్కడి పాజిటివ్ కేసుల్లో 85 శాతం మర్కాజ్ నుంచి వచ్చినవేనని తెలిపారు. ఇవి తగ్గితే కేసుల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని కేంద్రమంత్రికి వివరించారు.

### కరోనా కట్టడికి ఐఏపీపీ విరాళం

కొవిడ్-19 చికిత్సకు అవసరమైన వైద్యపరికరాలను ఇచ్చేందుకు ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ (ఐఏపీపీ) జంటనగరాల విభాగం ముందుకొచ్చింది. ఐఏపీపీ ప్రతినిధులు రూ.14 లక్షల విలువైన వైద్యపరికరాలను శుక్రవారం మంత్రి ఈటల రాజేందర్‌కు అందజేశారు. వాటిని గాంధీ, నిలోఫర్ దవాఖానల్లో వాడాలని కోరారు. విరాళంలో ఎన్-95 మాస్కులు, పీపీఈకిట్లు, ఏరో మిషన్లు ఉన్నాయి. మంత్రిని కలిసినవారిలో ఐఏపీపీ జంటనగరాల విభాగం అధ్యక్షుడు సీఎన్ రెడ్డి, కార్యదర్శి భాస్కర్, కోశాధికారి శ్రీధర్, కార్యవర్గసభ్యులు లాలూప్రసాద్ రాథోడ్, అజయ్ ఉన్నారు.

## అన్నదాత ఈ టైలరమ్మ

రోజుకు 40 మంది పేదలకు అన్నదానం • పారిశుద్ధ్య కార్మికులు, వైద్యసిబ్బందికి 350 మాస్కుల పంపిణీ

**అయిజ:** ఉమాదేవి..! నిన్నటిదాకా ఆమె ఒక సాధారణ టైలర్. నేడు సాక్షాత్తు అన్నపూర్ణమ్మ!! కరోనా కష్టకాలంలో ఆకలితో అలమటిస్తున్న పేదలకు కడుపునిండా అన్నం పెడుతున్న దొడ్డమనసు ఆమెది. ఒకరా.. ఇద్దరా రోజుకి నలభై మందికి వండివార్చుతున్న దేవత. ఆమెది జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణం. టైలరింగ్ ఆమె వృత్తి. ఆమె భర్త విరూపాక్షరెడ్డి రైతు. లాక్‌డౌన్ నేపథ్యంలో మహారాష్ట్రకు చెందిన కూలీలు పస్తులుండటం ఉమాదేవిని కదిలించింది. తమ షాపు పక్కనే ఉన్న హోటల్లో పనిచేసే ఓ కుటుంబం భోజనంలేక అవస్థ పడుతుండటాన్ని చూసి చలించిపోయారు. లాక్‌డౌన్ ముగిసేవరకు తానే భోజనం పెడుతానంటూ వారిని అక్కున చేర్చుకొన్నారు. ఇలా ఉపాధిలేక అవస్థలు పడుతున్న దాదాపు నలభై మందికి ప్రతిరోజూ అన్నం వండిపెడుతున్నారు. వారంతా ఆమెను అన్నపూర్ణమ్మగా కొనియాడుతున్నారు. కరోనాపై సాగుతున్న యుద్ధంలో ముందువరుసలో నిల్చొని పనిచేస్తున్న ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, వైద్యసిబ్బందితోపాటు పారిశుద్ధ్య సిబ్బంది కోసం దాదాపు 350 మాస్కులను తన సొంత ఖర్చులతో కుట్టి, ఉచితంగా పంపిణీచేసిన ఆదర్శమూర్తి ఉమాదేవి. తన వద్ద టైలరింగ్ నేర్చుకొంటున్న మహిళలు కూడా ఆమెకు చేదోడుగా నిలుస్తుండటం మరో విశేషం.



జోగుళాంబ గద్వాల జిల్లా అయిజలో అనాథ వృద్ధురాలికి అన్నం పార్సిల్ అందజేస్తున్న ఉమాదేవి

### ఉపాధిలేకపోతే ఆ బాధేంటో తెలిసినవాళ్లం

**మేం** 28 ఏండ్ల క్రితం అయిజకు వచ్చాం. టైలరింగ్ యూనిట్ నెలకొల్పి, ఇప్పటివరకు 400 మందికిపైగా మహిళలకు ఉచితంగా శిక్షణ ఇచ్చాను. మా దగ్గర టైలరింగ్ నేర్చుకొన్నవారికి ఉపాధి కల్పిస్తున్నాం. ఉపాధిలేకపోతే పడే బాధలను కళ్లారా చూసినవాళ్లం. అందుకే ఈ కష్టకాలంలో ఉపాధి కోల్పోయిన కూలీలకు, అనాథలకు అన్నంపెట్టి, ఆకలి తీర్చాలని సంకల్పించాను. మా యూనిట్‌లో పనిచేస్తున్న మహిళలతో కలిసి, ఇంటి వద్దే శుచిగా, శుభ్రంగా వంటచేస్తున్నాం. కొందరికి మా ఇంటివద్దే భోజనం పెడుతున్నాం. మరికొందరికి వారివద్దకే అన్నం తీసుకెళ్తున్నాం. ఎంత ఖర్చయినా సరే లాక్‌డౌన్ కొనసాగినంతకాలం అన్నదానం చేయాలనుకుంటున్నాం. ఇందుకు నా భర్త ప్రోత్సాహం ఉన్నది. కష్టాల్లో ఉన్న నిరుపేదలను ఆదుకోవాలని పెద్దలు చెప్పేవారు. వారి ఆశయాలను నెరవేర్చే లక్ష్యంతో ఈ పనిచేస్తున్నాం.

**- ఉమాదేవి, అమ్మ భగవాన్ టైలరింగ్ యూనిట్, అయిజ**



### 14 దినాలుగా బువ్వ పెడుతున్నరు

**ఏదో** మాయదారి రోగం వచ్చిందంట.. పట్నంలో అన్ని బందు బెట్టిండ్రు. గతంలో ఓ హోటల్‌లో నాకు బువ్వ బెట్టేటోళ్లు. హోటల్ మూసేయడంతో కష్టమైంది. టైలరమ్మ దినాం రెండుపూటలకు సరిపడే బువ్వను ఇంటికే పంపుతది. అది తిని కాలం గడుపుతున్న.

**-కాకె నర్సమ్మ, అభాగ్యురాలు, అయిజ**

### ఎంతో సంతృప్తిగా ఉన్నది



**కరోనా** వల్ల మాలాంటివాళ్లు ఎంతోమంది ఉపాధికోల్పోయారు. అనాథలకు అన్నదానం చేద్దామని ఉమాదేవి చెప్పారు. ఆమెకు మా యూనిట్ సభ్యులం సహకరిస్తున్నాం. కూరగాయలు తరగడం, వంట చేయడం, పార్సిల్ కట్టడంలాంటి పనులు చేస్తున్నాం. ఎంతో ఆత్మ సంతృప్తి కలుగుతున్నది.

**-సాహితి, టైలర్, అయిజ**



ములుగు జిల్లాలో నిర్మాణంలో ఉన్న సమ్మక్క బరాజ్ (ఫైల్)

## సమ్మక్క బరాజ్‌కు అటవీ భూమి

**కేంద్ర వన్యప్రాణి సంరక్షణ బోర్డు అనుమతి**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గోదావరి నదిపై నిర్మించతలపెట్టిన సమ్మక్క బరాజ్‌కు అటవీ భూమి బదలాయింపునకు కేంద్ర వన్యప్రాణి సంరక్షణ బోర్డు పచ్చజెండా ఊపింది. 26 హెక్టార్ల అటవీభూమిని ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించింది. ములుగు జిల్లాలోని ఏటూరునాగారం అభయారణ్యం కింద ఉన్న భూమిని బరాజ్ నిర్మాణానికి కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. కేంద్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ అధ్యక్షతన గురువారం జరిగిన ఆన్‌లైన్ సమావేశంలో రాష్ట్రానికి చెందిన రెండు ప్రాజెక్టులకు అనుమతి ఇచ్చారు. సమ్మక్క బరాజ్‌తో పాటు కాగజ్‌నగర్ రైల్వే మూడో బ్రాడ్‌గేజ్ లైన్ ఏర్పాటుకు కూడా వైల్డ్‌లైఫ్ బోర్డు అనుమతినిచ్చింది.

## కరోనా కట్టడికి కేసీఆర్ చర్యలు భేష్

- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రశంస
- రాష్ట్రంలో పరిస్థితులపై వినోద్‌కుమార్‌తో ఫోన్‌లో ఆరా



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ నియంత్రణ కోసం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చేపడుతున్న చర్యలు బాగున్నాయని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రశంసించారు. వైరస్‌ను తుదముట్టించే దాకా ఇదే స్ఫూర్తితో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌కు ఫోన్‌చేసి రాష్ట్రంలోని తాజా పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. కరోనా వైరస్ ప్రబలకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నదని ఈ సందర్భంగా వినోద్‌కుమార్ ఉపరాష్ట్రపతికి వివరించారు. లాక్‌డౌన్‌ను పక్కాగా అమలుచేస్తున్నామని, పేదలు, వలస కార్మికులను ప్రభుత్వపరంగా ఆదుకుంటున్నామని చెప్పారు. దాతలను ప్రోత్సహించడం ద్వారా బియ్యం, నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్నామని, అవసరమైనచోట భోజన వసతి కల్పిస్తున్నామని వినోద్‌కుమార్ తెలిపారు.

## పట్టు సడలొద్దు

మొదటిపేజీ తరువాయి...

కోరారు. రేషన్‌షాపుల ద్వారా నియంత్రిత పద్ధతిలో అందజేస్తున్న ఉచిత బియ్యం పంపిణీ పథకం లబ్ధిదారులు నిర్దేశిత సమయంలో వచ్చి, నిర్ణీత దూరం పాటిస్తూ పొందాలని సూచించారు. పాలు, పండ్లు, కూరగాయలు, మందులు, మాంసం తదితర విక్రయాలు యథావిధిగా కొనసాగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. షాపుల వద్ద జనం గుమిగూడకుండా, దూరం పాటించేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రేషన్‌కార్డున్న ప్రతి కుటుంబానికి రూ.1500 చొప్పున బ్యాంకు ఖాతాలో జమచేసే కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైందని, అర్హులందరికీ డబ్బులు అందుతాయని భరోసా ఇచ్చారు. గ్రామాల్లో వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు కేంద్రాలను అధికారులు సరిగా నిర్వహించాలని, రైతులు చెప్పిన సమయానికే వచ్చి, తమ ధాన్యం అమ్ముకోవాలని సూచించారు. పట్టణ ప్రాంతాలు, ఇతరచోట్ల వలస కూలీల కోసం ఏర్పాటుచేసిన శిబిరాలను, సహాయ కార్యక్రమాలను అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు ఎస్ నర్సింగ్‌రావు, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు కరోనా పరీక్షలకు సంబంధించిన వివరాలు, పాజిటివ్ కేసులకు అందిస్తున్న చికిత్స గురించి సీఎంకు నివేదించారు. శుక్రవారం కొత్తగా 16 మందికి పాజిటివ్ రిపోర్ట్స్ రాగా, వారికి చికిత్స అందిస్తున్నామని తెలిపారు. వారి కుటుంబసభ్యులను, వారితో కాంటాక్ట్ అయిన వారిని కూడా గుర్తించి క్వారంటైన్ చేసినట్టు అధికారులు వివరించారు.

## లాక్‌డౌన్‌పై నేడు కీలక నిర్ణయం!

**కరోనా** కట్టడికి లాక్‌డౌన్‌ను పొడిగించాలా? వద్దా? అనే అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శనివారం కీలక నిర్ణయం తీసుకొనే అవకాశం ఉన్నది. లాక్‌డౌన్ డెడ్‌లైన్ ఈ నెల 14తో ముగుస్తున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవిష్యత్ కార్యాచరణపై సమాలోచనలు సాగిస్తున్నాయి. ప్రధాని మోదీ శనివారం ఉదయం 11 గంటలకు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఇందులో ముఖ్యమంత్రులు చెప్పే అభిప్రాయాల ఆధారంగా కేంద్రం లాక్‌డౌన్ పొడిగింపుపై నిర్ణయం తీసుకొనే అవకాశం ఉన్నది. మరోవైపు, తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం కూడా సీఎం కేసీఆర్ అధ్యక్షతన మధ్యాహ్నం మూడుగంటలకు ప్రగతిభవన్‌లో సమావేశం కానున్నది. రాష్ట్రంలో కరోనా వైరస్ వ్యాప్తి, దానివల్ల ఉత్పన్నమైన పరిస్థితులతోపాటు, లాక్‌డౌన్ పొడిగించే అంశంపై చర్చించనున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సమగ్రంగా చర్చించి, భవిష్యత్ వ్యూహం రూపొందించనున్నారు. రాష్ట్రంలోని పేదలు, ఇతర రాష్ట్రాల వలస కార్మికులకు అందుతున్న సాయంపై చర్చిస్తారు. రైతుల ధాన్యం, ఇతర పంటల కొనుగోళ్లతోపాటు ఇటీవల కురిసిన వడగండ్ల వానల వల్ల వాటిల్లిన నష్టంపై మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నట్టు సమాచారం. లాక్‌డౌన్‌తో దేశంలో కొవిడ్-19 వ్యాప్తికి అడ్డుకట్ట పడిందని భావిస్తున్న సమయంలో తబ్లిగీ లింకులు కలకలం సృష్టించాయి. ఆ తర్వాత కరోనా పాజిటివ్ కేసులు భారీగా పెరిగాయి. దేశంలోని అనేక ప్రాంతాలు హాట్‌స్పాట్లుగా మారాయి. ఈ నేపథ్యంలో మరికొన్ని రోజులపాటు లాక్‌డౌన్‌ను పొడిగించడమే ఉత్తమమని ముఖ్యమంత్రి కేసీఆర్ అందరి కంటే ముందుగానే సూచించారు. ఈ మేరకు ప్రధానికీ విజ్ఞప్తిచేశారు. ఇదే విషయాన్ని ఇటీవల ప్రధాని నిర్వహించిన పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్‌లీడర్ల వీడియో కాన్ఫరెన్స్‌లోనూ టీఆర్‌ఎస్ ఎంపీలతో స్పష్టంగా చెప్పించారు. టీఆర్‌ఎస్‌తోపాటు 80శాతం మంది పార్లమెంటరీ పార్టీ నేతలు లాక్‌డౌన్ కొనసాగించాలన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఇప్పటికే ఒడిశాలో లాన్‌డౌన్‌ను ఈ నెలాఖరు వరకు పొడిగించారు. మరో ఎనిమిది రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా లాక్‌డౌన్ పొడిగించాలని సూచించారు. ఈ నేపథ్యంలో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్ కీలకంగా మారనున్నది.

## కరోనాపై సీఎం కేసీఆర్ సాహస పోరు

**తెలంగాణ బాటలోనే ఇతర రాష్ట్రాలు • తనికెళ్ల భరణి ప్రశంస**



**యూసుఫ్‌గూడ:** రాష్ట్రంలో కరోనా మహమ్మారిని సీఎం కేసీఆర్ ధైర్యంగా ఎదుర్కొంటున్నారని ప్రముఖ రచయిత, సినీనటుడు తనికెళ్ల భరణి ప్రశంసించారు. ముందుగానే లాక్‌డౌన్ పెట్టి అప్రమత్తమయ్యారని, తెలంగాణను స్ఫూర్తిగా తీసుకొని ఇతర రాష్ట్రాలూ అదేబాటలో నడిచాయని పేర్కొన్నారు. ప్రకృతి పట్ల మానవాళిచేసిన తప్పిదమే ప్రస్తుత విపత్తు అని అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ.. కరోనా విపత్తుతో నేడు ప్రకృతి సేద తీరుతున్నదని పేర్కొన్నారు. ఆకాశంలో పక్షులు, రోడ్లపై జంతువులు స్వేచ్ఛగా తిరుగుతున్నాయని, ఈ విపత్తు మానవాళికి శాపం, పశుపక్ష్యాదులకు వరమని వ్యాఖ్యానించారు. ఇది యావత్ భూగోళానికి వచ్చిన కష్టమని చెప్పారు. ప్రకృతి దయతోనే కరోనా విపత్తు నుంచి ఎలాగైనా బయటపడుతామని పేర్కొన్నారు. లాక్‌డౌన్‌తో ఇంట్లోనే ఉంటూ పుస్తక పఠనం చేస్తున్నట్టు తెలిపారు. జాషువా సాహిత్యం చదువుతూ, శ్రీకృష్ణదేవరాయ పద్యాలు, ప్రాచీన పద్యాలను కంఠస్థం చేస్తున్నట్టు చెప్పారు. తన సిబ్బందికి ముందుగానే జీతం, నిత్యావసరాలను అందజేసినట్టు తెలిపారు. సినీ కార్మికుల సంక్షేమం కోసం టీసీసీ ట్రస్ట్‌కు తనవంతు సాయం అందించానని చెప్పారు.



ముఖ్యమంత్రి సహాయనిధి
meesevasupport@telangana.gov.in
ఖాతా నంబర్ : 62354157651
ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్0020077
ఎస్‌బీఐ, సెక్రటేరియట్ బ్రాంచ్, హైదరాబాద్.
వాట్సాప్: 9121006471 / 9121006472
https://ts.meeseva.telangana.gov.in/covid/covidcontribution.htm





ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును కలిసి సీఎంఆర్‌ఎఫ్‌కు విరాళంగా రూ.కోటి చెక్కును అందజేస్తున్న గంగవరం పోర్ట్ లిమిటెడ్ చైర్మన్ డీవీఎస్ రాజు. చిత్రంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, సంస్థ చైర్మన్ కుమారుడు రాజేశ్‌రాజ్ ఉన్నారు.

## రక్త సేకరణకు ప్రత్యేక కార్యాచరణ

- విధివిధానాలను వెల్లడించిన ఐపీఎం డైరెక్టర్




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్‌తో తలెత్తిన రక్తం కొరతను అధిగమించేందుకు, అత్యవసరమైన వారికి సకాలంలో అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఎటువంటి ఇన్ఫెక్షన్లు సోకకుండా నారాయణగూడలోని ఐపీఎం బ్లడ్ సెంటర్ ద్వారా దాతల నుంచి రక్తాన్ని సేకరించాలని నిర్ణయించింది. ఇందుకోసం ఐపీఎంకు అదనపు సిబ్బందిని ఏర్పాటుచేసింది. రక్త సేకరణకు సంబంధించిన విధి విధానాలను ఐపీఎం డైరెక్టర్ శంకర్ శుక్రవారం వెల్లడించారు. ఐపీఎం సెంటర్‌లో రోజుకు 115 యూనిట్లు సేకరించనున్నట్టు తెలిపారు. అత్యవసరమైనవారికి ఆయా దవాఖానలు, ప్రభుత్వ బ్లడ్ బ్యాం కుల నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు సంచార వాహనాల ద్వారా రక్తం యూనిట్లను అందజేయనున్నట్టు చెప్పారు. రక్త దాతలు 84979 58597 నంబర్ లేదా 04029569047 నంబర్‌కు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు సంప్రదించాలని, ఈ-రక్తకోశ్ పోర్టల్‌లో స్లాట్‌ను నమోదు చేసుకోవాలని శంకర్ సూచించారు. స్లాట్ బుక్‌చేసినవారికి ఎన్బీటీసీ మార్గదర్శకాల ప్రకారం వాట్సాప్/ ఇ-మెయిల్ ద్వారా మెడికల్ ఆఫీసర్ స్టాంప్, సంతకంతో రక్తదాత పాస్‌లు ఇస్తారని తెలిపారు.

## కరోనా కట్టడికి విరాళాల వెల్లువ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా కట్టడికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు పలు సంస్థలు, పలువురు వ్యక్తులు తమ వంతు సాయం చేస్తున్నారు. ముఖ్యమంత్రి సహాయనిధికి చెక్కుల ద్వారా అందజేస్తున్నారు. శుక్రవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను కలిసి పలువురు ప్రముఖులు కలిసి చెక్కులు అందజేశారు. జడ్చర్లకు చెందిన తడకమళ్ల చంద్రశేఖర్ కుమారులు నందకిశోర్, శ్రీమాన్ తాము కిడ్డీబ్యాంక్‌లో దాచుకున్న రూ.6,661 ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి విరాళంగా అందించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా మండలం గొల్లపల్లికి చెందిన పాతూరు ప్రవీణ్‌రెడ్డి-సరిత కూతుళ్లు త్రిపుర, అక్షర వలస కూలీలకు రూ.3, 600 అందజేశారు.

**శుక్రవారం విరాళాలు ఇచ్చినవారి వివరాలు (రూ.లో)**

| | |
|---|---|
| రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) | 5 కోట్లు |
| మైహోం | 3 కోట్లు |
| గంగవరం పోర్ట్ లిమిటెడ్ | కోటి |
| అమీర్‌పేట్, ఎస్సార్‌నగర్ హాస్టల్స్ అసోసియేషన్, ఇతర వెల్ఫేర్ అసోసియేషన్లు | 45.33 లక్షలు |
| తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ | 42 లక్షలు |
| చేవేళ్ల నియోజకవర్గానికి చెందిన 18 మంది | 30.88 లక్షలు |
| సుమధుర ఇన్‌ఫ్రా | 25 లక్షలు |
| తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ | 25 లక్షలు, |
| వర్క్స్ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ | 25 లక్షలు |
| వాసవి రియల్ ఎస్టేట్స్ ఒక్కొక్కరు రూ. | 25లక్షలు |
| దీపిక్షిత మహిళా క్లబ్ | 21 లక్షలు |
| విరుపాక్షి ఆర్గానిక్స్ | 15 లక్షలు |
| వెర్మాంట్ డెవలపర్స్ | 11 లక్షలు |
| శ్రీకో ప్రాజెక్ట్స్ | 10 లక్షలు |
| తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ | 10 లక్షలు |
| క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా | 10 లక్షలు |
| జనప్రియ ఇంజినీర్స్ సిండికేట్ | 10 లక్షలు |
| నక్షత్ర ఐటీ సర్వీసెస్ | 10 లక్షలు |
| చిన్మయ సేవా ట్రస్ట్ | 10 లక్షలు |
| శ్రీవెంకటేశ్వర సినీ క్రియేషన్స్ | 10లక్షలు |
| మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య | 10 లక్షలు |

# ..ప్రపంచమంతా లాక్‌డౌన్

మొదటిపేజీ తరువాయి...

చేయడం ద్వారా ఎక్కువ ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి 8 గంటల నుంచి 9.30 వరకు ట్విట్టర్‌లో ఆస్క్‌కేటీఆర్ ట్యాగ్‌లో అందుబాటులో ఉన్న ఆయన పలువురి ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ప్రస్తుత సంక్షోభం తర్వాత ప్రభుత్వాలు తమ ప్రాధాన్యాలను మార్చుకొని వైద్యరంగానికి మరింత ప్రాధాన్యమిచ్చే అవకాశం ఉన్నదని తెలిపారు. అన్ని ప్రభుత్వాలకు ఇది కనువిప్పు లాంటిదని.. ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలు ఈ విషయాన్ని గుర్తించాయని అన్నారు. కరోనా చికిత్సలో ప్రపంచంలో ఎక్కడ మంచివిధానం ఉన్నా.. దానిని రాష్ట్రంలో అమలుచేస్తామని తెలిపారు. వైరస్ వ్యాప్తిచెందుతున్న కొన్ని హాట్‌స్పాట్లను గుర్తించామని, అలాంటిచోట్ల సామూహిక కరోనాటెస్టులతో ఫలితం ఉండే అవకాశం ఉన్నదని, ఆ దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నదన్నారు. కరోనా సంక్షోభం వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుద్ధ్యం వంటి కీలకమైన అంశాలపై అందరికీ గుణపాఠం నేర్పిందని, దీంతోపాటు అవసరమైన మేరకు వైద్య సదుపాయాలు, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిచ్చేలా చేసిందని తెలిపారు. వైరస్ వ్యాప్తి కట్టడికి కృషిచేస్తున్నవారి బాగోగులు చూసుకోవాల్సిన అవసరం ఉందన్న విషయం అందరికీ తెలిసిందన్నారు. వైరస్ కట్టడి కోసం పనిచేస్తున్న వైద్యులు, నర్సులు, ఇతర వైద్యసిబ్బంది, పోలీసులు, ఇతరరంగాలకు చెందిన ప్రతిఒక్కరిపై ప్రజలకు ప్రత్యేకంగా గౌరవభావం ఏర్పడిందని తెలిపారు. సంక్షోభం సమయంలో సహాయం ఎంత చిన్నదైనా, ఎలాంటిమార్గంలో అయినా చేయడం మంచిదని , ఇందుకోసం ప్రతి ఒక్కరూ ముందుకురావాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్లు, టీచర్లు అద్భుతంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు.

### లాక్‌డౌన్‌తో స్వీయక్రమశిక్షణ

కరోనా వైరస్‌కు వ్యాక్సిన్ దొరికేవరకు దేశాల మధ్య రాకపోకలను సంపూర్ణంగా నిషేధించడం సాధ్యం కాకపోవచ్చని మంత్రి కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుత లాక్‌డౌన్ ద్వారా ప్రజల్లో స్వీయక్రమశిక్షణ ఏర్పడిందని, దీన్ని భవిష్యత్‌లోనూ కొనసాగించాలని కోరారు. విద్యార్థుల పరీక్షలపై ఆందోళన చెందుతున్నారని, అయితే ప్రస్తుతం ఉన్నది అంతకంటే పెద్ద పరీక్షా సమయమని అన్నారు. తల్లిదండ్రులు కొంత ఓపికపట్టాలని.. పరీక్షల షెడ్యూల్‌కు సంబంధించి ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులు డిజిటల్ తరగతులపై దృష్టిపెట్టాలని సూచించారు. లాక్‌డౌన్ మొదలైన తర్వాత పుట్టినపాపలకు ఇంటివద్దే వ్యాక్సిన్ వేసే అంశాన్ని గురువారం ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు.




శుక్రవారం ట్విట్టర్ ట్రెండ్స్‌లో ప్రథమస్థానంలో నిలిచిన ఆస్క్ కేటీఆర్ కార్యక్రమం

### అన్ని రకాల పరిశ్రమలపై ప్రభావం

కరోనా ప్రభావం ఐటీ సహా అన్నిరకాల పరిశ్రమలపై పడుతుందని కేటీఆర్ అన్నారు. ఎమ్మెస్‌ఎంఈ పరిశ్రమలను ఆదుకునేందుకు కేంద్రప్రభుత్వంతో చర్చిస్తున్నట్టు తెలిపారు. తన టీంతోపాటు వైద్యారోగ్యశాఖ అధికారులతో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. సంక్షోభ సమయంలో సోషల్ మీడియా ద్వారా ప్రజలతో కనెక్ట్ అయ్యేందుకు అవకాశం కలుగుతున్నదని అన్నారు. ఎక్కువ సమయం సోషల్ మీడియాలో అందుబాటులో ఉండటం ద్వారా ఏమైనా ఇబ్బంది ఎదురవుతున్నదా? అని ప్రశ్నించగా.. నిద్రకు సమయం ఉండటంలేదని కేటీఆర్ సమాధానమిచ్చారు. లాక్‌డౌన్ నాటినుంచి మంత్రి కేటీఆర్, ఆయన కార్యాలయం స్పందిస్తున్న తీరుపై పలువురు అభినందనలు తెలిపారు. సినిమాలో నటించాలంటూ ఎవరూ తనను అడగలేదని ఓ ప్రశ్నకు సమాధానంగా కేటీఆర్ చెప్పారు.

### ఈ సమయంలో రాజకీయాలకు అవకాశం లేదు

ప్రస్తుతం నిర్వహిస్తున్న ఉద్యోగాన్ని రియలిస్టిక్ అప్రోచ్‌లో చేయడం ద్వారానే ఇతరులకు సహాయపడుగలుగుతున్నానని మంత్రి కేటీఆర్ తెలిపారు. జీవితంతోపాటు రాజకీయంగా తనకున్న పరిమితులేమిటో తెలుసునని.. అయితే ప్రస్తుతం అధికారం వల్ల ఎక్కువమందికి సహాయపడుతున్నానని వివరించారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో రాజకీయాలకు అవకాశం లేదని పేర్కొన్నారు. మనసుకు నచ్చిన పనులు చేయడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చునని తెలిపారు.

## ఏపీకి మైహోం రూ.3 కోట్ల విరాళం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా కట్టడి సహాయచర్యల కోసం ఏపీ సీఎం సహాయనిధికి మైహోం ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ రూ.3 కోట్ల విరాళం ఇచ్చింది. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో రూ.3 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆ కంపెనీ ఎండీ జే రంజిత్‌రావు శుక్రవారం అందించారు.

## రాష్ట్ర ఖజానాకు రూ.269 కోట్లు

- కేంద్రం నుంచి జీఎస్టీ పరిహారం విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వస్తు సేవల పన్ను (జీఎస్టీ) పరిహారం కింద రాష్ట్రానికి రావాల్సిన బకాయిల్లో కొంత మొత్తాన్ని కేంద్రం విడుదలచేసింది. అక్టోబర్, నవంబర్‌కు సంబంధించిన పరిహారం కింద రాష్ట్రవాటాగా రూ.268.83 కోట్లు ఖజానాకు చేరాయి. ఇప్పటికే గత ఆర్థిక సంవత్సరం బకాయిలకు సంబంధించి రెండు విడుతలుగా రూ.1,100 కోట్లు వచ్చాయి. మరో రూ.500 కోట్ల వరకు విడుదల కావాల్సి ఉన్నది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు కలిపి కేంద్రం రూ.15 వేలకోట్లు విడుదల చేసింది.

## ఐసొలేషన్ టెస్టింగ్ క్యాబిన్



*కొవిడ్-19 బాధితులకు పరీక్షలు చేసే సమయంలో వైద్యుల భద్రత కోసం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ఐడీఏలోని రాసు టూల్స్ సంస్థ ఐసొలేషన్ టెస్టింగ్ క్యాబిన్‌ను రూపొందించింది. వైద్యుడు బయటఉండి క్యాబిన్‌లోపల ఉన్న బాధితుడిని పరీక్షించేలా దీన్ని తయారు చేశారు. – నమస్తే తెలంగాణ, పటాన్‌చెరు*

## చివరిదశలో ప్లాస్మా థెరపీ

- డీసీజీఐ ఆమోదం కోసం ఎదురుచూపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొవిడ్-19 బాధితుల చికిత్సలో కీలకంగా మారనున్న ప్లాస్మాథెరపీ ప్రక్రియ చివరిదశకు చేరుకొన్నది. వైరస్ బారినపడి కోలుకున్న వ్యక్తి రక్తంలోని ప్లాస్మాను కొవిడ్-19 రోగుల చికిత్సకు వినియోగిస్తారు. పలు దేశాలు క్లినికల్ ట్రయల్స్ నిర్వహించగా.. భారత్‌లో మొదట కేరళలో చేపట్టారు. హైదరాబాద్ గాంధీ దవాఖానలో కూడా ట్రయల్స్ కొనసాగుతున్నాయి. కేరళలోని శ్రీచిత్ర తిరునల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్.. ప్లాస్మా థెరపీపై క్లినికల్ ట్రయల్స్ చేపట్టింది. దీనికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ ఆమోదం తెలిపింది. ఈ చికిత్స అమలుకు డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) అనుమతి కావాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆ ప్రక్రియ కొనసాగుతున్నట్టు ఐసీఎమ్మార్ అధికారులు తెలిపారు. ప్లాస్మాథెరపీ ప్రొటోకాల్ రూపొందిస్తున్నామని, ఇది చివరి దశలో ఉన్నదని చెప్పారు.

## అరగంటలో కరోనా వైరస్ ఖతం!

- రూ.500 లోపు ధరకే క్రిమిసంహారక బాక్సు
- పంజాబ్‌లోని ఐఐటీ రోపార్ రూపకల్పన



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అరగంటలో వైరస్‌ను నాశనంచేసే క్రిమిసంహారక బాక్స్‌ను పంజాబ్‌లోని ఐఐటీ రోపార్ రూపొందించింది. అతినీలలోహిత క్రిమిసంహార వికిరణ (అల్ట్రావయోలెట్ జెర్మిసిడల్ ఇర్రేడియేషన్) సాంకేతిక విధానంలో ఇది పనిచేస్తుంది. ఇంట్లోకి వెళ్లే ముందు వస్తువుల్ని ఇందులో అరగంట ఉంచితే వైరస్ చనిపోతుందని ఐఐటీ రోపార్ సీనియర్ సైంటిస్ట్ నరేశ్ రాఖా తెలిపారు. దీనిని రూ.500 లోపు ధరకు డోర్ డెలివరీ చేసేలా రూపొందిస్తున్నట్టు చెప్పారు. పరికరం పనిచేస్తున్నప్పుడు నేరుగా అందులోకి చూడటం ప్రమాదమని హెచ్చరించారు.

## సీఐటీడీలో వెంటిలేటర్ తయారీ

- వారంలోగా నమూనా సిద్ధం

Central Institute of Tool Design

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొవిడ్-19 చికిత్సకు అవసరమయ్యే వెంటిలేటర్లను సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ) సంస్థ తయారుచేస్తున్నది. కరోనా చికిత్సలో పెద్ద ఎత్తున వెంటిలేటర్లు అవసరం అవుతాయని అంచనావేసిన కేంద్ర ప్రభుత్వం.. తయారీ బాధ్యతలను హైదరాబాద్ బాలానగర్‌లోని సీఐటీడీకి అప్పగించింది. నమూనా (ప్రొటోటైప్) వెంటిలేటర్ తయారీలో సీఐటీడీ నిపుణులు నిమగ్నమయ్యారు. వారంలోగా నమూనా వెంటిలేటర్‌ను తయారుచేసి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చి (ఐసీఎమ్మార్) ఆమోదానికి పంపించనున్నారు. ఐసీఎమ్మార్ సూచనలకు అనుగుణంగా తుదిరూపు ఇవ్వనున్నారు. ఆ తర్వాత వెంటిలేటర్‌కు ఎంత ఖర్చవుతుందో అంచనా వేస్తామని సీఐటీడీ అధికారులు తెలిపారు.

# మరో రెండువారాలు కీలకం

## ఒకస్థాయికి పెరిగాకే కరోనా తగ్గుముఖం

- లాక్‌డౌన్‌తో వైరస్ విస్తరణకు అడ్డుకట్ట.. ప్రభుత్వ చర్యలు భేష్
- పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి



డాక్టర్ మాట

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ ప్రపంచంలో పాకుతున్నదని.. ముందుగానే లాక్‌డౌన్ ప్రకటించడంతో భారత్ దాని వ్యాప్తిని చాలావరకు అరికట్టగలిగిందని ప్రముఖ వైద్యుడు డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. కరోనా వైరస్ వ్యాప్తిలో ఈ రెండువారాలు చాలా కీలకమని చెప్పారు. ఎయిమ్స్ కార్డియాలజీ విభాగం మాజీ అధిపతి, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానం, మందులు, చికిత్స విధానంపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

భారత్ వంటి దేశాల్లో కరోనా పాజిటివ్ కేసులు ఒక్కసారిగా పెరిగితే తట్టుకోవడం కష్టమని డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. దాని వ్యాప్తిని లాక్‌డౌన్ కారణంగా అడ్డుకోగలిగామని.. అదేవిధంగా ఆర్థికంగా, ఔషధాలు, మెడికల్ సామాగ్రిని మెరుగుపరుచుకొనేందుకు సమయం కూడా దొరికిందని వివరించారు. 5 నుంచి 14 రోజుల దాకా ఇంక్యుబేషన్ పీరియడ్ ఉన్న నేపథ్యంలో కేసుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నదన్నారు. వచ్చే రెండువారాలు చాలా ముఖ్యమని, కేసులు పెరిగినా ఆందోళనపడాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రతి దేశంలో పాజిటివ్ కేసులు ఒకస్థాయికి పెరిగాకే తగ్గుముఖం పడుతాయని పేర్కొన్నారు. అయితే మన ప్రభుత్వాలు తీసుకొంటున్న చర్యలు కేసుల వేగాన్ని, సంఖ్యను తగ్గించేలా ఉన్నాయని తెలిపారు.

### వివిధ రకాలుగా చికిత్సావిధానాలు

కరోనా చికిత్సలో పలు దేశాలు వివిధ విధానాలను అనుసరిస్తున్నాయని, కొన్నిచోట్ల ట్రయల్స్ నడుస్తున్నాయని శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. కెనడాలో ప్లాస్మాతో చికిత్సపై పరిశోధనలు జరుగుతున్నాయని, చైనా, అమెరికాలో అత్యవసర కేసుల్లో ఈ విధానాన్ని అనుసరిస్తున్నారని తెలిపారు. భారత్‌లోనూ పరిస్థితి దిగజారితే ప్లాస్మా ద్వారా చికిత్స చేయవచ్చని పేర్కొన్నారు. కరోనా కట్టడికి తెలంగాణ ప్రభుత్వం బాగా పని చేస్తున్నదని ప్రశంసించారు. ఇటీవల పాజిటివ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో సీఎం కేసీఆర్ మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

# బయటకువస్తే మాస్క్!

- తప్పనిసరిగా ధరించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచన
- వినియోగంపై మార్గదర్శకాలు జారీ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వివిధ కారణాలతో ఇండ్ల నుంచి బయటకు వచ్చే వ్యక్తులు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. కొంతమందిలో వ్యాధి లక్షణాలు కనిపించకపోయినప్పటికీ, వైద్యపరీక్షల్లో కరోనా పాజిటివ్ రిపోర్టులు వస్తున్నందున ప్రజలు ఈ జాగ్రత్త పాటించాలని పేర్కొంది. ప్రజలంతా మాస్కులు ధరించాల్సిన అవసరం ఉన్నదని కేంద్ర ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో శుక్రవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏ శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు.

**వైద్య, ఆరోగ్యశాఖ సూచనలు:**

- మాస్కులు తొలగించేటప్పుడు దాని ముందుభాగాన్ని, మూలలను తాకకూడదు. చెవుల మీదుగానే తొలగించాలి.
- మాస్కును తొలగించిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.
- కార్యాలయాలు, కార్యస్థలాల్లో పనిచేస్తున్న వారంతా అన్నివేళల్లో తప్పనిసరిగా మాస్కులు ధరించాలి.
- మాస్కును ఒకవైపు మాత్రమే వాడాలి. తిప్పి వాడకూడదు.
- ఒకసారి వాడిపారేసే (డిస్పోజబుల్) మాస్కుల కంటే క్లాత్‌మాస్కులకు ప్రాధాన్యం ఇవ్వాలి. తప్పనిసరైతేనే డిస్పోజబుల్ మాస్కులు ధరించాలి. ప్రతి ఆరు గంటలకు ఒకసారి మాస్కును మార్చాలి. ఒకసారి వాడిన డిస్పోజబుల్ మాస్కును తిరిగి ధరించకూడదు.
- తిరిగి వినియోగించే క్లాత్‌మాస్కులను ఎప్పటికప్పుడు వేడినీళ్లలో సబ్బు/ డెటాల్ ఉపయోగించి శుభ్రంచేయాలి. ఆ తర్వాత ఐదు గంటలపాటు ఎండలో లేదా 15 నిమిషాలు వేడినీళ్లలో ముంచి, ఆరబెట్టాలి.

**మాస్కుల వాడకం ఇలా..**

- ఎన్-95 మాస్కులను కరోనా చికిత్స అందించే వైద్యులు, సిబ్బంది, వ్యాధిగ్రస్థులు కేవలం ఆరోజు మాత్రమే వినియోగించాలి. సాధారణ వైద్యసేవల్లో పాల్గొంటే 72 గంటలు వినియోగించాలి.
- ఎన్-95 మాస్కులను సాధారణ వ్యక్తులు వారం వరకు ఉపయోగించవచ్చు.
- సాధారణ సర్జికల్ మాస్కులు ఆరు గంటలు ఉపయోగించాలి. వినియోగాన్ని బట్టి ఏరోజుకారోజు మార్చుకోవాలి.
- వైద్యులు, సిబ్బంది ఉపయోగించే మాస్కులను బయోవేస్ట్ మేనేజ్‌మెంట్ పద్ధతిలో నిర్వీర్యం చేయాలి.

### నాలుగు లక్షల మాస్కులు సిద్ధం

రాష్ట్రంలో 32 జిల్లాల్లో 492 స్వయం సహాయ బృందాలు శుక్రవారంనాటికి సుమారు నాలుగు లక్షల మాస్కులను సిద్ధం చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం మాస్కుల వినియోగాన్ని తప్పనిసరిచేసింది. దీంతో పట్టణాల్లోని ఈ బృందాలు మాస్కులతయారీని ముమ్మరంచేశాయి.

### ఒక్కరు వంద మాస్కులు పంచాలి

గ్రామ రెవెన్యూ అధికారులు ఒక్కొక్కరు వంద మందికి మాస్కులు పంచాలని వీఆర్వోల సంక్షేమసంఘం తీర్మానించింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేందర్‌రావు, ప్రధాన కార్యదర్శి హరాలే సుధాకర్‌రావు, గౌరవాధ్యక్షుడు పెండ్యాల విజయరామారావు ఒక ప్రకటనలో తెలిపారు.



హువెల్ లైఫ్ సైన్సెస్ అభివృద్ధి చేసిన కరోనా టెస్టింగ్ కిట్లు

## హైదరాబాద్‌లో కరోనా కిట్స్

మొదటిపేజీ తరువాయి...

డైరెక్టర్ డాక్టర్ శక్తి నాగప్పన్ మీడియాతో మాట్లాడారు. 'మా సంస్థకు నార్సింగి, కోకాపేట్‌లో కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం రోజుకు 3000-4000 కిట్లు తయారు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. దేశంలో ఎక్కడికైనా ఈ కిట్‌లను సరఫరా చేయవచ్చు. కిట్స్ ప్రత్యేకత చెప్పాలంటే.. ఇందులోని ప్రతి ఒక్క ఎంజైమ్‌నూ సొంతంగా అభివృద్ధి చేశాం. దేశంలో ఈ ఘనత సాధించిన మొదటి కంపెనీ మాదే' అని వివరించారు. డెంగ్యూ, టీబీ, చికున్ గున్యా డయాగ్నస్టిక్ కిట్‌ల తయారీకి తమకు 2018లో లైసెన్స్ లభించిందని ఆయన చెప్పారు. 2019లో వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటివరకు దక్షిణ భారతదేశంలోనే తమ కిట్‌లను సరఫరా చేశామని, ఇకపై ఉత్తర భారత మార్కెట్‌పైనా దృష్టిసారిస్తామని పేర్కొన్నారు.

### గర్వకారణం: కేటీఆర్

హైదరాబాద్‌కు చెందిన హువెల్ లైఫ్ సైన్సెస్ సంస్థ కరోనా కిట్లను అభివృద్ధి చేయడంపై రాష్ట్ర మంత్రి కేటీ రామారావు హర్షం వ్యక్తంచేశారు. ఇది అద్భుతమైన వార్త అని పేర్కొన్నారు. లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తి నాగప్పన్‌ను అభినందించారు. మొత్తం 24 కిట్‌లను తయారుచేయగా, కేవలం 6 కిట్‌లకు మాత్రమే ఐసీఎంఆర్ అనుమతి లభించిందని, అందులో మన హైదరాబాద్ సంస్థ ఉండడం గర్వకారణమన్నారు. ఇంతవరకు దేశంలో మైల్యాబ్, అల్టోనా డయాగ్నస్టిక్స్, కిల్‌పెస్ట్, సీజిన్, ఎస్‌డీ బయోసెన్సార్‌లకు మాత్రమే కిట్‌ల తయారీకి అనుమతి లభించిందని కేటీఆర్ ట్వీట్‌చేశారు.

## 'మంకీ ఫీవర్' ప్రభావం లేదు

- ఆందోళన అనవసరం: డాక్టర్ రాజారావు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** కొత్తగా తెరపైకి వచ్చిన 'మంకీ ఫీవర్' ప్రభావం తెలుగు రాష్ట్రాల్లో లేదని గాంధీ దవాఖాన జనరల్ మెడిసిన్ విభాగం అధిపతి డాక్టర్ రాజారావు స్పష్టంచేశారు. గత రెండ్రోజులుగా కర్ణాటక రాష్ట్రంలో ఈ రకం జ్వరాలు ఎక్కువవడంతో శుక్రవారం ముగ్గురు వ్యక్తులు చనిపోయినట్టు అక్కడి నుంచి వార్తలు వెలువడిన తరుణంలో డాక్టర్ రాజారావు 'మంకీ ఫీవర్'పై స్పష్టతనిచ్చారు. కోతుల నుంచి వైరస్ సోకడం ద్వారా మనుషుల్లో వచ్చే జ్వరాన్ని మంకీ ఫీవర్‌గా పిలుస్తారని, కోతులతో ఎక్కువగా సన్నిహితంగా ఉండేవారికి లేదా వాటి కాటుకు గురైనవారికి సంక్రమిస్తుందని చెప్పారు. ఇప్పటివరకు తెలుగురాష్ట్రాల్లో ఈ వైరస్ సోకిన దాఖలాలు లేవని, దీని గురించి ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు.

## తిరుమలలో యోగవాశిష్టం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తిరుమలలోని ధర్మగిరి వేద విజ్ఞానపీఠం ఆధ్వర్యంలో నాదనీరాజనం వేదికపై యోగవాశిష్టం- శ్రీ ధన్వంతరి మహామంత్రం పారాయణం శుక్రవారం ఉదయం ప్రారంభమైంది. కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టాలని ప్రార్థిస్తూ 20 రోజులుగా తిరుమలలో పలు వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. యోగవాశిష్టం- శ్రీ ధన్వంతరి మహాయంత్రం పారాయణం భక్తుల కోసం ఎస్వీబీసీ చానల్‌లో ప్రసారం చేస్తున్నామని పేర్కొన్నారు.

లాక్‌డౌన్-డే 19

కరోనా స్వాభిమాని.. ఆహ్వానిస్తేనే వస్తుంది
ఒక్కసారి వచ్చిందా.. కొరియోగ్రఫీలేని పాటలాగా
మన ఊపిరితిత్తుల్లో వికృతనాట్యం చేస్తుంది
మార్కెటింగ్ చైన్‌సిస్టంలా అందరికీ పాకుతుంది
జాగ్రత్తలు పాటిద్దాం.. కరోనాను పారదోలుదాం. - ఎల్ శ్రీనాథ్

## కరోనా నంతరం

కాలానికి అనుగుణంగా మార్పులు చెందిన జాతులే మనుగడ సాగిస్తాయన్నది జీవ పరిణామ సిద్ధాంతం. మనిషి దీన్ని ఆకలింపు చేసుకొన్నాడు కాబట్టే.. ఎన్నో విపత్తులు ఎదురైనా నిలదొక్కుకోగలిగాడు. ఇప్పుడూ అంతే.. కరోనా మహమ్మారి ప్రపంచం మొత్తాన్ని ఇంటికే పరిమితం చేసింది. దీంతో మనిషి మరోసారి తన సృజనాత్మకతను వెలికి తీశాడు. గడప దాటకుండానే వ్యవస్థ కొనసాగేలా ఏర్పాట్లు మొదలు పెట్టాడు. అనేక రంగాలపై శాశ్వత ముద్ర వేయనున్న ఈ మార్పులు మీకోసం..



### 'స్మార్ట్' డాక్టర్లు.. రోబో నర్సులు

కరోనా ప్రభావంతో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చే అవకాశమున్నది. ముఖ్యంగా టెలిమెడిసిన్ విస్తృతమవుతుంది. డాక్టర్లు వీడియోకాల్ ద్వారా రోగి లక్షణాలు అడిగి తెలుసుకొని, ఔషధాలు సిఫారసు చేస్తారు. అవసరమైతేనే దవాఖానకు రమ్మంటారు. ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ప్రిస్క్రిప్షన్ వాట్సప్ లేదా మెయిల్‌లో వచ్చేస్తుంది. మందులు కూడా ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసుకోవచ్చు. ఫలితంగా దవాఖానల్లో నిర్వహణ వ్యయం తగ్గుతుంది.

**రోబో నర్సులు**

అంటువ్యాధుల వార్డుల్లో ఇకపై రోబో నర్సులు అందుబాటులోకి రావొచ్చు. రోగులకు మందులు ఇవ్వడం, నమూనాలు సేకరించడం వంటివి చేస్తాయి. ఇప్పటికే కరోనా వార్డుల్లో రోబోలు సేవలందిస్తున్నాయి.

# మనమే బెటర్!

- అగ్రరాజ్యాల కంటే భారత్‌లోనే మరణాల రేటు తక్కువ
- మనదేశంలో 3.04గా నమోదు

| దేశం | ఇటలీ | బ్రిటన్ | స్పెయిన్ | అమెరికా | భారత్ |
|---|---|---|---|---|---|
| మరణాల రేటు | 12.72 | 12 | 9.73 | 3.4 | 3.04 |

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** కరోనా బారినపడి దేశంలో గత నెలరోజుల్లో 205 మంది మృత్యువాతపడినప్పటికీ.. మహమ్మారిని కట్టడి చేయడంలో అమెరికా, బ్రిటన్ వంటి అగ్రదేశాల కంటే భారత్ మెరుగ్గా ఉన్నది. దేశంలో మరణాల రేటు (3.04) ప్రపంచ సగటు (5.98) కంటే తక్కువగానే ఉన్నది. అంతేగాకుండా ఇటలీ, ఫ్రాన్స్, స్పెయిన్ వంటి యూరోపియన్ దేశాల కంటే ఇది చాలా తక్కువ. దేశ జనాభాలో అధిక భాగం యువతే ఉండడం.. ముందుగానే దేశంలో లాక్‌డౌన్ విధించడం ఇందుకు ప్రధాన కారణాలని నిపుణులు చెబుతున్నారు. ఇటలీ, స్పెయిన్ దేశాల్లో వృద్ధుల జనాభా అధికంగా ఉండడం.. మరణాల రేటు పెరుగుదలకు ఒక కారణమని వివరిస్తున్నారు. యూరప్‌లో ఒక్క జర్మనీ మాత్రమే మనకంటే తక్కువ మరణాల రేటు కలిగి ఉన్నది. ఆ దేశంలో ఉన్న మెరుగైన వైద్య వ్యవస్థే ఇందుకు కారణం.




తుపాకులు చేతబట్టి దేశ రక్షణలో నిమగ్నమయ్యే సీఆర్పీఎఫ్ జవాన్లు శుక్రవారం ఢిల్లీలో ఇలా మాస్కులు, పీపీఈ కిట్లు తయారు చేస్తూ కరోనాపై పోరులో పాలుపంచుకున్నారు

## లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించినందుకు..
## డీహెచ్‌ఎఫ్‌ఎల్ ప్రమోటర్లపై కేసు

- సహకరించిన ఐపీఎస్‌పై సస్పెన్షన్ వేటు

**ముంబై:** ఓ వైపు లాక్‌డౌన్ కొనసాగుతున్నా పట్టించుకోకుండా కుటుంబసభ్యులతో కలిసి మహాబలేశ్వర్‌కు ప్రయాణించిన ప్రముఖ స్థిరాస్తి కంపెనీ డీహెచ్‌ఎఫ్‌ఎల్ ప్రమోటర్లు కపిల్, దీరజ్ వాదవన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం కపిల్, దీరజ్, వారి కుటుంబసభ్యులు, ఇతరులు మొత్తం 23 మంది కలిసి మహారాష్ట్రలోని ఖండాల నుంచి మహాబలేశ్వర్‌కు కార్లలో బయలుదేరి వెళ్లారు. అయితే వీళ్లు లాక్‌డౌన్ నిబంధనలను ఉల్లంఘించిన విషయం మున్సిపల్ అధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో అధికారులు మహాబలేశ్వర్‌లో ఉన్న వీరందినీ అదుపులోకి తీసుకున్నారు. ఇదే సమయంలో ఉల్లంఘనపై జిల్లా అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అందరిపై కేసు నమోదైంది. మరోవైపు లాక్‌డౌన్ నుంచి దీరజ్ పరివారానికి మినహాయింపునివ్వాలంటూ ప్రిన్సిపల్ సెక్రటరీ అమితాబ్ గుప్తా లేఖ జారీ చేశారు. ఈవిషయం బయటపడటం తో అధికారులు గుప్తాను సస్పెండ్ చేశారు.



రిసార్ట్‌లో డీహెచ్‌ఎఫ్‌ఎల్ ప్రమోటర్లు

- దొంగకు కరోనా..

## జడ్జి, ఏడుగురు పోలీసులు స్వీయ నిర్బంధం!

**లూధియానా:** ఒక దొంగకు కరోనా పాజిటివ్ ఉన్నట్టు తేలటంతో జడ్జి, ఏడుగురు పోలీసులు సహా మొత్తం పది మంది స్వీయ నిర్బంధంలోకి వెళ్లారు. ఈ ఘటన పంజాబ్‌లోని లూధియానాలో జరిగింది. స్థానికులు పట్టిచ్చిన ఇద్దరు దొంగలను జడ్జి మోనికా సింగ్ ఎదుట పోలీసులు హాజరుపరిచారు. వారు అదేపనిగా దగ్గుతుండటంతో ఆరోగ్య పరీక్షలకు పంపాలని జడ్జి ఆదేశించారు. కాగా, ఒకడు పారిపోగా, మరొకడికి కరోనా పాజిటివ్‌గా గుర్తించారు. దీంతో ఇద్దరు పౌరులు సహా జడ్జి, ఏడుగురు పోలీసులు స్వీయ నిర్బంధంలోకి వెళ్లారు. పారిపోయిన దొంగకోసం పోలీసులు వెతుకుతున్నారు.

## ఒక్కరి తప్పు.. ఊరంతా క్వారంటైన్

- ఢిల్లీలో కాంగ్రెస్ నాయకుడి నిర్వాకం

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ నాయకుడు, ఢిల్లీ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ తబ్లిగీ జమాత్‌ను సందర్శించిన విషయాన్ని దాచిపెట్టడంతో అతనితోపాటు ప్రస్తుతం కౌన్సిలర్‌గా ఉన్న అతని భార్యకు, కుమార్తెకు కూడా కరోనా పాజిటివ్ అని తేలింది. అతని నిర్లక్ష్యం కారణంగా ఢిల్లీ పరిధిలోని అతని గ్రామం దీన్‌పూర్‌ను కొవిడ్-19 నియంత్రణ ప్రాంతంగా అధికారులు ప్రకటించారు. గ్రామంలోని 250 ఇండలోని ప్రజల కదలికలను పూర్తిగా కట్టడిచేశారు. కాంగ్రెస్ నేత కుటుంబాన్ని అంబేద్కర్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. అధికారుల విచారణ సమయంలోనూ అతను విషయాన్ని దాచిపెట్టగా, కాల్ రికార్డ్స్, సాంకేతిక ఆధారాలతో తబ్లిగీ జమాత్ సమావేశంలో పాల్గొన్నట్టు పోలీసులు గుర్తించారు.

## 28 మంది నర్సుల స్వీయ నిర్బంధం

**ముంబై:** ఇద్దరు నర్సులకు కరోనా పాజిటివ్ అని తేలటంతో.. హాస్పిటల్‌లోని మొత్తం 28 మంది నర్సులను స్వీయ నిర్బంధంలో ఉంచాలని బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) శుక్రవారం ఆదేశించింది. దాదర్‌లోని సుశ్రుష హాస్పిటల్‌లో ఇద్దరు నర్సులకు కరోనా పాజిటివ్‌గా తేలడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు.



జమ్ముకశ్మీర్‌లో కరోనా కేసుల సంఖ్య పెరుగుతుండటంతో వైరస్ వ్యాప్తి కట్టడికి మహిళలు నడుం బిగించారు. జమ్ము నగరానికి సమీప గ్రామ సరిహద్దులో గస్తీ నిర్వహిస్తున్నారు. కర్రలు చేతబూని లాక్‌డౌన్‌ను పక్కగా అమలు చేస్తున్నారు.

## జీవ ఉగ్రదాడులకు అవకాశం

- ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో హెచ్చరిక

**వాషింగ్టన్:** ప్రపంచ మహమ్మారి వల్ల అంతర్జాతీయంగా శాంతిభద్రతలకు ముప్పు పొంచి ఉన్నదని ఐక్యరాజ్యసమితి (ఐరాస) ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటేరస్ తెలిపారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో కొన్ని అసాంఘిక శక్తులు జీవ ఉగ్రదాడులకు పాల్పడే అవకాశమున్నదని ఆయన హెచ్చరించారు. డొమినికన్ రిపబ్లిక్ అధ్యక్షతన గురువారం ఐరాస భద్రతా మండలి సమావేశం జరిగింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన ఈ భేటీలో తొలిసారి కరోనా సంక్షోభంపై చర్చ జరిగింది. మహమ్మారిపై మానవాళి పోరును 'ఈ తరం కోసం, ఐరాస అస్తిత్వం కోసం జరుగుతున్న పోరాటం'గా గుటేరస్ అభివర్ణించారు. లాక్‌డౌన్ వల్ల అన్ని దేశాలపై సామాజిక, ఆర్థికపరమైన ప్రభావం పడిందని, దీనివల్ల తలెత్తె నిరుద్యోగం, ఆర్థిక మాంద్యం వంటి సమస్యలు ప్రభుత్వాలకు సవాల్‌గా మారనున్నాయని పేర్కొన్నారు.

## పాక్ ఆయుధ డంప్ ధ్వంసం

- కాల్పులకు తెగబడ్డ పాక్‌కు భారత్ గట్టి గుణపాఠం

**శ్రీనగర్:** కరోనా మహమ్మారిపై యావత్ దేశం పోరు జరుపుతున్న సమయంలో జమ్ముకశ్మీర్‌లోని సరిహద్దుల్లో పాకిస్థాన్ అకారణంగా కాల్పులకు తెగబడింది. భారత సైనిక బలగాలు పాక్‌కు గట్టి గుణపాఠం నేర్పాయి. కుప్వారా జిల్లా కెరాన్ సెక్టార్ల పరిధిలో నియంత్రణ రేఖ పొడవునా శుక్రవారం భారత సైనికులు బోఫోర్స్ తుపాకులతో దాడులు చేశారు. ఈ దాడితో పాక్ ఆయుధాల డంప్, టెర్రర్ లాంచ్‌ప్యాడ్లు, సైనికుల గన్ పొజిషన్ల వద్ద పేలుళ్లు సంభవించాయి. ఈ మేరకు చిత్రీకరించిన డ్రోన్ వీడియో ఫుటేజీలను భారత సైన్యం విడుదల చేసింది. పాకిస్థాన్ సైన్యానికి శక్తిమంతంగా, సమర్థవంతంగా సమాధానం చెప్పామని తెలిపింది. బారాముల్లా జిల్లా యురి సెక్టార్ పరిధిలోనూ పాక్ కాల్పులకు తెగబడిందని పోలీసులు చెప్పారు. కెరాన్ సెక్టార్ పరిధిలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు పాక్ ఉగ్రవాదులు హతమైన సంగతి తెలిసిందే.



వీడియో ఫుటేజీ దృశ్యం

## అంగన్‌వాడీ సరుకులు ఆగొద్దు

- మహిళా, శిశుసంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చేస్తున్న సరుకుల సరఫరా ఎక్కడా ఆగొద్దని మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఆదేశించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు.. పాలు, గుడ్లు, బాలామృతం, నిత్యావసరాలు ఇంటి దగ్గరకే వెళ్లి పంపిణీచేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఎంజీనగర్ అంగన్‌వాడీకేంద్రాన్ని మంత్రి సత్యవతి శుక్రవారం పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సరుకులు, శానిటైజర్లు, మాస్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమశాఖ కమిషనర్, ప్రత్యేక కార్యదర్శి దివ్య, ఝాన్సీ, రేణుక పాల్గొన్నారు.



ఎంజీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మాస్కులు పంపిణీచేస్తున్న మంత్రి సత్యవతిరాథోడ్

## పట్టా పుస్తకంతో ధాన్యం కొనుగోళ్లు

- రైతుబంధు సమితి చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- కంట్రోల్‌రూంకు వచ్చిన ఫిర్యాదుల పరిశీలన



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రైతులకు ఇబ్బందుల్లేకుండా పంటల కొనుగోలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రైతుబంధు సమితి రాష్ట్ర చైర్మన్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. రైతుల ఆధార్ వివరాలకు, పంట పండించిన గ్రామం వివరాల్లో తేడా ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చే రైతులు తమ పాస్‌బుక్ లేదా గ్రామంలో పంట పండించినట్టు స్థానిక వ్యవసాయ విస్తరణాధికారి లేదా గ్రామ రెవెన్యూ అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకొస్తే కొనుగోళ్లు జరుపాలని అధికారులకు సూచించినట్టు పేర్కొన్నారు. ధాన్యం, మక్కజొన్న కొనుగోళ్ల సందర్భంగా కమిషనరేట్‌లోని కంట్రోల్‌రూంకు రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన పరిశీలించారు. శుక్రవారం కంట్రోల్ రూంకు 130 ఫిర్యాదులు వచ్చాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం వరకు దాదాపు 52,388 మెట్రిక్ టన్నుల ధాన్యం, 29,824 మెట్రిక్ టన్నుల మక్కజొన్నలు కొనుగోలు చేసినట్టు చెప్పారు.

## ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వివరాలేవి?

- కొండపోచమ్మసాగర్ ముంపు బాధితుల పిటిషన్లపై హైకోర్టు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొండ పోచమ్మసాగర్ రిజర్వాయర్ కింద ఇండ్లు కోల్పోతున్నన సిద్దిపేట జిల్లా ములుగు మండలం మామిడ్యాల, బయిలంపూర్ గ్రామాల ముంపు బాధితులకు చెల్లించే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చర్చల వివరాలను తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. గతంలో ఇచ్చిన నోటీసులను పక్కనపెట్టి ప్రాజెక్టులో ఇండ్లు కోల్పోతున్న ఇతర గ్రామాల ప్రజలకు ఇచ్చినట్లుగా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చేందుకు తమతో చర్చలు జరుపాలని మామిడ్యాల, బయిలంపూర్‌కు చెందిన పలువురు హైకోర్టులో పిటిషన్లు దాఖలుచేశారు. వీటిపై వర్చువల్ విధానంలో విచారణ జరిపిన చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్ నేతృత్వంలోని ధర్మాసనం.. పిటిషనర్లు కోరుతున్నట్లుగా చర్చల ప్రక్రియపై ప్రభుత్వ అభిప్రాయం తెలుపాలన్నది.

# భవిష్యత్‌పైనే భయం

ప్రస్తుతానికి అగ్రరాజ్యంలో తెలుగువారు క్షేమం • స్వీయ గృహనిర్బంధంలోనే అత్యధికులు
తెలుగువారి యోగక్షేమాలపై సంఘాల దృష్టి • స్థానికంగా సాయం అందించేందుకు ఏర్పాట్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

అగ్రరాజ్యం అమెరికాలో నివసిస్తున్న మెజారిటీ తెలుగువారు క్షేమంగా ఉన్నప్పటికీ, భవిష్యత్‌పైనే భయం పట్టుకున్నది. కరోనా వైరస్.. ప్రపంచానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న తరుణంలో పరాయిదేశంలో ఉన్న మనవాళ్లు ఎలా ఉన్నారన్న ఆతృత ప్రతి ఒక్కరిలో కనిపిస్తున్నది. ముఖ్యంగా తెలంగాణ నుంచి గల్ఫ్ తర్వాత అత్యధికులు వెళ్లింది అమెరికాకే. అక్కడ సాఫ్ట్‌వేర్, వ్యాపారరంగాల్లో స్థిరపడ్డారు. కొన్ని రాష్ట్రాల్లో వేల మంది తెలంగాణవారు, తెలుగువారున్నారు. కొవిడ్ అమెరికాను అతలాకుతలం చేస్తుండటంతో చాలా రాష్ట్రాలు లాక్‌డౌన్ ప్రకటించాయి. న్యూయార్క్, న్యూజెర్సీ, కాలిఫోర్నియా, లూసియానా, మిషిగన్‌లలో కరోనా విజృంభిస్తున్నది. ఈ నేపథ్యంలో తెలుగువాళ్లు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో పరిస్థితి ఎలా ఉందన్నదానిపై అమెరికాలోని పలువురిని 'నమస్తే తెలంగాణ' పలకరించింది. పరిస్థితులు అంత సజావుగా ఏమీలేవన్న వారు.. ఒకటి అర మినహా మెజార్టీ తెలుగువారు క్షేమంగానే ఉన్నారని, స్వీయ గృహనిర్బంధం పాటిస్తున్నారని చెప్పారు.

### ఇప్పటికైతే ఎలాంటి ఇబ్బందిలేదు



**కరోనా** ప్రభావం అమెరికాలో ఊహించినదానికన్నా ఎక్కువే ఉన్నది. న్యూయార్క్, న్యూజెర్సీ రాష్ట్రాల్లో అనేక మందికి పాజిటివ్ వచ్చింది. చాలామంది చనిపోతున్నారు. తెలుగువారికి ఇప్పటికైతే ఎలాంటి సమస్య రాలేదు. తెలుగువారు నెలరోజుల ముందునుంచే సామూహిక కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. స్వీయ గృహనిర్బంధం పాటిస్తున్నారు. అత్యవసర వస్తువులన్నీ అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే భోజనం సరఫరా చేసే ఫుడ్ చైన్‌లు పనిచేస్తున్నాయి.

– పరమేశ్ భీంరెడ్డి, అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) అధ్యక్షుడు

### భవిష్యత్‌పైనే చాలా మంది ఆందోళన



ప్రస్తుత పరిస్థితి కన్నా కరోనా తగ్గిన తర్వాత రోజులు ఎలా ఉంటాయనేదానిపైనే చాలా మంది ఆందోళన చెందుతున్నారు. ఇమ్మిగ్రేషన్, వీసా సమస్యలు రావచ్చు. ఉద్యోగాలు ఉంటాయో.. పోతాయో అన్న భయం ఉన్నది. తెలుగువాళ్లకు భరోసా ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రజలంతా ఎవరికివారు జాగ్రత్తలు పాటిస్తున్నారు. రోడ్లపై జనసంచారం పూర్తిగా తగ్గింది.

– విశ్వేశ్వర్‌రెడ్డి కలువాల, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం మాజీ అధ్యక్షుడు

### ఇక్కడ ఇండియన్స్‌కే వ్యాధులెక్కువ



అమెరికన్లతో పోలిస్తే ఇక్కడ నివసించే భారతీయుల్లో గుండె సంబంధ, మధుమేహ వ్యాధులు ఎక్కువ. ఇప్పటివరకైతే మనవాళ్లకు కరోనా పెద్దగా సోకలేదు. ఇక్కడ రకరకాల పరీక్షలు చేస్తున్నారు. రోగులకు డాక్టర్లు టెలిమెడిసిన్ ద్వారా వైద్యసేవలు అందిస్తున్నారు. కరోనా లక్షణాలున్నవారు పరీక్షలు చేయించుకొంటున్నారు. భారత్‌లో లాక్‌డౌన్ వల్ల మంచి ఫలితాలే వస్తున్నాయి. తెలంగాణ సీఎం కేసీఆర్ వ్యవహరిస్తున్న తీరు అభినందనీయం.

– డాక్టర్ నందిని సుంకిరెడ్డి, అట్లాంట (జార్జియా)

### న్యూజెర్సీ, న్యూయార్క్‌లలో పరిస్థితులు దారుణం



**న్యూజెర్సీ**, న్యూయార్క్‌లలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. మన తెలుగువాళ్లు చాలామంది ముందునుంచే వర్క్ ఫ్రం హోంలో ఉన్నారు. దీంతో వారికి వైరస్ సోకలేదు. తెలుగువాళ్లు ఎక్కడ ఉన్నా చేయూత ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ (నాటా) ద్వారా 20 వేల మాస్కులను పంపిణీ చేస్తున్నాం. డబ్బులు ఎప్పుడైనా సంపాదించుకోవచ్చు.. ప్రాణాలు ముఖ్యమని సీఎం కేసీఆర్ చెప్పిన మాటలు మా గుండెలను తాకాయి.

– అమర్‌నాథ్ గుండా, మోర్స్‌టౌన్ (న్యూజెర్సీ)

## మొండికిపోతే బలవుతాం

- కరోనావ్యాప్తిపై అసదుద్దీన్ హెచ్చరిక
- ఇంట్లో నమాజు చేసుకోవాలని సూచన



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రాణాలను కబళిస్తున్న కరోనా వైరస్‌ను తరిమికొట్టడానికి హాట్‌స్పాట్ ప్రాంతాల్లో ఇండ్లనుంచి ఎవరూ బయటకురావద్దని మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ముస్లింలకు పిలుపునిచ్చారు. సామూహికంగా కాకుండా ఇండ్లలో నమాజు చేసుకోవాలని శుక్రవారం వీడియో సందేశంలో కోరారు. కరోనా వ్యాప్తిని నిరోధించాల్సిన బాధ్యత ప్రతిపౌరుడిపై ఉన్నదన్నారు. కరోనా కట్టడిలో రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని, మొండికిపోతే బలవుతారని హెచ్చరించారు. కేంద్రం వైఖరిపై వ్యతిరేకత ఉన్నదని, కరోనాను తరిమికొట్టిన తర్వాత రాజకీయాలు చూసుకుందామని పేర్కొన్నారు.

## కార్మికులకు కడుపునిండా భోజనం

- 54 అన్నపూర్ణ కేంద్రాలతో 14 వేల మందికి
- పురపాలకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పట్టణ ప్రాంతాల్లో వలస కార్మికులు, దినసరి కూలీలు, అన్నార్తులకు సుమారు 14 వేల మందికి 54 కేంద్రాల ద్వారా అన్నపూర్ణ పథకం కింద పురపాలకశాఖ కడుపునిండా భోజనం పెడుతున్నది. అత్యధికంగా వరంగల్ కార్పొరేషన్‌లో 11 సెంటర్ల ద్వారా 4,250 మందికి భోజన వసతి కల్పించింది. నిజాంపేటలో ఏడు, పీర్జాదిగూడలో ఐదు, సిద్దిపేట, సూర్యాపేట, ఖమ్మంలలో మూడుచొప్పున, కరీంనగర్, బండ్లగూడజాగీర్, బోడుప్పల్, జవహర్‌నగర్‌లలో రెండేసి కేంద్రాల ద్వారా భోజనాలు పెడుతున్నారు. మిగతాచోట్ల ఒక్కో అన్నపూర్ణ కేంద్రాన్ని పురపాలకశాఖ ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో సుమారు 28 పట్టణాల్లో 463 లేబర్ క్యాంపుల్లో సుమారు 71 వేల మంది వలస కార్మికులకు భోజన సదుపాయం కల్పిస్తున్నారు. తర్వాత వరంగల్ కార్పొరేషన్‌లో తొమ్మిది వేలు, రామగుండంలో 6,000 మందికి ఆహారాన్ని అందజేస్తున్నారు. రాష్ట్రంలోని 24 జిల్లాల్లో సుమారు 3,700 మంది నిరాశ్రయులు, అభాగ్యులకు ఉచితంగా వసతితోపాటు భోజన సదుపాయాన్ని అందజేస్తుండటం విశేషం.



హైదరాబాద్‌లో అన్నపూర్ణ కేంద్రంలో భోజనాలు చేస్తున్న నిరాశ్రయులు

## విషమంగానే నర్సింగ్‌యాదవ్ ఆరోగ్యం



**ఖైరతాబాద్/సుల్తాన్‌బజార్:** సినీనటుడు నర్సింగ్‌యాదవ్ పరిస్థితి ఇంకా విషమంగానే ఉన్నది. హైదరాబాద్‌లోని స్వగృహంలో అపస్మారకస్థితిలో పడిపోగా ఆయనను కుటుంబసభ్యులు గురువారం సోమాజిగూడలోని యశోద దవాఖానకు తరలించారు. ప్రస్తుతం వైద్యులు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. దీర్ఘకాలికవ్యాధులతో బాధపడుతున్న నర్సింగ్‌యాదవ్‌కు డయాలసిస్ నిర్వహిస్తున్నట్టు తెలిసింది.

## ఏపీ ఎస్‌ఈసీ రమేశ్‌కుమార్ తొలగింపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కమిషనర్ (ఎస్‌ఈసీ)నిమ్మగడ్డ రమేశ్‌కుమార్‌ను తొలగిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఎస్‌ఈసీ నియామక నిబంధనలను సవరిస్తూ ఏపీ ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్స్‌కు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఆమోదం తెలిపారు. ఎస్‌ఈసీ పదవీకాలం మూడేండ్లకు కుదిస్తూ ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. గవర్నర్ ఆమోదంతో ఆర్డినెన్స్‌పై ఉత్తర్వులు జారీఅయ్యాయి. తాజా నిబంధనల ప్రకారం రమేశ్‌కుమార్ పదవీకాలం ముగియడంతో ఆయనను ఏపీ ప్రభుత్వం తొలగించింది.

## ఏపీలో పిడుగుపాటుకు పది మంది బలి

- పడవముక్కలై నలుగురు మృత్యువాత

**అమరావతి, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్‌లో అకాలవర్షాలు బీభత్సం సృష్టించాయి. గురు, శుక్రవారాల్లో కురిసిన వర్షాల కారణంగా పిడుగుపడి పది మంది మరణించారు. నెల్లూరు జిల్లాలో ఏడుగురు, గుంటూరు జిల్లాలో ఇద్దరు, ప్రకాశం జిల్లాలో మృతిచెందినవారిలో ఉన్నారు. వేల ఎకరాల్లో మామిడి, వరి, అరటి తదితర పంటలకు నష్టంవాటిల్లింది. మరోఘటనలో కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం నిడమర్రుకు చెందినవారు పల్లెపాలెం –పెదలంక డ్రెయిన్‌లో వలకట్లు తీయడానికివెళ్లిన సమయంలో భారీవర్షం పడటంతో మత్స్యకారులున్న పడవ సముద్రంపాయలోకి మళ్లింది. పడవ ముక్కలుకావడంతో అందులో ఉన్న నలుగురు మరణించారు.

ఇప్పుడు శత్రుదేశంపై గెలువడమే యుద్ధం కాదు
మనపై మనం గెలువడమే మూడో ప్రపంచయుద్ధం
అందరియుద్ధం కరోనాపైనే
మైదానంలో యుద్ధం కాదు
నామీదనే నాపై యుద్ధం
-వనపట్ల సుబ్బయ్య

లాక్‌డౌన్-డే 19





## గృహహింసపై వాట్సప్‌లో ఫిర్యాదులు

**న్యూఢిల్లీ:** మహిళలపై గృహహింస నిరోధానికి జాతీయ మహిళా కమిషన్ (ఎన్సీడబ్ల్యూ) ప్రత్యేక వాట్సప్ నంబర్ 7217735372ను ప్రారంభించింది. లాక్‌డౌన్ ప్రకటించిన మార్చి 25 నుంచి ఏప్రిల్ 1 మధ్య 257 అఘాయిత్యాలు జరిగాయని, 69 గృహహింస ఫిర్యాదులొచ్చాయని ఎన్సీడబ్ల్యూ చైర్‌పర్సన్ రేఖాశర్మ తెలిపారు.



## థాంక్యూ మోదీ!

**జెరూసలెం:** కరోనా నివారణకు వినియోగిస్తున్న మలేరియా నిరోధక ఔషధం హైడ్రాక్సీ క్లోరోక్విన్‌తోపాటు ఐదు టన్నుల మందులను పంపినందుకు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు భారత ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. 'థాంక్యూ, మై డియర్ మోదీ. ఇజ్రాయెల్‌కు క్లోరోక్విన్ సరఫరా చేసినందుకు.. ఇజ్రాయెల్ తరఫున మీకు కృతజ్ఞతలు' అంటూ నెతన్యాహు ట్వీట్ చేశారు.




## ఎన్పీఎస్ విత్‌డ్రాకు అనుమతి

**న్యూఢిల్లీ:** కొవిడ్-19 చికిత్స ఖర్చుల కోసం నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్పీఎస్) చందాదారులకు పాక్షిక ఉపసంహరణకు ప్రభుత్వం అనుమతించింది. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (పీఎఫ్‌ఆర్డీఏ) శుక్రవారం సర్క్యులర్‌ను జారీచేసింది. కరోనా చికిత్స ఖర్చులు భరించేందుకు పాక్షికంగా ఉపసంహరించుకోవచ్చని పేర్కొంది.



## 41.63 లక్షల కోట్లతో ఈయూ ప్యాకేజీ

బ్రసెల్స్: కరోనాతో అతలాకుతలమైన ఐరోపా దేశాలను ఆదుకునేందుకు 500 బిలియన్ యూరోల ఆర్థిక ప్యాకేజీకి (41.63 లక్షల కోట్లు)యూరోపియన్ యూనియన్ (ఈయూ) ఆర్థిక మంత్రులు ఎట్టకేలకు ఆమోదం తెలిపారు. కరోనా బాండ్స్ జారీ ద్వారా ఉమ్మడిగా నిధులు సమీకరించాలన్న ఇటలీ, స్పెయిన్, ఫ్రాన్స్ ప్రతిపాదనను ఈయూ తోసిపుచ్చింది.



## సరిపడా హైడ్రాక్సీ క్లోరోక్విన్

**న్యూఢిల్లీ:** కరోనాపై పోరులో కీలకంగా భావిస్తున్న హైడ్రాక్సీ క్లోరోక్విన్ ఔషధ నిల్వలు సరిపడా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కొరత రాకుండా చర్యలన్నీ తీసుకుంటున్నట్లు నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్పీపీఏ) చైర్మన్ శుభ్రాసింగ్ తెలిపారు. మన అవసరాలకు తగినంత నిల్వలు ఉంచుకున్న తర్వాతే విదేశాలకు ఎగుమతి చేస్తామన్నారు.



## ఎఫ్‌సీఐ సిబ్బందికి రూ.35 లక్షల బీమా

**న్యూఢిల్లీ:** భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) అధికారులు, కార్మికులకు రూ.35 లక్షల జీవిత బీమా కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కరోనాపై పోరులో భాగంగా మార్చి 24 నుంచి ఆరు నెలల పాటు విధుల నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఎఫ్‌సీఐ కార్మికులు, అధికారులకు ఈబీమా వర్తిస్తుందని కేంద్ర మంత్రి రాం విలాస్ పాశ్వాన్ తెలిపారు.



## ఉచిత పరీక్షలపై విధి విధానాలు రూపొందించాలి!

**న్యూఢిల్లీ:** కొవిడ్-19 వైద్య పరీక్షలు దేశ ప్రజలందరికీ ఉచితంగా నిర్వహించాలని సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలపై కేంద్ర ప్రభుత్వం విధి విధానాలతో ముందుకు రావాలని పలు ప్రైవేట్ ల్యాబరేటరీల యాజమాన్యాలు సూచించాయి. పరీక్షలు అందరికీ అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆమోదిస్తున్నామని పేర్కొన్నాయి.

# లాక్‌డౌన్ ఎత్తివేతలో తొందరొద్దు

### హెచ్చరించిన డబ్ల్యూహెచ్‌వో

World Health Organization

**జెనీవా:** కరోనా వైరస్ వ్యాప్తిని కట్టడి చేయడానికి పలు దేశాలు అమలు చేస్తున్న లాక్‌డౌన్లను తొందరపాటుతో ఎత్తివేస్తే తీవ్ర విపత్కారాలు సంభవిస్తాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. ప్రస్తుతం వైరస్ కొంత కట్టడిలో ఉన్నదని, లాక్‌డౌన్ ఎత్తివేస్తే అది మళ్లీ విజృంభించే అవకాశముందని తెలిపింది. లాక్‌డౌన్ అమల్లో ఉన్నదేశాలతో సంప్రదింపులు జరుపుతున్నామని పేర్కొంది. లాక్‌డౌన్‌ను విడుతల వారీగా సడలించుకుంటూ పోతే సరిపోతుందని, కానీ ఒక్కసారిగా ఎత్తివేయడం ప్రమాదకరమని హెచ్చరించింది. కరోనా వైరస్ 'సమూహ వ్యాప్తి' దశలో ఉన్నదని గురువారం తన నివేదికలో పేర్కొన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో).. తాజాగా తన పొరపాటును సరిదిద్దుకున్నది. దేశంలో సమూహవ్యాప్తి లేదని స్పష్టం చేసింది. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే వైరస్ వ్యాప్తి అధికంగా ఉన్నదని తెలిపింది.

## మోదీని అనుసరిస్తున్న వైట్‌హౌస్ ట్విట్టర్!




**అమెరికా** అధ్యక్షుడు ట్రంప్ అధికారిక నివాసం వైట్‌హౌస్ ట్విట్టర్ ఖాతా భారత ప్రధాని మోదీ, భారత ప్రధానమంత్రి కార్యాలయం, భారత రాష్ట్రపతి ట్విట్టర్ ఖాతాలను అనుసరిస్తున్నది. భారత దౌత్యవిజయానికి ఇది ప్రతీకగా నిలుస్తుంది. వైట్‌హౌస్ ట్విట్టర్ ఖాతా ఇప్పటివరకూ ప్రపంచంలో మరే దేశ ప్రభుత్వాన్నిగానీ, అధినేతనుగానీ అనుసరించలేదు. కేవలం 19 మంది ట్విట్టర్ ఖాతాలను మాత్రమే వైట్‌హౌస్ ఖాతా అనుసరిస్తుండగా అందులో 16 అమెరికాకు చెందిన వారివి, మిగతా మూడు భారత్‌కు చెందినవి కావడం విశేషం.

## దక్షిణాఫ్రికాలో మరో రెండు వారాలు..

**జొహెనెస్‌బర్గ్:** దక్షిణాఫ్రికాలో లాక్‌డౌన్‌ను మరో రెండు వారాలు పొడిగిస్తున్నట్లు ఆ దేశ అధ్యక్షుడు సిరిల్ రామపోస తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న లాక్‌డౌన్ ఈ నెల 16తో ముగియనున్నదని చెప్పారు. మహమ్మారిపై ఇంకా పోరాడాల్సి ఉన్నందున లాక్‌డౌన్ పొడిగిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే క్యాబినెట్ మంత్రులు, ప్రభుత్వంలోని ఉన్నతాధికారుల జీతాల్లో 30 శాతం కోత విధించనున్నట్లు సిరిల్ రామపోస తెలిపారు. ఈ కోత మూడు నెలలపాటు కొనసాగనున్నదని, ఈ డబ్బును కరోనాపై పోరాటానికి ఖర్చు చేయనున్నామని వివరించారు.

### కరోనా క్లాక్
10-4-2020

| | |
|---|---|
| ప్రపంచవ్యాప్తంగా ప్రభావిత కేసులు | 16.77 లక్షలు |
| కోలుకున్నవారు | 3,72,403 |
| మరణాలు | 1,01,559 |

| దేశం | కేసులు | మరణాలు |
|---|---|---|
| అమెరికా | 4,89,268 | 18,015 |
| స్పెయిన్ | 1,57,053 | 15,970 |
| ఇటలీ | 1,47,577 | 18,849 |
| ఫ్రాన్స్ | 1,24,869 | 13,197 |
| జర్మనీ | 1,19,624 | 2,607 |
| చైనా | 81,907 | 3,336 |
| ఇరాన్ | 68,192 | 4,232 |
| యూకే | 73,758 | 8,858 |
| టర్కీ | 47,029 | 1,006 |
| బెల్జియం | 26,667 | 3,019 |

| | |
|---|---|
| దేశవ్యాప్తంగా ప్రభావిత కేసులు | 6,761 |
| కోలుకున్నవారు | 515 |
| మరణాలు | 206 |

**దేశంలో కరోనా కేసులు**

| | | |
|---|---|---|
| మహారాష్ట్ర 1,574 | తమిళనాడు 911 | ఢిల్లీ 903 |
| రాజస్థాన్ 520 | తెలంగాణ 487 | మధ్యప్రదేశ్ 470 |
| ఉత్తరప్రదేశ్ 433 | ఏపీ 381 | కేరళ 357 |
| గుజరాత్ 241 | కర్ణాటక 207 | కశ్మీర్ 207 |
| హర్యానా 162 | పంజాబ్ 151 | ప. బెంగాల్ 116 |

# లక్షమంది బలి

- ప్రపంచవ్యాప్తంగా కరోనా మహమ్మారి విలయతాండవం
- మొత్తం మరణాల్లో దాదాపు సగం గత వారం రోజుల్లోనే
- అమెరికా, యూరప్‌లో వైరస్ ఉద్ధృతి తగ్గుముఖం

**బ్రసెల్స్, ఏప్రిల్ 10:** కరోనా పిడికిలిలో చిక్కి ప్రపంచం ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. ఈ మహమ్మారితో మృత్యువాతపడిన వారి సంఖ్య లక్ష దాటింది. శుక్రవారంనాటికి 1,01,559 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. అయితే అమెరికా, ఐరోపా దేశాల్లో కరోనా ఉద్ధృతి తగ్గుముఖం పట్టడం ఊరటనిచ్చే అంశం.

**అమెరికాలో మరో 1700 మంది..**

అమెరికాలో గురువారం మరో 1,700 మంది ప్రాణాలు కోల్పోగా, ఐరోపా దేశాల్లోనూ వందల మంది మృత్యువాతపడ్డారు. మహమ్మారి మొదలైనప్పటి నుంచి చోటుచేసుకున్న మొత్తం మరణాల్లో దాదాపు సగం ఈ వారం రోజుల్లోనే చోటుచేసుకోవడం గమనార్హం. అయితే అమెరికా, ఐరోపా దేశాల్లో రోజువారీ కేసులు, మరణాలు తగ్గుముఖం పట్టాయని అక్కడి అధికారులు చెబుతున్నారు. 'మహమ్మారి రాజేసిన అగ్ని అదుపులోకి రావడం మొదలైంది' అని స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో సాంచెజ్ వ్యాఖ్యానించారు. ఆ దేశంలో గురువారం 757 మంది మరణించగా, శుక్రవారం ఆ సంఖ్య 683కు తగ్గింది. మరోవైపు, ఫ్రాన్స్‌లో తొలిసారి ఐసీయూలో చేరే రోగుల సంఖ్యలో తగ్గుదల నమోదుకావడం విశేషం. అమెరికాలో శుక్రవారం మరో 1783 మంది ప్రాణాలు కోల్పోయారు. అంతకుముందు రోజు (1973) కంటే ఇది తక్కువ. ఇప్పటివరకు అమెరికాలో 16,500 మందికిపైగా ప్రాణాలు కోల్పోగా, 4,60,000 మందికి పైగా వైరస్ బారినపడ్డారు. కరోనాకు కేంద్ర స్థానంగా ఉన్న న్యూయార్క్‌లో గురువారం 799 మంది ప్రాణాలు కోల్పోయినప్పటికీ, శుక్రవారం కొత్తగా 200 కేసుల మాత్రమే నమోదయ్యాయని గవర్నర్ ఆండ్రూ క్యూమో తెలిపారు. కరోనా బారిన పడిన బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ ఆరోగ్యం మెరుగుపడినట్లు అక్కడి అధికారులు తెలిపారు. మూడు రోజుల అనంతరం ఆయన ఐసీయూ నుంచి బయటపడ్డారు.



**యెమెన్‌లో తొలి పాజిటివ్ కేసు..**

అంతర్యుద్ధంతో ఇప్పటికే సంక్షోభంలో కూరుకుపోయిన యెమెన్‌లో తాజాగా కరోనా మహమ్మారి కూడా అడుగుపెట్టడం ఆందోళన కలిగిస్తున్నది. ఆ దేశంలో శుక్రవారం తొలి కరోనా కేసు నమోదైంది. బ్రెజిల్‌లో శుక్రవారం తొలి మరణం నమోదైంది. సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో జర్మనీ శుక్రవారం ఐరాస భద్రతా మండలి సమావేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించింది. ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటేరస్ దీన్ని ప్రారంభించారు. కరోనాపై పోరాడేందుకు ప్రపంచదేశాలు ఘర్షణలకు ముగింపు పలుకాలని కోరారు. దీనిపై స్పందించిన సౌదీ అరేబియా.. యెమెన్‌లో రెబల్స్‌పై తమ దాడులను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. మరోవైపు, చమురు యుద్ధానికి ముగింపు పలుకాలని సౌదీ, రష్యాను కోరినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. చమురు ఉత్పత్తిని తగ్గించేందుకు మెక్సికో మినహా మిగిలిన అన్ని ప్రధాన చమురు ఉత్పత్తి దేశాలు అంగీకరించాయని ఒపెక్ తెలిపింది.

### లక్షమందిని మింగిన కరోనా వైరస్




### 170 దేశాల్లో తగ్గనున్న తలసరి ఆదాయం..

అమెరికా కేంద్ర బ్యాంకు ఫెడ్ రిజర్వ్ అమెరికన్లకు సొంతంగా 2.3 లక్షల కోట్ల డాలర్లతో ఆర్థిక ప్యాకేజీ ప్రకటించింది. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆర్థిక మాంద్యం ఏర్పడనుందని, 180 సభ్యదేశాలకు గానూ 170 దేశాల్లో తలసరి ఆదాయం తగ్గుతుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) హెచ్చరించింది.

### అగ్రరాజ్యం ఆక్రందన

కరోనాతో అమెరికా చివురుటాకులా వణికిపోతున్నది.న్యూయార్క్‌లో ఓవైపు మరణాల సంఖ్య భారీగా ఉండగా.. మరోవైపు ఇండ్లల్లోనూ మృతదేహాలు బయటపడుతున్నాయి. దీంతో ఇలా సామూహిక ఖననాలు నిర్వహిస్తున్నారు

| | కరోనా కేసులు | మరణాలు |
|---|---|---|
| న్యూయార్క్ | 1,70,512 | 7,844 |
| న్యూజెర్సీ | 54,588 | 1,932 |
| మిషిగాన్ | 21,504 | 1,076 |



# పొమ్మంటున్న అమెరికా!

- కరోనాతో ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం
- అనూహ్యంగా పెరిగిపోతున్న నిరుద్యోగం
- హెచ్1బీ వీసాదారుల ఉద్యోగాలకు ముప్పు
- 90వేల మందిపై వేలాడుతున్న కత్తి
- వీసా గడువు పెంచాలని ఎన్నారైల విన్నపం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** కరోనా.. డాలర్ డ్రీమ్స్‌ను చెదురగొట్టబోతున్నదా? ఆర్థికంగా స్థిరపడాలనే తపనతో అమెరికాకు వెళ్లిన ప్రవాస భారతీయుల కలలు..కల్లలు కాబోతున్నాయా?. ప్రస్తుత పరిణామాలు, కొన్నిసర్వేలు ఇది నిజమేనని చెప్తున్నాయి. కరోనా ప్రభావంతో అమెరికా ఆర్థిక రంగం కుదేలైంది. దీంతో సంస్థలు ఉద్యోగుల సంఖ్యను తగ్గించే క్రమంలో స్థానికులకు ప్రాధాన్యం ఇస్తూ.. హెచ్1బీ వీసాదారులపై వేటు వేస్తున్నాయి.

**20-30 శాతం మంది ఇంటికి**

అమెరికాలో మూడు లక్షల మంది హెచ్1బీ వీసాదారులు ఉన్నారు. ఇందులో సగానికిపైగా భారతీయులే. వారికి అక్కడి భారతీయ ఐటీ కంపెనీలు కల్పతరువులుగా ఉన్నాయి. ఇప్పుడు ఉద్యోగాల్లో కోతవిధించడం మొదలుకావడంతో వీరంతా మూటాముల్లె సర్దుకొని భారత్‌కు తిరిగిరావాల్సి ఉంటుంది. రానున్న 5-7 నెలల్లో 20-30 శాతం మంది హెచ్1బీ, హెచ్4 వీసాదారులను స్వదేశాలకు పంపవచ్చని అంచనా. అంటే.. దాదాపు 90 వేల మంది కలలు సమాధి అవుతాయన్నమాట.




| | |
|---|---|
| 3 లక్షలు | అమెరికాలోని హెచ్1బీ వీసాదారుల సంఖ్య |
| 90 వేలు | ఉద్యోగాలు కోల్పోబోతున్న వీసాదారులు |

**పెరుగుతున్న నిరుద్యోగం**

ప్రస్తుతం అమెరికాలో దాదాపు 4.7 కోట్ల మంది నిరుద్యోగులున్నట్టు అంచనా. గతవారం 60 లక్షల మంది నిరుద్యోగ భృతి కోసం దరఖాస్తు చేసుకున్నట్టు అధికారిక లెక్కలు చెప్తున్నాయి. హోటల్ మేజర్ మారియట్ నాలుగువేల మందిని, నార్వేజియన్ విమానయాన సంస్థ 50 శాతం, బ్రిటిష్ ఎయిర్‌వేస్ 30వేల మంది ఉద్యోగులను తొలిగించాయి. వీరిలో ఎక్కువ మంది హెచ్-1బీ వీసాదారులేనని నివేదికలు చెప్తున్నాయి.

### గండంగా మారిన గడువు

హెచ్1బీ వీసా నిబంధనల ప్రకారం.. ఒక వ్యక్తి అమెరికాకు చేరిన తర్వాత లేదా ఒక కంపెనీ నుంచి ఉద్యోగం కోల్పోయిన తర్వాత 60 రోజుల్లోగా ఉద్యోగాన్ని వెతుక్కోవాల్సి ఉంటుంది. లేదంటే హెచ్1బీ వీసా రద్దయ్యి.. బీ2 (విజిటింగ్)వీసాగా మారుతుంది. మరోవైపు కొందరి హెచ్1బీ వీసాల గడువు ముగుస్తున్నది. గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్నవారి పరిస్థితి సైతం ఇలాగే ఉన్నది.

**180 రోజులకు పెంచండి**

ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని 60 రోజులుగా ఉన్న గడువును 180 రోజులకు పెంచాలని కోరుతూ ప్రవాస భారతీయులు అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌజ్‌కు ఆన్‌లైన్‌లో ఓ పిటిషన్ పంపారు. అమెరికాతోపాటు అంతర్జాతీయంగా రాకపోకలపై నిషేధం ఉన్నదని, ఈ పరిస్థితుల్లో భార్యాపిల్లలను తీసుకొని స్వదేశానికి వెళ్లలేమని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై 53వేల మంది సంతకాలు చేశారు. అయితే లక్ష మంది సంతకాలు చేస్తేనే ఈ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకుంటారు.

## లాక్‌డౌన్‌పై మీ అభిప్రాయాలేమిటి?

### రాష్ట్రాలను కోరిన కేంద్రం

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం విధించిన 21 రోజుల లాక్‌డౌన్ 14వ తేదీతో ముగియనుండటంతో కేంద్ర హోం శాఖ స్పందించింది. దీనిపై అభిప్రాయాలు, సూచనలు పంపాలని రాష్ట్రాలను, కేంద్రపాలిత ప్రాంతాలను కోరింది. ఈ మేరకు ఓ లేఖ రాసింది. అందులో వివరాలు ఇలా ఉన్నాయి.

- లాక్‌డౌన్‌కు సంబంధించి అన్ని విషయాలను కేంద్ర ప్రభుత్వంతో పంచుకోండి.
- ప్రస్తుతం అమలవుతున్న లాక్‌డౌన్ నుంచి ఏమైనా మినహాయింపులు కోరుతున్నారా?
- ప్రభుత్వ సేవలుగానీ, ప్రజలకు సంబంధించిన విషయాల్లోగానీ సడలింపులు కావాలా?
- వ్యవసాయంతో ముడిపడిన పనులకు లాక్‌డౌన్ నుంచి మినహాయింపు ఉన్నది. కాబట్టి రైతులకు ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా చూడండి.
- సరకు రవాణా సవ్యంగా సాగేలా చూడండి.
- మీరిచ్చే సూచనలు, అభిప్రాయాలు కరోనా వ్యాప్తిని నిరోధించడంలోనూ, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించడంలోనూ ఎంతగానో ఉపయోగపడనున్నాయి.

**సామూహిక కార్యక్రమాలను అనుమతించొద్దు**

ఏప్రిల్ నెలలో పలు పండుగలున్న దృష్ట్యా మతపరమైన సామూహిక కార్యక్రమాలను అనుమతించవద్దని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం సూచించింది.

## కొత్తగా బయటపడ్డ ఎబోలా!

**కిన్షాస:** ఎబోలా వైరస్ ప్రభావం ముగిసిందని సోమవారం ప్రపంచ ఆరోగ్యసంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) అధికారిక ప్రకటన చేయడానికి కేవలం మూడు రోజుల ముందు కాంగోలో దాని బారిన పడి 26 ఏండ్ల యువకుడు మరణించటం కలకలం రేపింది.దీనిని డబ్ల్యూహెచ్‌ఓ అధిపతి టెడ్రోస్ అధానోమ్ ఘెబ్రెయెసస్ దురదృష్టకర ఘటనగా అభివర్ణించారు.

## పంజాబ్‌లో లాక్‌డౌన్ పొడిగింపు

**చండీగఢ్:** పంజాబ్‌లో లాక్‌డౌన్‌ను ఈ నెల 30 వరకు పొడిగిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సీఎం అమరీందర్ సింగ్ శుక్రవారం మంత్రులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో కరోనా కేసులు పెరిగిపోతున్న నేపథ్యంలో లాక్‌డౌన్‌ను పొడిగించడమే ఉత్తమమని ఏకగ్రీవంగా నిర్ణయించారు. అనంతరం ఈనెల 30 వరకు లాక్‌డౌన్‌ను పొడిగిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

### రాష్ట్రాల్లో ఇదీ పరిస్థితి

- **ఉత్తరప్రదేశ్:** లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించినందుకు 13,200 మందిపై యూపీ పోలీసులు కేసులు నమోదు చేశారు. రూ.5.87 కోట్ల జరిమానాలను వసూలు చేశారు.
- **కర్ణాటక:** రెండు మున్సిపల్‌వార్డులను 14 రోజులపాటు పూర్తిగా మూసివేస్తున్నట్లు బృహత్ బెంగళూరు మహానగర పాలిక కమిషనర్ అనిల్‌కుమార్ చెప్పారు. ఈ వార్డుల్లో ఐదు కరోనా కేసులు వెలుగు చూసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.
- **కేరళ:** డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది కోసం కేరళలోని సెంట్రల్ జైలు ఖైదీలు యూనిఫాంలను తయారు చేస్తున్నారు. కరోనా నేపథ్యంలో వీళ్లు ఇప్పటికే భారీగా మాస్కులను తయారు చేశారు.
- **జార్ఖండ్:** లాక్‌డౌన్ నేపథ్యంలో ఇండ్లల్లోనే ఉంటున్న ప్రజలకు బోరుకొట్టకుండా ఉండేందుకు జార్ఖండ్‌లోని దుమ్కా జిల్లా యంత్రాంగం రకరకాల వస్తువుల తయారీపై ఆన్‌లైన్ పోటీలను నిర్వహిస్తున్నది.
- **రాజస్థాన్:** పేదలకు ఆహారాన్ని ఇచ్చేటప్పుడు సెల్ఫీలు తీసుకోవడం.. వీడియోలు చిత్రీకరించడంపై రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్ జిల్లా యంత్రాంగం నిషేధం విధించింది.
- **మహారాష్ట్ర:** నిత్యావసరాలను ఉత్పత్తి చేసే దాదాపు 338 కంపెనీలు తిరిగి తమ కార్యకలాపాలను కొనసాగించడానికి మహారాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకుంది.



పంజాబ్‌లోని జలంధర్‌లో పహారా కాస్తున్న సీఆర్పీఎఫ్ సిబ్బంది

## ఏపీలో 365 కేసులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్‌లో తాజాగా మరో రెండు కరోనా కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం కేసుల సంఖ్య 365కు పెరిగింది. వైరస్ వల్ల ఇప్పటివరకు ఆరుగురు మరణించగా.. 10మంది చికిత్స అనంతరం డిశ్చార్జి అయ్యారు. ఏపీలో అత్యధికంగా కర్నూల్ జిల్లాలో 75 కేసులు, గుంటూరులో 51, నెల్లూరులో 48, ప్రకాశంలో 38, కృష్ణాలో 35 కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలో కరోనా కేసులు పెరిగిపోతున్న నేపథ్యంలో 133 ప్రాంతాలను అధికారులు రెడ్‌జోన్లుగా ప్రకటించారు.

చరిత్రలో నేడు - 1968

పౌరహక్కుల చట్టంపై సంతకం చేసిన అమెరికా అధ్యక్షుడు లిండన్ బి జాన్సన్.

# వేదిక



కొవిడ్-19 లక్షణ రహితంగా వ్యాపించే అవకాశం ఉన్నదని ఇప్పుడు తెలిసివచ్చింది. ఈ వ్యాధి ఏ విధాలుగా సోకుతున్నదో అర్థం చేసుకోవడం ద్వారా తదనుగుణమైన చర్యలను చేపట్టాలి. మనకున్న సమాచారం మీదనే ఆధారపడి ఉండకూడదు.

– ప్రొఫెసర్ యిక్-యింగ్ టెవో, సా స్వీ హాక్, ప్రజారోగ్య కళాశాల, సింగపూర్

నమస్తే తెలంగాణ

## సైద్ధాంతిక మోహరింపు

**అమెరికా** అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిత్వానికి సాగుతున్న పోటీ నుంచి బెర్నీ శాండర్స్ తప్పుకోవడంతో, రిపబ్లికన్ పార్టీ తరపున పోటీ చేసే దేశాధ్యక్షుడు ట్రంప్‌ను ఢీకొనేది జో బిడెన్ అనేది ధ్రువపడ్డది. యువకులను, కార్మికులను బెర్నీ శాండర్స్ సంక్షేమ అజెండా విశేషంగా ఆకర్షించింది. కానీ మధ్యేవాదియైన బిడెన్‌వైపు డెమొక్రాటిక్ పార్టీ 'నాయకత్వం' మొగ్గుచూపింది. పార్టీ అంతర్గతపోటీలో బిడెన్ కన్నా శాండర్స్ క్రమంగా వెనుకబడిపోయారు. దీంతో పోటీ నుంచి వైదొలగాలని ఆయన నిర్ణయించుకున్నారు. కరోనా పరిస్థితి కూడా ఆయన నిర్ణయాన్ని ప్రభావితం చేసింది. శాండర్స్ నిర్ణయం తీసుకున్న సమయం కీలకమైనది. అధ్యక్ష ఎన్నికకు ఇంకా ఏడు నెలల వ్యవధి ఉన్నది. పార్టీలో పరస్పరం పోటీపడటం వల్ల కాలహరణమే తప్ప ప్రయోజనం లేదు. శాండర్స్ వైదొలగడం వల్ల డెమొక్రాటిక్ పార్టీ తన శక్తినంతా ట్రంప్ పాలనా వైఫల్యాలను ఎత్తిచూపడంపైనే కేంద్రీకరించవచ్చు. కరోనాను కట్టడి చేయడంలో ట్రంప్ విఫలమయ్యారనే అభిప్రాయం ఇప్పటికే బలంగా ఉంది.

శాండర్స్ వైదొలగినంతనే ఆయన అనుకూల ఓట్లన్నీ గంపగుత్తగా తనకు బదిలీ అవుతాయని బిడెన్ కూడా నమ్మడం లేదు. నిరుద్యోగులకు, కార్మికులకు, ఇతర పేదవర్గాలకు అనుకూలమైన పథకాలను శాండర్స్ చర్చనీయాంశం చేశారు. ఆయన అజెండాను కొంత మేర అయినా అమలుచేయడానికి బిడెన్ సిద్ధపడవలసి ఉంటుంది. వైద్య సహాయ పథకాన్ని విస్తృత పరుస్తామని, కొంత మేర పేద విద్యార్థుల విద్యా రుణాలు రద్దుచేస్తామని బిడెన్ ప్రకటించారు. అయితే ఈ తక్షణ ప్రకటన తాను శాండర్స్ అజెండా వైపు మొగ్గినట్టు ఇచ్చే సంకేతం మాత్రమే. శాండర్స్ అజెండాను బిడెన్ ఎంత మేరకు స్వీకరిస్తారనేది కొన్ని వారాల పాటు సాగే చర్చల్లో తేలుతుంది. శాండర్స్ 2016లో కూడా డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిత్వం కోసం ప్రయత్నించారు. ఈసారి కూడా అభ్యర్థిత్వం పొందడంలో విఫలమైనప్పటికీ, అమెరికా రాజకీయాలను మలుపు తిప్పడంలో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లోనే కాదు, తర్వాతి ఎన్నికల్లోనూ శాండర్స్ సైద్ధాంతిక ప్రభావం ఉంటుందని విశ్లేషకులు అంటున్నారు.

1980 దశకం నుంచి అమెరికా రాజకీయాల్లో నయా ఉదారవాద భావజాలానిదే పైచేయిగా సాగుతున్నది. రెండు పార్టీల అజెండాలో పెద్దగా తేడా లేని పరిస్థితి ఉండేది. సంక్షేమ పథకాల్లో కోత, కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం మొదలైన విధానాల ప్రభావం అమెరికా ప్రజల అనుభవానికి రావడానికి కొంతకాలం పట్టింది. పర్యావరణ విధ్వంసం, ఆర్థిక అసమానతలు, వినియోగ సంస్కృతి, కార్పొరేట్‌శక్తుల ఆధిపత్యం పట్ల అమెరికా ప్రజల్లో వ్యతిరేకభావన పెరిగిపోతున్నది. ఒక దశలో సంపన్నవర్గానికి వ్యతిరేకంగా 'వి ఆర్ 99 పర్సంట్' నినాదం మార్మోగింది, 'ఆక్యుపై వాల్ స్ట్రీట్' ఉద్యమమూ సాగింది. ఇప్పుడు ఈ ప్రగతిశీల భావజాలం ఎన్నికల రాజకీయంలో స్పష్టమైన రూపుదిద్దుకున్నది. 1930 దశకంలో మహామాంద్యం సందర్భంగా అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలను 'న్యూడీల్' అంటారు. ఇప్పుడు వాతావరణ మార్పు, ఆర్థిక అసమానత అనే రెండు పోకడలను అరికట్టడానికి 'గ్రీన్ న్యూడీ ల్' అనే ప్రతిపాదన ప్రధానాంశంగా ముందుకురావడం విశేషం.

# కరోనాపై విజయం ఖాయం

ముక్తసరి



దేవులపల్లి ప్రభాకరరావు

'కరో యా మరో' (Do or Die) భారత స్వాతంత్ర్య, జాతీయ ఉద్యమాల మహాసారథి గాంధీజీ ఇచ్చిన అత్యంత శక్తిమంతమైన, నిర్ణయాత్మకమైన, చివరి నినాదం ఇది. చరిత్రాత్మకమైన, మహత్తరమైన 'క్విట్ ఇండియా' నినాదంతో గాఢంగా, అవిభాజ్యంగా పెనవేసుకున్న నినాదం 'కరో యా మరో'.190 ఏండ్లు నిరంతరంగా బంగారు పిచ్చుక వంటి ఈ దేశాన్ని పీల్చి పిప్పిచేసిన బ్రిటిష్ పాలకులు ఇక ముల్లె మూటా సర్దుకొని భారతభూమిని వదిలివెళ్లిపోవాలని గాంధీజీ ఈ రెండు నినాదాలు ఇచ్చారు. ప్రపంచ ప్రఖ్యాత పత్రికా రచయిత లూయీ ఫిషర్ 1942 జూన్‌లో జరిపిన ఇంటర్వ్యూలో గాంధీజీ 'నా ఓపిక నశించింది' అని అన్నారు.

**రెండవ** ప్రపంచయుద్ధం క్లిష్టదశకు చేరిన సమయం అది. హిట్లర్ నాయకత్వంలోని ఫాసిస్టు శక్తులపై మిత్రపక్షాలు (బ్రిటన్, యూఎస్ఏ తదితర దేశాలు) విజయం సాధించబోతున్న ఆ సమయంలో గాంధీజీ ఆంగ్లేయ పాలకులకు వ్యతిరేకంగా 'కరో యా మరో' నినాదంతో 'క్విట్ ఇండియా' పిలుపునివ్వడం కొందరు భారత జాతీయ కాంగ్రెస్ అగ్ర నాయకులకు ఇష్టం లేదు. 1942 జూలైలో గాంధీజీ వార్ధా ఆశ్రమంలో 'క్విట్ ఇండియా' తీర్మానాన్ని స్వయంగా రాశారు. వార్ధాలోనే భారత జాతీయ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశమై గాంధీజీ 'క్విట్ ఇండియా' తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. 1942 ఆగస్టు 8న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ముంబైలో గాంధీజీ తీర్మానాన్ని ఆమోదించి 'క్విట్ ఇండియా' పిలుపునిచ్చింది. మరునాడే ఆగస్టు 9న దేశమంతటా క్విట్ ఇండియా ఉద్యమం మొదలైంది. దేశ ప్రజలు లక్షల సంఖ్యలో ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. భారత జాతీయ కాంగ్రెస్ తనవెంట వచ్చినా, రాకపోయినా దేశ ప్రజల సహకారంతో 'క్విట్ ఇండియా' ఉద్యమాన్ని ప్రారంభిస్తానని లూ యీ ఫిషర్ ఇంటర్వ్యూలో గాంధీజీ స్పష్టం చేశారు. పేరు ప్రతిష్ఠల కోసం తాపత్రయపడకుండా అవసరమైనప్పుడు దేశం కోసం, తాను నమ్మిన సిద్ధాంతాల కోసం కఠిన నిర్ణయాలు చేయడం లో గాంధీజీ ఘటికుడు. 'క్విట్ ఇండియా' అనగానే బ్రిటిష్ పాలకులు పారిపోరని గాంధీజీకి బాగా తెలుసు. అందువల్లనే 'కరో యా మరో' అని గాంధీజీ అంతిమ నినాదం ఇచ్చారు. ఆ దెబ్బతో బ్రిటిష్ దయ్యం వదిలింది. క్రిప్స్ మిషన్ వచ్చిం ది. చర్చిల్ తర్వాత ప్రధాని అయిన లేబర్ పార్టీ నాయకుడు అట్లీ స్వయంగా భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వబోతున్నట్లు బ్రిటిష్ పార్లమెంట్‌లో ప్రకటించారు.



తెలంగాణ ఉద్యమకాలం నుంచి గాంధేయమార్గంలో ఉద్యమిస్తున్న కేసీఆర్‌కు తెలుసు 'కరోనా వెళ్లిపో' అనగానే తాటకి, పూతకి కరో నా వెళ్లిపోదని. అందుకే కేసీఆర్ కఠిన నిర్ణయాలకు అసాధారణరీతిలో సాహసిస్తున్నారు. ఆయన నిర్ణయాలతో కేంద్ర నాయకులు, ఇతర రాష్ట్రాల నాయకులు స్ఫూర్తిపొందడం విశేషం.

వివిధ దేశాల్లో, వివిధ పరిశోధనా సంస్థల్లో కరోనా విషక్రిమి రూపురేఖలపై, దాని వినాశకర స్వభావంపై ఎన్నో పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఒక అదృశ్య, భయంకర, వినాశకశక్తిని నిర్మూలించడానికి ఈరోజు మానవాళి పోరాడుతున్నది. మానవాళి అస్తిత్వానికి విఘాతం కలిగిస్తున్న ఈ విధ్వంసినిని జాలు పట్టి అరికట్టగలమన్న ప్రబల విశ్వాసంతో మానవుడు పోరాడుతున్నాడు. విశ్వాసం లేకపోతే విజయం సాధ్యం కాదు. ఉప్పుతో ఏం సాధిస్తామని కొందరు అవహేళన చేశారు. అయినా, గాంధీజీ తన శాసనోల్లంఘన ఉద్యమ కార్యక్రమాల్లో భాగంగా 1930, మార్చి 12న అహ్మదాబాద్‌లోని సబర్మతి ఆశ్రమం నుంచి 78 మంది అనుచరులతో కలిసి కాలినడకన దండియాత్ర ప్రారంభించారు. 24 రోజుల్లో 360 కి.మీ. నడిచి గాంధీజీ, ఆయన అనుచరులు గుజరాత్ సముద్రతీరాన దండి గ్రామం చేరారు ఏప్రిల్ 5న. మరునాడు ఏప్రిల్ 6న దండి తీరంలో గాంధీజీ ఉప్పు తీసి శాసనోల్లంఘన జరిపారు. అంతటితో శాసనోల్లంఘన ఆగలేదు. దేశమంతటా విస్తరించింది. చివరికి విజయం సాధించారు. స్వాతంత్ర్యం సాధించగలమన్న విశ్వాసం లేకపోతే గాంధీజీ విజయం సాధించేవాడు కాదు. విముక్తి పొందగలమన్న విశ్వాసంతో రంగంలోకి దిగారు గనుకనే కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించగలిగారు. కరోనా రక్కసిని కూల్చివేయగలమన్న, కాల్చివేయగలమన్న దృఢవిశ్వాసంతో ఈరోజు మానవాళి కంకణధారణ చేసింది.

> వివిధ దేశాల్లో, వివిధ పరిశోధనాసంస్థల్లో కరోనా విషక్రిమి రూపురేఖలపై, దాని వినాశకర స్వభావంపై ఎన్నో పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఒక అదృశ్య, భయంకర, వినాశకశక్తిని నిర్మూలించడానికి ఈరోజు మానవాళి పోరాడుతున్నది.

ఎన్ని త్యాగాలు చేయవలసి వచ్చినా, ఎన్ని కష్టాలు అనుభవించవలసి వచ్చినా కరోనా మహమ్మారికి వ్యతిరేకంగా మానవాళి ప్రకటించిన యుద్ధం ఆగేది కాదు. ఏటా ఎన్నో అమూల్య ప్రాణాలను బలిగొంటున్న క్యాన్సర్ వ్యాధి నిరోధానికి, చికిత్సకు మానవుడి పరిశోధనా కృషి ఆగడం లేదు. ఎయిడ్స్ వ్యాధి వెలుగులోకి వచ్చినప్పుడు అదీ కరోనా వలెనే భయపెట్టింది. ఎయిడ్స్ వ్యాధి మెడవంచే ప్రయత్నాన్ని మానవుడు కొనసాగిస్తున్నాడు. జవహర్‌లాల్ నెహ్రూ అర్ధాంగి కమలా నెహ్రూ క్షయవ్యాధితో అకాల మరణం పాలయ్యారు. కొన్నేండ్ల కిందట ప్రసిద్ధ పారిశ్రామికవేత్త జి.డి.బిర్లా సతీమణి ఇదే వ్యాధితో మరణించారు. క్షయ వ్యాధి నిర్మూలన ప్రయత్నాలను మానవుడు నిలిపివేయలేదు. కొన్నాళ్లు టైఫాయిడ్ మానవ ఆరోగ్యానికి విపరీత నష్టం కలిగించింది. టైఫాయిడ్‌కు గురై వినికిడిని, మాటను శాశ్వతంగా కోల్పోయిన మిత్రుడు ఒకతను డిగ్రీలు లేకపోయినా స్వయంకృషితో రచయితగా, చిత్రలేఖన కళాకారుడిగా, విమర్శకుడిగా, సంపాదకుడిగా తెలుగు సారస్వతరంగంలో ప్రసిద్ధి పొందాడు. టైఫాయిడ్ క్రూరత్వానికి గురైన వారు ఎందరో. మశూచి, ప్లేగు, పోలియో వంటి భయంకర వ్యాధులను శాశ్వతంగా నిర్మూలించిన మానవుడు ఇతర వ్యాధుల మృత్యుగహ్వరం నుంచి విముక్తి పొందడం అసాధ్యం కాదు. మానవాళి తన పరిణామ క్రమంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ముందంజ వేయగలుగుతున్నది– అంతరిక్షంలోకి సైతం అడుగువేయగలుగుతున్నది. ప్రకృతి వైపరీత్యాలు, మానవకల్పిత యుద్ధాలు, దాడులు, దండయాత్రలు, రక్తపాతాలు, రణరంగాలు, ఆకలి, అజ్ఞానం, అనారోగ్యం వంటి ఎన్నింటినో అధిగమించగలిగింది. కరోనా కరాళ, కంకాళ నృత్యాన్ని, వికటాట్టహాసాన్ని కూడా తట్టుకొని దరిచేరగలుగుతుంది.

విశ్లేషణ



ఆచార్య అమరేశం రాజేశ్వరశర్మ

## కేసీఆర్ మాట దేశానికి బాట

**కరోనాను** ఎదుర్కొనలేక అమెరికా వంటి పెద్ద దేశాలే చేతులెత్తేసి, ఏం చేయాలో తోచక అతలాకుతలమవుతున్నాయి. సామాజిక దూరం పాటించడమే దీన్ని అడ్డుకొనడానికి ఉన్న ఆయుధం. ఒక కరోనా వ్యాధి పీడితుడు సమాజంలో సంచరిస్తూ తనకు తెలియకుండానే వందల మందికి రోగాన్ని వ్యాపించడం ఈ అంటురోగం ప్రత్యేక లక్షణం. అట్లా సంక్రమింపజేస్తున్నప్పుడు ఆ రోగిలో కరోనా వ్యాధి ప్రస్ఫుటంగా ఉండదు. కనుక అది బయటపడేలోగానే అతని ద్వారా వేలాది మందికి వ్యాధి సంక్రమిస్తుంది. ఈ విధంగా వ్యాధిగ్రస్థులు వ్యాధి లక్షణాలు బయటపడేలోగానే వేలాది మందికి తమకు తెలియకుండానే వ్యాధిని సంక్రమింపజేస్తారు. అందువల్ల దీన్ని మానవజాతిని నాశనం చేసే మహమ్మారి అని గుర్తించాలి.

మహా మేధావీ, శాస్త్రవేత్త అయిన ఐన్‌స్టీన్ మహాశయుడు వెనుకట ప్రకటించినాడని చెప్పే ఉదంతం ఒకటి ఇప్పుడు గుర్తుకువస్తున్నది. ద్వితీయ ప్రపంచయుద్ధం ముగిసిన తర్వాత ఆయనను మూడవ ప్రపంచయుద్ధం లో ఉపయోగించే ఆయుధాలను గురిం చి చెప్పవలసిందని అడిగితే ఆయన 'అటువంటి యుద్ధం వస్తే అప్పటికి వృద్ధిచెందిన శాస్త్ర జ్ఞానం వల్ల ఎటువంటి ఆయుధాలు వస్తాయో నాకు తెలియదు కానీ, ఆ తర్వాత నాలుగో ప్రపంచయుద్ధంలో ఉపయోగించేవి మాత్రం కర్రలే అని నాకు తెలుసు' అని ఐన్‌స్టీన్ సమాధానం చెప్పినాడట. ఇప్పుడు కరోనా మారణహోమంలో చనిపోతున్న వారి సంఖ్యను చూస్తే ఇది మూడవ ప్రపంచయుద్ధమే అనిపిస్తున్నది. ఏ మాత్రం ఉపేక్షించినా ఈ వైరస్ మొత్తం నాగరిక సమాజాన్నే మట్టుపెట్టే మహమ్మారి వలె కానవస్తున్నది. సర్వవిధాలుగా అభివృద్ధి చెందిన దేశాల్లో శవాలు గుట్టలుగా కానవస్తున్నట్టు వార్తలు చూస్తున్నాం. ఇలాంటి పరిస్థితే మన దేశంలో సంభవిస్తే ఎంత భయంకరమో!.

అదృష్టవశాత్తు నేడు మన దేశ నాయకత్వం సమర్థులూ, స్వార్థరహితులూ, సర్వమానవ కళ్యాణాన్ని కోరేవారి చేతుల్లో ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వాలూ కేంద్ర ప్రభుత్వానికి సహకరిస్తూ వ్యాధి నివారణకు ప్రయత్నాలు చేస్తున్నవి. కాబట్టి మన దేశం మిగితా దేశాలకంటే మంచి స్థితిలో ముందుకుసాగుతున్నది. దీనికి ప్రజల సహకారం కూడా తోడుగా ఉంది. దేశ క్షేమం, ప్రజాక్షేమం అన్నింటికంటే ముఖ్యమైంది. రోగ నివృత్తి కోసం అహరహం ప్రాణాలను పణంగా పెట్టి రోగులకు సేవ చేస్తున్న వైద్యుల సహకారం ప్రశంసనీయం. వారికి ప్రజలు కృతజ్ఞులుగా ఉండాలి. వైద్యులు రోగుల రక్షణ కోసం చేసే సేవను మరిచి వారిపై దాడులకు దిగడం సర్వదా గర్హింపదగిన విషయం. ఈ ప్రవృత్తి నుంచి ప్రజలు దూరంగా ఉండాలి.

కరోనా కట్టడి కోసం సీఎం కేసీఆర్ అవిరళ కృషిచేస్తున్నారు. ఇందులో భాగంగానే అందరికన్నా ముందు రాష్ట్రంలో లాక్‌డౌన్ ప్రకటించి దేశానికే ఆదర్శం గా నిలిచారు. ఈ విషయమై జాతీయ నేతలు సైతం కొనియాడారు. 'దూర చికిత్స'ను పాటిస్తూనే మన దేశ ప్రజలందరూ ఈ మధ్య రెండుమార్లు సామూహిక మనో యజ్ఞాల్లో పాల్గొనడం యావత్తు ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. దానివల్ల సత్ఫలితాలు సామాన్యమైనవి కావు. అదొక యౌగిక ప్రక్రియ. మానవులకున్న మనోశ్శక్తి అద్భుతమైంది. అది ఏకీకృతమైతే దానికి అసాధ్యమంటూ ఉండదు. కనుకనే మేధావులూ, నాయకులూ, ఆధ్యాత్మికవేత్తలూ, అధికారులూ స్త్రీ, పురుష భేదం లేకుండా, జాతి, మత, ప్రాంతీయ భావాలకతీతంగా ఈ సామూహిక మానసిక ప్రార్థనల్లో పాల్గొని తమ ఐకమత్యాన్ని చాటారు. ఇది మానవ జాతికి శుభోదయం.

# నవయుగ వైతాళికుడు

> దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు 'కరోనా' వైరస్ పెనుసవాలుగా మారింది. అయితే తెలంగాణ విషయానికి వచ్చేసరికి కేసీఆర్ పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి ద్వారా నూతనోత్తేజం పొందిన స్థానిక నాయకత్వం, అధికార యంత్రాంగం, ప్రజల భాగస్వామ్యంతో ఈ మహమ్మారిని సమర్థవంతంగా నియంత్రించడానికి పటిష్ఠమైన చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఒకే ఒకరోజు కోటి 9 లక్షల కుటుంబాల సామాజిక, ఆర్థిక జీవన విధానాలు, ఆయా ప్రాంతాల మౌలిక వసతుల సమగ్ర సమాచారాన్ని సేకరించి దేశంలోనే నూతన అధ్యాయానికి నాంది పలికారు కేసీఆర్.



కరోనా



ప్రొఫెసర్ తాటికొండ రమేశ్

**ఈ సమాచారమే** దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేద ప్రజానీకానికి ఆధునిక పథకాలను వర్తింపజేయడానికి ప్రాతిపదిక అయ్యింది. లాక్‌డౌన్ పర్యవసానంగా తలెత్తిన ఇబ్బందులను అధిగమించడానికి ఒక్కొక వ్యక్తికి 12 కిలోల బియ్యం, రూ.1500 నగదు అందజేయడం విశేషం. ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టి ఈ విపత్కర పరిస్థితుల్లో సత్ఫలితాలను అందజేసిందనడంలో సందేహం లేదు.

ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ఉన్న పాత చట్టాల స్థానంలో 'తెలంగాణ నూతన పంచాయతీరాజ్ చట్టం–2018'ని ఏర్పాటు చేశారు. ఆదివాసీ గూడేలను, గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధుల అధికారాలు, విధులు నిర్వచించి, గ్రామసభలను తు.చ. తప్పకుండా నిర్ణీతకాలంలో విధిగా నిర్వహించాలని నిర్దేశించారు. దేశంలో ఇదొక వినూత్న ప్రయోగం. దేశంలో ఏ రాష్ట్రం చేయనివిధంగా స్థానిక సంస్థలను పటిష్ఠ పరిచారు. స్థానిక ప్రజాప్రతినిధులను, అధికార యంత్రాంగాన్ని సమన్వయపరుస్తూ సమర్థవంతమైన పౌరసేవలను సంస్థాపరంగా అందజేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం వినూత్న రీతిలో పట్టణ ప్రాం తాలలో బస్తీ దవాఖానలను ప్రారంభించి పేద ప్రజానీకానికి పటిష్ఠమైన, నాణ్యమైన సేవలను అందిస్తున్నారు. ఈ పరిపాలనా రంగ మార్పులు కూడా కరోనాపై గట్టిగా పోరాడటానికి అవకాశం కల్పించాయి.

మహమ్మారి కరోనా కరాళ నృత్యం చేస్తున్న నేపథ్యంలో లాక్‌డౌన్‌లో సైతం అవసరమైన వ్యవసాయోత్పత్తులు, కూరగాయలు, పండ్లు, మంచినీటికి ఏ మాత్రం కొదవలేదని కేసీఆర్ ధీమాగా చెప్పడంతో ప్రజలు ప్రశాంతంగా ఉండగలుగుతున్నారు. రాష్ట్ర ఆర్థికవ్యవస్థ సంక్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పటికీ కేసీఆర్ రూ. 30 వేల కోట్లను కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని సేకరించడానికి కేటాయించారు. రైతాంగం ఇబ్బంది పడకుండా ధాన్య సేకరణలో వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు ఒక కంట్రో ల్ రూంను కూడా ఏర్పాటుచేశారు.

కేసీఆర్ గ్రామీణ, వ్యవసాయరంగాలను అభివృద్ధి చేయడానికి అవసరమైన ప్రభుత్వ ఉద్యోగులను పెద్ద ఎత్తున నియమించారు. దీంతో క్షేత్రస్థాయిలో విస్తృత పాలనా యంత్రాంగం అందుబాటులోకి వచ్చింది. ఉద్యోగ బృందం సమన్వయంతో, సమిష్టి కృషితో కరోనా మహమ్మారిని మటుమాయం చేయడానికి చేస్తున్న కృషిని భారత సమాజంతో పాటు యావత్ ప్రపంచం గుర్తించింది. స్వీయ పరిశుభ్రత, స్వీయ క్రమశిక్షణ, స్వీయ నియంత్రణ పాటించడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని ప్రజలకు కేసీఆర్ పిలుపునిచ్చారు. శాస్త్ర, సాంకేతిక, విద్య, వైద్యరంగాల్లో అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రజలు కరోనా మహమ్మారికి గురై పిట్టల్లా రాలిపోతున్నారు. ప్రజలకు వారి బంధువులను చూడటానికి, దహన సంస్కారాలు జరుపడానికి కనీ సం అవకాశం లేనటువంటి హృదయవిదారకమైన పరిస్థితులను మానవాళి ఎదుర్కొంటున్నది.

అభివృద్ధి చెందిన దేశాల్లోని వైద్య సదుపాయాలు మన దేశంలో లేవు. మౌలిక వసతులు, సేవలు, డాక్టర్లు, రోగుల నిష్పత్తిలో వర్ధమాన దేశమైన భారతదేశ పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. అందుకే లాక్‌డౌన్‌ను పొడిగించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధానికి సూచించారు. మనుషుల ప్రాణాల కంటే ఆర్థికవ్యవస్థ ముఖ్యం కాదంటూ ధైర్యాన్ని నింపిన కేసీఆర్ ప్రపంచదేశాల నాయకులతో పోల్చినపుడు రెండడుగులు ముందే ఉన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల ఆలోచనలను మేల్కొల్పి, పదునుపెట్టారు. వాటి వ్యవస్థీకరణ కోసం కృషిచేశారు. పల్లెప్రగతి, పట్టణప్రగతి, సమగ్ర కుటుంబ సర్వే ద్వారా పౌరసేవలను, సంక్షేమ పథకాలను తెలంగాణ సమాజం ముందుంచారు. దీంతో ప్రభుత్వ ఫలాల పంపిణీ సులభమవుతున్నది. కేసీఆర్ విధానాలు కరోనా మహమ్మారిని మట్టుబెట్టి ప్రజలకు రక్షణకవచంగా పనిచేస్తున్నాయి. అందుకే ఇంతటి విపత్కర పరిస్థితుల్లో నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడలేదు. అందుకే ఆర్థికంగా నష్టపోయినా పరవాలేదు, ప్రజల ప్రాణాలే ముఖ్యమని లాక్‌డౌన్‌ను ఇంకా పొడిగించాలని ప్రధాని మోదీకి కేసీఆర్ సూచించారు. కరోనాను నిర్మూలించడానికి చిన్న పాముకైనా పెద్ద కర్రతోనే కొట్టాలనే వాస్తవాలను మన కండ్లముం దుంచడం సీఎం కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనం.

**(వ్యాసకర్త: డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషియాలజీ, కేయూ)**

## ఏక్ నిరంజన్

**చీరల కొంగుల్లో,** పంచెల అంచుల్లో
బర్మన్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌తో
బర్‌బర్ మని చీదేసుకున్నాం

చల్లగాలినాస్వాదిస్తూ మోరపైకెత్తి
సూరీడు ముఖం మీదే తుమ్మేసాం

పొదలు, చెరువులు, దొరువుల సాక్షిగా
కాలకృత్యాలన్నీ ఆనందో బ్రహ్మంటూ
బహిర్భూముల్లోనే తీర్చేసుకున్నాం

జర్దాపాన్లు కసికసిగా నమిలి
మహానగర వీధుల్లో, గోడల మీద
మేడల మెట్లమీద, కాలిబాటల గట్లమీద
ఎం.ఎఫ్.హుస్సేన్ చిత్రాలుగా ఉమ్మేసాం

ఇండిపెండెంట్ ఇళ్లని,
ఉమ్మడి కుటుంబాల్ని
నిలువునా పాతిపెట్టిన పాదుల్లో
అపార్ట్‌మెంట్ వృక్షాల్ని ఏపుగా పెంచేసాం
ముసలెద్దుల్ని, ఆవుల్ని తరిమేసి
చిటారు కొమ్మల్లో
చిన్న కాపురాలు పెట్టేసాం

టూ బీహెచ్‌కేలు, త్రీ బీహెచ్‌కేలు కాదు
ఇకనుంచీ వెంచర్స్ అన్నీ
ఐసొలేషన్ అపార్ట్‌మెంట్లే
లోపలి గదులన్నీ మైల వార్డులే

అన్ని బంధాలూ
అలఖ్ నిరంజన్‌లో కలిసే చోట
ఇన్నాళ్ళనుంచీ
ప్రపంచమే నువ్వు
ఇప్పుడు
నీకు నువ్వే ఓ ప్రపంచం
ఏక్ నిరంజన్!!!

– 'చినవ్యాసుడు', మాఊరు
chinavyasudu@gmail.com

## అమావాస్యలో వెన్నెల

**అమావాస్యలో** వెన్నెల
కురవడమే అందం
అపజయాలనోడించి
గెలవడమే అందం

నిశ్శబ్దంగా నీవు
ఎదిగి ఎదిగిపోతుంటే
అడ్డుపడిన పల్లేర్లను
చిదమడమే అందం

హృదయంలో బడబాగ్నులు
ఎన్ని రగులుతున్నా
వదనంలో చిరునవ్వులు
చిందడమే అందం

ఆకాశం పిడుగులతో
గడగడలాడించినా
అలమటించు నేలమ్మను
తడపడమే అందం

అలజడితో సంద్రమెంత
ఘోషలు పెడుతున్నా
అలలు కిందపడినా
పైకెగరడమే అందం

ఆవేదనలో కలాన్ని
ముంచి నీవు 'తిరునగరీ'
ఆనందం కవితలలో
పంచడమే అందం.



తిరునగరి శ్రీనివాసస్వామి,
94403 69939

# స్వధర్మమే సర్వోన్నతం!



నమస్తే.. నమస్తే.. నమః

గన్నమరాజు గిరిజామనోహరబాబు

**'ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః।/ మామకాః పాండవాశ్చైవ కిమకుర్వతి సంజయ॥'.** సంస్కృత మహాభారతంలో భీష్మపర్వంలో చోటు చేసుకొన్న శ్రీమద్భగవద్గీతలోని తొట్టతొలి శ్లోకంలోని తొలిపదమే 'ధర్మం'. దాని విస్తృతి ఈ గ్రంథమంతా మనకు కనిపిస్తుంది. ధృతరాష్ట్ర మహారాజు తన ఆత్మీయుడు, మహానుభావుడు అయిన సంజయునితో 'సంజయా! ధర్మభూమియైన కురుక్షేత్రంలో యుద్ధం చేయవలెనన్న ఆకాంక్షతో అక్కడికి చేరిన నా వారలు, పాండురాజు కుమారులు ఏం చేశారు' అన్న మాటల సారాంశంగా భగవద్గీత ప్రారంభమైంది.

సాక్షాత్తూ ఆ శ్రీమన్నారాయణావతారమైన శ్రీకృష్ణ భగవానుడు, స్వధర్మ నిర్వహణ నుంచి దూరమైన అర్జునునిలోని కర్తవ్య పరాఙ్ముఖత్వాన్ని పోగొట్టి, నిస్పృహను తొలిగించే నిమిత్తం బోధించిన భగవద్గీతలోని, మొట్టమొదటి శ్లోకంలోని, మొదటి పదమైన 'ధర్మ'మనే విషయం. ఇందులోని 18 అధ్యాయాల్లో, అన్ని సందర్భాల్లో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రస్తావితమైంది. ఈ మొదటి శ్లోకాన్నే పండితులు విశ్లేషిస్తూ దీనికి సామాన్యార్థమేగాక, ఒక విశేషార్థాన్ని సైతం చెప్పారు. ఇందులోని శబ్దాలతోనే ఆ సందేశమేమిటో చెప్పారు. 'క్షేత్రే క్షేత్రే', 'ధర్మ కురు' అన్న ధ్వని ఇందులో ఉందన్నారు. మనిషి తాను పనిచేసే ప్రతీ క్షేత్రంలోనూ ధర్మమే చెయ్యాలని ఆ శ్రీకృష్ణ పరమాత్ముని బోధగా గుర్తించారు. ఇదే లోకానికి శ్రేయోదాయకమైన కార్యంగా కూడా తెలిపారు. అంటే, గీత ప్రారంభమే ధర్మప్రసక్తితో ఉందన్నమాట!

సర్వమానవాళి చేసే అన్ని పనులూ ధర్మబద్ధంగానే చెయ్యాలని సనాతన ధర్మం చెబుతున్నది. అందుకే, మన పూర్వులు చతుర్విధ పురుషార్థాలలో ధర్మానికి పెద్దపీట వేశారు. అర్థ కామాలు రెండూ ధర్మబద్ధమైన రీతిలోనే సాధించుకోవాలన్న మార్గదర్శనం ఇందులో ఉంది. అప్పుడే ఆ వ్యక్తి మోక్షార్హుడవుతాడన్నది ఆంతర్యం. అందుకే, శ్రీకృష్ణ భగవానుడు అర్జునునితో 'ధర్మా విరుద్ధో భూతేషు కామో స్మి భరతర్ష భ' అన్నాడు. సకల ప్రాణులలో తాను ధర్మ వ్యతిరేకం కాని కామమన్న విషయాన్ని చెప్పడం ధర్మ విశిష్టతను వ్యక్తీకరిస్తున్నది. అంతేకాదు, ధర్మానికి ఆపద ఏర్పడినప్పుడు నేను విధిగా అవతరిస్తానని చెప్పడం ధర్మం అవసరాన్ని తెలుపుతున్నది.

యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత।/ అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్॥– అంటూ ధర్మానికి ప్రమాదం జరిగిన సందర్భంలో తనను తానే సృజించుకొంటానంటూనే ధర్మవినాశన కాలంలో సాధుజనులకు విపరీతమైన కష్టకాలం ఎదురవుతుంది. అందుకే, 'ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే' అని



కూడా ప్రవచించి, సాధుజనులకు, సత్పురుషులకు సాక్షాత్తు ఆ భగవంతుడు అభయమిచ్చాడు. అయితే, మానవుడు అన్నీ ఆ భగవంతుడే చూసుకొంటాడని నిష్క్రియుడు కారాదంటూ కర్మ చేయడాన్నికూడా అర్జునునికి చెప్పినట్లుగా లోకానికి బోధించాడు. పైగా ప్రతివ్యక్తి కూడా తన స్వధర్మాన్ని తాను అనుష్ఠించాలని ఘంటాపథంగా చెప్పాడు. ఆ స్వధర్మాన్ని చెప్పిన సందర్భంలోనే మరోమాట కూడా స్వామి సెలవిచ్చాడు, 'స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః' అని స్వధర్మం ఔన్నత్యాన్ని సూచించాడు.

ఏ వ్యక్తి అయినా తన ధర్మప్రవర్తన తన స్వధర్మ నిర్వహణకు కారణం కావాలి. అయితే, స్వధర్మ నిర్వహణ సందర్భంలో ప్రాణం పోయినా ఫరవా లేదన్నాడు. అంతేకానీ, ఇది ఎంత కష్టమైనదైనా సరే పరధర్మం వైపు మాత్రం మొగ్గుచూపరాదన్న సత్యాన్ని స్పష్టంగా చెప్పాడు. పైగా, పరధర్మాచరణ భయావహమైందని కూడా బోధించాడు. దీనికి పలువురు మహనీయులు, భాష్యకారులు స్వధర్మ వివేచనను విస్తృతంగా చేసి తమ జ్ఞాన కిరణాలను మనకు పంచారు. సామాన్యంగా అర్థం చేసుకొన్నా మనిషి 'మానవధర్మాన్ని' మరిచి పరధర్మమైన పశుధర్మాన్ని, క్రూరమైన రాక్షస ధర్మాన్ని పాటించరాదని అర్థమవుతున్నది. మానవ ధర్మమైన మానవత్వాన్ని వదలి హింసాయుతమైన రాక్షసధర్మం కారణంగా లోకం ప్రమాదానికి గురవుతుంది. అందుకే, ప్రతి వ్యక్తికీ స్వధర్మ నిష్ఠ సర్వ శ్రేష్ఠమైన ధర్మమనే విశిష్ట విషయాన్ని భగవద్గీత బోధిస్తున్నది.

యాభై ఏండ్ల కింది జ్ఞాపకం
మా అమ్మ మ్యానత్త సిద్దవ్వ చాదస్తాలు
ఇప్పుడు లోకమంతా ఆచరణీయ అవసరాలు
తన గిలాస, తన పల్లెం, తన గొల్లెం
పక్కబట్టలు.. లెక్క పక్క శుద్ధి జీవితం - అన్నవరం దేవేందర్

## లాక్‌డౌన్-డే 19

| లాక్‌డౌన్ సమస్యలపై టోల్‌ఫ్రీ నంబర్లు | పౌరసరఫరాలశాఖ ఉ.10 నుంచి సా.5 వరకు | హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ | సైబరాబాద్ కమిషనరేట్ | రాచకొండ కమిషనరేట్ | కొవిడ్-19 కాల్‌సెంటర్ |
|---|---|---|---|---|---|
| | 1967 | 100 24/7 | 9490617440 | 9490617234 | 040-23434343 |

### మసీదులకు తాళాలు

**హన్వాడ:** కరోనా కట్టడిలో భాగంగా ప్రార్థన మందిరాలకు వెళ్లొద్దని ప్రభుత్వం సూచించింది. అయితే శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం వేపూరులోని మసీదులో ముస్లింలు ప్రార్థనలు చేస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న అధికారులు, ప్రజాప్రతినిధులు అక్కడకు వెళ్లి వారిని బయటకు తీసుకొచ్చి తాళం వేశారు. అలాగే కొత్తపేటలోనూ ప్రార్థనలకు హాజరైన వారిని పంపించివేసి తాళం వేశారు. ప్రభుత్వ సూచనలను పట్టించు కోకుండా ప్రార్థనలకు హాజరుకావడంతో వారిపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

### పోలీస్ అధికారి రిపోర్టు తారుమారు

- మరో వ్యక్తి నివేదిక ఆధారంగా డిశ్చార్జి

**కొత్తగూడెంక్రైం:** హైదరాబాద్‌లో కరోనా పాజిటివ్‌తో చికిత్సపొందుతున్న కొత్తగూడెంలో పనిచేసే పోలీస్ అధికారి రిపోర్టు తారుమారైంది. నెగెటివ్ రిపోర్టు వచ్చిందని తెలియడంతో గురువారం ఆయన డిశ్చార్జి అయ్యారు. వాస్తవంగా అతనికి పాజిటివ్ ఉన్నదని తెలుసుకున్న అధికారులు శుక్రవారం తిరిగి హైదరాబాద్‌కు రావాలని సూచించారు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న సదరు పోలీస్ అధికారికి నెగెటివ్ వచ్చిందన్న ఉద్దేశంతో వైద్యులు గురువారం డిశ్చార్జ్ చేయడంతో కొత్తగూడెంలోని తన నివాసానికి చేరుకొని హోం క్వారైంటైన్‌లో ఉన్నారు. శుక్రవారం కొత్తగూడెంలో పరీక్ష చేయించగా పాజిటివ్ వచ్చింది. హైదరాబాద్‌లో ఒకే పేరుతో ఇద్దరు ఉండటం వల్ల పరీక్షల రిపోర్టులు తారుమారైనట్టు తెలిసింది. దీంతో తిరిగి వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఐసోలేషన్‌కు తరలించాలని శుక్రవారం ఆదేశాలు జారీఅయ్యాయి. ప్రస్తుతం ఆయన్ను చికిత్స నిమిత్తం కొత్తగూడెం నుంచి హైదరాబాద్‌కు తరలించారు.

# ఆన్‌లైన్‌లో కూరగాయలు

## మన్నూర్ రైతుల వినూత్న విధానం

- వాట్సాప్ లొకేషన్‌తో ఇంటికే సరఫరా
- లాక్‌డౌన్‌తో నష్టపోకుండా ఆలోచన
- పే యాప్‌లలో నగదు చెల్లింపులకూ అవకాశం

**ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి:** లాక్‌డౌన్ కారణంగా తాము పండించిన కూరగాయల విక్రయాలు నిలిచిపోకుండా ఆదిలాబాద్ జిల్లా రైతులు వినూత్న ఆలోచనచేశారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఇండ్లకే నేరుగా తాజా కూరగాయలు అందజేయాలని నిర్ణయించుకున్నారు. మొన్నటివరకు దళారులకు తక్కువ ధరకు తమ పంటలను అమ్మిన రైతులు.. సరికొత్త విధానం ద్వారా గిట్టుబాటు ధర లభించడంతోపాటు వినియోగదారులకూ తాజా కూరగాయలను అందిస్తున్నారు. ఫలితంగా ప్రజలకు లాక్‌డౌన్ సమయంలో బయటకు వెళ్లే అవసరమూ లేకుండాపోయింది. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం మన్నూర్ గ్రామానికి చెందిన దాదాపు 300మంది రైతులు ఏండ్లుగా వివిధ రకాల కూరగాయలు సాగుచేస్తున్నారు. 22 రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల తోటలతో ఉపాధి పొందుతున్నారు. ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, హైదరాబాద్‌తోపాటు మహారాష్ట్రలోని నాగాపూర్, హింగన్‌నాట్, చంద్రాపూర్ తదితర ప్రాంతాలకు చెందినవారు మన్నూర్‌కే వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్లేవారు. లాక్‌డౌన్‌తో గత 20 రోజులుగా కూరగాయల అమ్మకాలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముకుందామంటే రవాణాసౌకర్యం లేక చాలామంది పంటను కోయకుండానే వదిలేశారు. పరిస్థితి ఇలానే ఉంటే రూ.లక్షల్లో నష్టపోయే ప్రమాదం ఉన్నదని గుర్తించిన కొందరు చదువుకున్నవారు సరికొత్త ఆలోచన చేశారు. తోటి రైతులతో చర్చించి రోజూ ఎంతమేర కూరగాయల దిగుబడి వస్తుందనేది అంచనావేసి పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అమ్మాలని నిర్ణయించారు.



మన్నూర్‌లో కూరగాయలను తూకం వేసి సంచుల్లో ప్యాక్ చేస్తున్న రైతులు

**ఆన్‌లైన్ విక్రయం.. వాట్సాప్ షేరింగ్**

ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే ఇంటికే తాజా కూరగాయలను పంపిస్తామంటూ గ్రామస్థులు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంచేశారు. కూరగాయలు కావాల్సిన వారు చిరునామాను వాట్సాప్‌లో షేర్‌చేస్తే వారి ఇంటికే పంపిణీ చేస్తున్నారు. కూరగాయల కిట్‌తోపాటు, ధరను కూడా ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. ఒకరోజు ముందు ఆర్డర్ తీసుకొంటారు. మర్నాడు ఉదయం 9నుంచి 11.30 సమయంలో పంపిణీ చేస్తున్నారు. ప్రజల వద్ద నగదు కొరత ఉంటే గూగుల్‌పే, పేటీఎం ద్వారా డబ్బులు చెల్లించే అవకాశాన్ని కూడా కల్పించారు. నాలుగు రోజుల నుంచి తాజా కూరగాయలు సరఫరా చేస్తున్నామని, గురువారం 350 మందికి పంపిణీ చేసినట్టు రైతు కే సురేశ్ తెలిపారు. శుక్రవారం వరకు 1000 ఆర్డర్లు వచ్చాయని పేర్కొన్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో తాజా కూరగాయలు లభిస్తుండటంతో ప్రజలు కూడా హర్షం వ్యక్తంచేస్తున్నారు.



MANA VOORU

Mannur Farmers Association

FARM FRESH VEGETABLES DIRECTLY FROM MANNUR VILLAGE FARMERS ASSOCIATION TO YOUR KITCHEN.

| ITEMS | QUANTITY |
|---|---|
| TOMATO | 1Kg |
| BEERA KAYA | 500 gr |
| BRINIAL | 500 gr |
| CUCUMBER | 500 gr |
| MIRCHI | 250 gr |
| KOTHMIRA | 2 Kattas |
| CURRY LEAVES | 2 Kattas |

కూరగాయల కిట్ వివరాలు

## 'భువన్'తో కూరగాయల సరఫరా

- టెక్నాలజీతో మొబైల్ రైతుబజార్ల నిర్వహణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్ సమయంలో రైతులకు, ప్రజలకు మేలుచేసేలా వ్యవసాయశాఖ.. జియోపోర్టల్ భువన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నది. గిట్టుబాటు ధరకు తమ ఉత్పత్తులను అమ్ముకొనే వెసులుబాటు రైతులకు కల్పిస్తూనే.. తాజా కూరగాయలు, పండ్లను వినియోగదారుల చెంతకే చేరవేస్తున్నది. మార్కెటింగ్, ఉద్యానశాఖల సమన్వయంతో నగరంలో అన్ని ప్రాంతాలకు కూరగాయలు చేరవేయడానికి 302 మొబైల్ రైతు బజార్లను నిర్వహిస్తున్నది. లాక్‌డౌన్‌తో ఒక్కసారిగా రవాణా వ్యవస్థ స్తంభించింది. కూరగాయల కోసం మార్కెట్లకు ఒక్కసారిగా జనం ఎగబడితే పరిస్థితి అదుపు తప్పుతుందన్న ఆలోచనతో వ్యవసాయ శాఖ కార్యదర్శి డాక్టర్ బీ జనార్దన్‌రెడ్డి టెక్నాలజీ మార్గం ఎంచుకున్నారు. ఇస్రో ఆధ్వర్యంలో నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ అభివృద్ధి చేసిన జియోపోర్టల్ భువన్ ఆధారంగా హైదరాబాద్‌లోని 20 లక్షల గృహాలకు నిత్యావసరాలను సరఫరా చేస్తున్నారు. వాహన డ్రైవర్లను, రైతుల వివరాలను మొబైల్‌లింక్ ద్వారా అనుసంధానించారు. తద్వారా ఏ వాహనం ఏ ప్రాంతానికి, ఏ గేటెడ్ కమ్యూనిటీ దగ్గరకు ఎప్పుడు వెళ్లాలనే దానిని ముందుగానే చూపిస్తుంది. వినియోగదారులు వారున్న ప్రాంతాన్ని షేర్‌చేసుకొనే వెసులుబాటు కల్పించారు. ఇలా నిత్యం 500 టన్నుల నుంచి 600 టన్నుల కూరగాయల విక్రయాలు మొబైల్ రైతుబజార్ల ద్వారా జరుపుతున్నారు.

### స్థానికంగానే పండ్ల విక్రయాలు

రైతులకు మండలి చైర్మన్ గుత్తా సూచన



**చిట్యాల:** లాక్‌డౌన్ నేపథ్యంలో ఇతర రాష్ట్రాలకు రవాణా సౌకర్యం లేనందున బత్తాయి, నిమ్మ రైతులు తాము పండించిన పంటను సమీపంలోని పట్టణాలు, పెద్ద గ్రామాలకు ట్రాక్టర్లు, డీసీఎంలు, ఇతర వాహనాల ద్వారా తీసుకెళ్లి సొంతంగా విక్రయించుకోవాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన నల్లగొండ జిల్లా చిట్యాలలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ ప్రాంతంలో పండించిన బత్తాయి ఎక్కువగా ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్ తదితర ప్రాంతాలకు వెళ్తుందని, లాక్‌డౌన్ కారణంగా రవాణా సౌకర్యం నిలిచిపోయిందన్నారు. ఈ విషయమై ఇప్పటికే సీఎం కేసీఆర్ కేంద్ర వ్యవసాయశాఖ మంత్రితో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరినట్టు గుత్తా తెలిపారు.



వనపర్తి జిల్లా శ్రీరంగాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎంపీ రాములు

### పంటలకు బీమా అవసరం

వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** యాసంగిలో రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్, సాగునీరు, పెట్టుబడి సాయం వంటివి అందిస్తుండటంతో రైతులు ఇష్టంగా పంటలు సాగుచేస్తున్నారని తెలిపారు. ప్రతి రైతు తమ పంటలకు కచ్చితంగా బీమా చేయించుకోవాలని కోరారు. దురదృష్టవశాత్తు వడగండ్ల వానతో దాదాపు 25 వేల ఎకరాల్లో పంటనష్టం జరిగిందని.. నష్టపోయిన ప్రతిఒక్కరిని ఆదుకుంటామన్నారు. యాసంగిలో వరి సాగుచేసే రైతులు మార్చినెల వరకే పంట కోతకు వచ్చేలా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు.

### కరోనా నివారణే ధ్యేయం

ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కరోనా నివారణే ధ్యేయంగా ప్రభు త్వం ముందుకెళ్తున్నదని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. విదేశాలతోపాటు ముంబయి, పూణే, ఢిల్లీ నుంచి జిల్లాకు వచ్చినవారికి మాత్ర మే కరోనా పాజిటీవ్ వచ్చిందన్నారు. కరోనా పాజిటివ్ వచ్చిన వ్యక్తులు ఉన్న ప్రాంతాలను రెడ్‌జోన్‌లుగా ప్రకటించామని తెలిపారు. జిల్లాకేంద్రంలో పలు ప్రాంతాలను హాట్‌స్పాట్లుగా గుర్తించామని, అక్కడివారికి నిత్యావసర సరుకులను ఇంటికే పంపించే ఏర్పాట్లు చేశామని మంత్రి వివరించారు.



ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం మంచుకొండలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ

### స్వీయ నిర్బంధంతోనే వైరస్ కట్టడి

రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

**ఖమ్మం, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్‌ను అరికట్టడానికి స్వీయ నియంత్రణే ఏకైక మార్గమని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని ఖిల్లా ప్రాంతంలో లాక్‌డౌన్ పరిస్థితిని పర్యవేక్షించారు. ఖిల్లా నివాసికి పాజిటివ్ నమోదుకావడంతో రెండురోజుల నుంచి ఖిల్లాప్రాంతంలో ఆంక్షలు విధించారు. అక్కడి ప్రజలకు అవసరమైన నిత్యావసర వస్తువులు రోజూ అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఖిల్లాలోని పలు ఇండ్లకు వెళ్లి కూరగాయలు, నిత్యావసర వస్తువులను మంత్రి అందజేశారు. ఖిల్లా ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన పర్సనల్ శానిటైజర్ ఎన్‌క్లోజర్‌ను ప్రారంభించారు.

### అండగా ఉంటాం.. అధైర్య పడొద్దు

సంజీవ్ కుటుంబసభ్యులకు మంత్రి కొప్పుల భరోసా

**గోదావరిఖని, నమస్తే తెలంగాణ:** అండగా ఉంటాం అధైర్యపడొద్దని గనిలో అదృశ్యమైన కార్మికుడు సంజీవ్ కుటుంబసభ్యులకు ఎస్సీసంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ భరోసానిచ్చారు. శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో కలిసి జీడీకే-11ఏ గనిని మంత్రి సందర్శించారు. అనంతరం సింగరేణి సంస్థ డైరెక్టర్(పా) చంద్రశేఖర్‌తో మాట్లాడి సంజయ్ ఆచూకీ కోసం చేపట్టిన గాలింపు చర్యలపై ఆరాతీశారు. అనంతరం సంజీవ్ కుటుంబసభ్యులతో మంత్రి మాట్లాడి ఓదార్చారు.

### రౌడీషీటర్ లవణ్‌పై పీడీయాక్ట్

**కరీంనగర్‌క్రైం:** కరీంనగర్ జిల్లాకేంద్రంలోని రాంనగర్‌లో అర్ధరాత్రి రోడ్డుపై బర్త్‌డే వేడుకల పేరిట మారణాయుధాలతో హంగామా చేసిన రౌడీ షీటర్ లవణ్‌పై కరీంనగర్ పోలీసులు పీడీ యాక్ట్ అమలు చేశారు. ఈ ఘటనలో అప్పుడే కేసు నమోదు చేసి, అనుచరులను అరెస్ట్ చేశారు. లవణ్ సిరిసిల్ల కోర్టులో లొంగిపోగా అప్పటి నుంచి జిల్లా జైలులో ఉంటున్నాడు. లవణ్ అరెస్ట్ అనంతరం మాదక ద్రవ్యాల రవాణా, బెదిరింపులు, మారణాయుధాలతో సంచారం తదితర చట్టాల కింద వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నాడని రుజువు కావడంతో అతడిపై పీడీయాక్ట్ ప్రయోగించారు. ఈ మేరకు జిల్లా జైలులో ఉన్న లవణ్‌కు ఉత్తర్వులు అందించి వరంగల్ సెంట్రల్ జైలుకు తరలించారు.

### ముందస్తు చర్యలతో కరోనా అదుపు

ఎంపీ నామా నాగేశ్వరరావు



**కూసుమంచి:** సీఎం కేసీఆర్ తీసుకున్న ముందస్తు చర్యలతోనే రాష్ట్రంలో కరోనా కట్టడి అవుతున్నదని టీఆర్‌ఎస్ పార్లమెంటరీ నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కూసుమంచి, వైరాలో స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి మీడియాతో మాట్లాడారు. కరోనా వ్యాప్తి నివారణకు ప్రభుత్వం చేపట్టిన చర్యలను దేశం అభినందిస్తున్నదని తెలిపారు. ప్రధాని మోడీ సైతం సీఎం కేసీఆర్ చర్యలపట్ల సంతృప్తిని వ్యక్తం చేశారని చెప్పారు. లాక్‌డౌన్ నేపథ్యంలో రైతులు దళారులను ఆశ్రించకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు.

### గీత దాటాడు.. జరిమానా కట్టాడు



ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామాల్లో లాక్‌డౌన్‌ను కఠినంగా అమలు చేస్తున్నారు. పొలిమేరల్లో కంచెలు వేసి గ్రామంలోకి ఎవరూ రాకుండా, బయటకు వెళ్లకుండా సర్పంచులు కాపలాకాస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటున్నారు. ఇచ్చోడ మండలం ముక్రా(కే)లో తులసీరాం అనే వ్యక్తి ఐదుసార్లు బైక్‌పై ఊరు దాటి వెళ్లిరావడంతో శుక్రవారం సర్పంచ్ మీనాక్షి అతడికి రూ.వెయ్యి జరిమానా విధించారు. – ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి

# నువ్వుల పంటకు తెగుళ్ల బెడద

- ఆశిస్తున్న బూడిద,పేనుబంక..
- వేధిస్తున్న కాయతొలుచు పురుగు
- నివారణకు పొలాస ప్రాంతీయ పరిశోధన స్థానం సూచనలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

యాసంగిలో నువ్వుల పంటలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం జగిత్యాల జిల్లా పొలాస శాస్త్రవేత్తలు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా నువ్వుల పంట పూతదశ నుంచి కాయలు ఏర్పడే దశలో ఉన్నదని, ఇప్పుడు పంట బెట్టకు (తాలు) గురికాకుండా నేలలో తేమను ఉంచుకోవాలని పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకులు ఉమారెడ్డి తెలిపారు. ప్రధానంగా బూడిద తెగులు, రసంపీల్చే పురుగు(పేనుబంక), కాయతొలుచు పురుగు ఆశించే అవకాశాలున్నట్టు చెప్పారు.



**కాయతొలుచు పురుగు (గొంగళి పురుగులు)**

చిన్న గొంగళి పురుగులు మొగ్గ ఏర్పడే దశలో పూమొగ్గలను, పూతను, కాయల్లోని లేత గింజలను తింటూ పంటకు నష్టం కలుగజేస్తాయి. దీని నివారణకు 2.5 మి.లీ ఈ క్లోరోపైరిపాస్ లేదా 1.5 గ్రాముల ఎసిఫేట్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**బూడిద తెగులు**

ప్రస్తుతం నువ్వుల పంటకు బూడిద తెగులు ఎక్కువగా ఆశిస్తున్నట్టు కనిపిస్తున్నది. బూడిద తెగులు తొలిదశలో ముదురు ఆకుల మీద బూడిదరంగులాంటి పదార్థం ఏర్పడి, తర్వాత లేత ఆకులకు వ్యాపిస్తుంది. ఆకుల్లో కిరణజన్య సంయోగక్రియకు ఆటంకం ఏర్పడి ఆకులు పిండిబారి రాలిపోతాయి. దీని నివారణకు మైక్రోబ్యూటానిల్ ఒక గ్రాము లేదా నీటిలో కరిగే గంధకం మూడు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**రసం పీల్చే పురుగులు (పేనుబంక)**

ఈ పురుగు అధిక ఉష్ణోగ్రత(28-35 డిగ్రీలు) ఉన్నప్పుడు ఎక్కువగా ఆశిస్తుంది. దీని ఉద్ధృతి ఈ సమయంలో ఎక్కువగా ఉంటుంది. ఈ పురుగులు ఎక్కువగా ఆకుల అడుగుభాగాన చేరి రసాన్ని పీల్చడం వల్ల ఆకులు పాలిపోయి, ఎండిపోతాయి. పేనుబంక ఆకుల అడుగు భాగాన గుంపులుగా చేరి రసాన్నిపీల్చి తేనే వంటి జిగురు పదార్థం స్రవించడం వల్ల దానిమీద నల్లటి బూజు ఏర్పడుతుంది. దీని నివారణకు ఎసిఫేట్ 15 గ్రాములు ఒక లీటరు నీటికి లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.1 మి.లీ. ఒక లీటరు నీటికి ఏదైనా ఒక మందును కలిపి పిచికారీ చేయాలి.

### ఇంటికే సరుకులు



లాక్‌డౌన్ నేపథ్యంలో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడొద్దని ఇంటివద్దకే నిత్యావసర సరుకులను పంపిణీ చేసేలా రూపొందించిన 'మీకోసం' యాప్‌ను విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి శుక్రవారం నల్లగొండలో ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ పాల్గొన్నారు. – నీలగిరి

## లలితమ్మకు ఎంత కష్టమొచ్చే..

- భర్త మృతితో అద్దె ఇంట్లోకి రానివ్వని యజమాని
- పోలీసుల కౌన్సెలింగ్‌తో తిరిగి ఇంటికి

**గంభీరావుపేట:** ఇంటి పెద్దను కోల్పోయిన ఆ కుటుంబం పుట్టెడు దుఃఖంలో మునిగింది. అంత్యక్రియలు నిర్వహించి అద్దింటికి వచ్చిన వారిని యజమాని అడ్డుకోవడంతో ఆ కుటుంబం తీవ్ర మానసిక క్షోభకు గురైంది. రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేటకు చెందిన ముత్తయ్యగారి శ్రీనివాస్ భార్య లలిత దంపతులు. వీరికి ముగ్గురు కూతుర్లు. స్థానికంగా ఓ అద్దె ఇంటిలో నివసిస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీనివాస్ శుక్రవారం మృతిచెందాడు. అంత్యక్రియలు పూర్తిచేసి ఇంటికి చేరుకున్న వారిని అద్దింటి యజమాని లోపలికి రానివ్వలేదు. దిక్కుతోచని స్థితిలో ఉన్న వీరికి సర్పంచ్ శ్రీధర్ గ్రామ పంచాయతీ పాత భవనంలో ఆవాసం కల్పించారు. గ్రామ పంచాయతీలో బాధిత కుటుంబం తలదాచుకున్న సమాచారం తెలుసుకున్న గంభీరావుపేట ఎస్సై నీలం రవి వారి వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. ఇంటి యజమానికి అవగాహన కల్పించి ఆ కుటుంబాన్ని తిరిగి అద్దె ఇంట్లోకి పంపించారు. ఇంటిపెద్ద మృతితో ఇబ్బందులు పడుతున్నామనీ, తమను ఆదుకోవాలని బాధిత కుటుంబం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.



పంచాయతీ భవనంలో నిరీక్షిస్తున్న లలిత కుటుంబం

### వలస కూలీలకు నిత్యాన్నదానం

ఎంపీ సంతోష్‌కుమార్ చొరవతో నిర్వహణ

**బోయినపల్లి:** ఎంపీ సంతోష్‌కుమార్ స్వగ్రామమైన రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కొదురుపాకలో నిత్యాన్నదాన కార్యక్రమం కొనసాగుతున్నది. లాక్‌డౌన్ నేపథ్యంలో ఎంపీ సంతోష్ కుమార్ చొరవతో టీఆర్‌ఎస్ నాయకులు వలస కూలీలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రోజూ దాదాపు 200 మంది వలస కూలీలకు భోజనం వడ్డిస్తున్నారు. మూడో రోజైన శుక్రవారం కూడా నిర్వహించారు.



కొదురుపాకలో అన్నం వడ్డిస్తున్న టీఆర్‌ఎస్ నాయకులు



మందమర్రిలో అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్

### స్వీయ నియంత్రణే రక్ష: బాల్క సుమన్

**మందమర్రి:** కరోనా నుంచి రక్షణకు స్వీయ నియంత్రణే శ్రీరామరక్ష అని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్, రామకృష్ణాపూర్‌తో పాటు మందమర్రిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్, రెవెన్యూ, సింగరేణి, పోలీస్ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. కరోనా వ్యాప్తి నివారణకు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాల్క మాట్లాడుతూ ప్రజలు కాలక్షేపానికి ఇంటి నుంచి బయటకు రావద్దని కోరారు. దేశ ప్రధాని, ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనలను పాటించాలని పిలుపునిచ్చారు.

# మరో రెండ్రోజులు వానలు

- పగటి ఎండ పెరిగే అవకాశం

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** రాష్ట్రంలో రాగల రెండ్రోజుల వరకు అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. కర్ణాటక తీర ప్రాంతానికి దగ్గరలో ఉన్న తూర్పు మధ్య అరేబియా సముద్ర ప్రాంతం నుంచి పశ్చిమ విదర్భ ప్రాంతం వరకు ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక, మధ్య మహారాష్ట్ర, మరాఠ్వాడ మీదుగా సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ద్రోణి కొనసాగుతున్నది. దక్షిణ ఒడిశా దాని పరిసర ప్రాం తాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంగా రాష్ట్రంలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వానలు కురిశాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మెదక్, సంగారెడ్డి, ఖమ్మం, జనగామ, యాదాద్రి-భువనగిరి, మహబూబ్‌నగర్, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిశాయి. శని,ఆదివారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశమున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. కాగా ఇదే సమయంలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశమున్నదని వెల్లడించారు.

**ఆర్డీఎస్ ఆనకట్టకు నీరు..**

**అయిజ :** కర్ణాటకలోని ఎగువ ప్రాంతంలో కురిసిన అకాల వర్షంతో ఆర్డీఎస్ ఆనకట్టకు వరద నీరు రాక మొదలైంది. గురువారం సాయంత్రం ఆర్డీఎస్ ఎగువ ప్రాంతాల్లో వర్షం కురవడంతో తుంగభద్ర నదికి వరద నీరు వచ్చి చేరింది. ఈ నీరు ఆర్డీఎస్ ఆనకట్టకు వస్తున్నట్టు ఆర్డీఎస్ ఏఈఈ ఆంజనేయులు శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం ఆనకట్టలో నీటిమట్టం మూడు అడుగులకు చేరిందని, శనివారం నాటికి నాలుగు అడుగులకు చేరే అవకాశం ఉన్నదన్నారు. ఆర్డీఎస్ ఆనకట్ట నుంచి ప్రధాన కాల్వకు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

epaper.ntnews.com

నమస్తే తెలంగాణ
కరీంనగర్
శనివారం 11 ఏప్రిల్ 2020
www.ntnews.com

# జిందగీ



వ్యక్తిత్వ వికాస పుస్తకాలు మన బుర్రల్ని ఖరాబు చేశాయి. గెలుపు అనే మాటకు ఎక్కడలేని ప్రాధాన్యం ఇచ్చాయి. సక్సెస్ మీద మనిషికి లేనిపోని భ్రమలు సృష్టించాయి. గెలిచినవాడే మొనగాడని ఊదరగొట్టాయి.

గెలుపంటే కిరీటం కాదు, గెలుపంటే బ్యాంక్ బ్యాలెన్స్ కాదు, గెలుపంటే మాల్‌కో మల్టీప్లెక్స్‌కో వెళ్లినప్పుడు నలుగురూ మనతో సెల్ఫీలు తీసుకోవడానికి పోటీపడటం కూడా కాదు. అందులోనూ, మాయదారి కరోనా మనల్ని తరుముకొస్తున్న ప్రత్యేక పరిస్థితుల్లో ... బతకడమే ఓ గెలుపు!

వ్యక్తులకే కాదు వ్యవస్థలకూ ఈ సూత్రం వర్తిస్తుంది. లాభాలు రాకా, నష్టాలు భరించలేకా... అటు నడుపుకోలేకా, ఇటు మూసుకోలేకా... కరోనా తొలిదశలో ఉక్కిరిబిక్కిరైపోయిన చాలా కంపెనీలు అంతేవేగంగా ఆ షాక్ నుంచి తేరుకున్నాయి. బిజినెస్ ప్లాన్‌లూ, దీర్ఘకాలిక వ్యూహాలూ... అన్నీ పక్కనపెట్టి ఏకవాక్య నినాదంతో రంగంలోకి దూకాయి. అదే...

# బతకడమే... ఓ గెలుపు!

**జీతంలో కోతలు పడ్డాయి. పడితే పడనీ!**
**ఈ ఏడాది ఇంక్రిమెంట్ ఉండకపోవచ్చు. లేకపోతే పీడా పోయింది!**
**స్టాక్ మార్కెట్ పడిపోయింది. కొంపలేం మునిగిపోవు!**
**పిల్లగానికి క్యాంపస్ ప్లేస్‌మెంట్ రాకపోవచ్చు. వచ్చే ఏడాది తెచ్చుకుంటాడ్లే!**

....వీటిలో ఏ ఒక్కటీ మన ఫెయిల్యూర్ కాదు. అన్నీ మన ప్రమేయం లేకుండా, మన ఆమోదంతో నిమిత్తం లేకుండా సంభవించిన పరిణామాలే. మనం పాల్గొనని యుద్ధంలో.. మనమెలా ఓడిపోతాం?
నిజానికి, మనం ఓడిపోలేదు.
గెలిచాం, ఘన విజయం సాధించాం.
అది కూడా అల్లాటప్పా సక్సెస్ కాదు. పండగ చేసుకోవాల్సినంత గొప్ప వేడుక. వంద రోజుల నుంచీ మనం కరోనా వైరస్‌తో యుద్ధం చేస్తూనే ఉన్నాం. ఏ రోజుకారోజు... నాలుగు గోడల మధ్య నుంచే, నలుదిక్కుల నుంచీ కమ్ముకుంటున్న కనిపించని శత్రువుతో పోరాడుతూనే ఉన్నాం. మాస్కులూ శానిటైజర్లూ ఆయుధాలుగా మనం సత్తువకొద్దీ తిరగబడుతూనే ఉన్నాం. రోజూ ఓ యుద్ధం లెక్కన ... నూరు రోజులు పోరాడి నూరు విజయాలు సాధించాం. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే ఓ లక్షమంది ఓడి విగతజీవులైన యుద్ధంలో... మనం మాత్రం ప్రాణాలతో మిగిలామంటే మనిషిగా మనకు ఇది విజయమే, మహాద్భుత విజయమే!

> **సృష్టిలో మార్పు తప్ప మరేదీ శాశ్వతం కాదు. మార్పును స్వాగతించే జీవులే పరిణామక్రమంలో బతికిబట్టకడతాయి. మిగతావన్నీ కాలగర్భంలో కలిసిపోతాయి. ప్రపంచ సంక్షోభాలు నేర్పిన పాఠం ఇది.**



అదేదో కథలో... ఓ రాజు యాభైమంది బందిపోటు దొంగల్ని వరుసగా నిలబెడతాడు. మరణశిక్ష అమలు చేయబోతాడు. వరుసలోని మొదటి ఖైదీ తల నరకబోతూ 'నీ చివరి కోరిక ఏమిటి?' అని అడుగుతాడు. 'దొరా.. అట్నుంచి నరుక్కునిరా!' ప్రాధేయపడతాడు దొంగ. ఎటు నుంచి అయినా చావు తప్పదని తెలుసు. కానీ... అటు నుంచి అయితే నలభై తొమ్మిది మరణాల వరకూ తాను బతికి ఉండొచ్చన్న ఆశ. అదీ బతుకు తీపి, జీవితం పట్ల మమకారం! ప్రాణం విలువ తెలిసినవాళ్లు ఎవరైనా అలానే స్పందిస్తారు. మనకంటూ ఓ మంచి ప్రభుత్వం ఉంది. సమర్థ యంత్రాంగం ఉంది. బయటి దేశాలతోనో, పొరుగు రాష్ట్రాలతోనో పోలిస్తే మనం చాలా సురక్షితంగా ఉన్నాం. అందుకు సంతోషించాలి. సంబరపడాలి. అంతేకానీ జీతాల్లో కోతలుపడ్డాయనో, వ్యాపారం మందగించిందనో, తాజా కూరగాయలు దొరకడం లేదనో బాధపడుతూ కూర్చుంటే... మూర్ఖత్వమే అవుతుంది. మనమే కాదు, మహామహా కంపెనీలు కూడా ఇప్పుడు... సకల ప్రణాళికలనూ పక్కనపెట్టి, ఈ సంక్షోభ సమయంలో బతికితే చాలనే నిర్ణయానికి వచ్చాయి. లాభనష్టాల సంగతి తర్వాత, ప్రత్యర్థి కంపెనీల్ని నిలువరించడం దేవుడెరుగు. ముందు... సంస్థను బతికించుకుందాం, బతకడాన్ని మించిన గెలుపేం ఉంటుంది.. అంటూ మనుగడ కోసం పోరాటానికి సిద్ధపడ్డాయి. ఉనికిని నిలబెట్టుకోవడానికి సర్వశక్తులూ సమీకరిస్తున్నాయి.

## 1+1=100

ఒక ఒకటి ఒకటే.
కానీ రెండు ఒకట్లు...
రెండు కావచ్చు, ఇరవై కావచ్చు, రెండు వేలూ కావచ్చు.
ఒకటి పక్కన మరొకటి చేరడం వల్ల కలిగే శక్తిని 'సినర్జీ' అని పిలుస్తారు. ఒక పక్షి ఆకాశంలో గంటకు పది కిలోమీటర్ల వేగంతో వెళ్లగలదని అనుకుందాం. అదే పక్షి.. బృందంగా వెళ్తున్నప్పుడు సునాయాసంగా ఇరవై కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. కారణం... పక్షులు 'వి' ఆకారంతో గుంపుగా వెళ్లడం వల్ల ఎదురుగాలి ప్రభావం బాగా తగ్గిపోతుంది. దీంతో వేగం పెరుగుతుంది. ఇదే ఫార్ములాను కంపెనీలూ అనుసరిస్తున్నాయి.
కలిసి పనిచేయడం అన్నది శాస్త్రం లాంటి కళ. అన్నిటికంటే ముందు మన బలహీనతల్ని మనం ఆమోదించాలి. ఎదుటివాళ్ల బలాన్ని గుర్తించాలి. ఉబెర్... స్వతహాగా రవాణా సంస్థ. గల్లీ గల్లీలో దానికి కస్టమర్లు ఉన్నారు. ఆ సంస్థలో పనిచేసే సిబ్బందికి ప్రతి వీధీ తెలుసు. కాకపోతే, లాక్‌డౌన్ కారణంగా నయాపైసా కూడా వ్యాపారం లేదు. బిగ్‌బాస్కెట్ అనేది... కస్టమర్లకు కోరిన సరుకులు రవాణా చేసే కంపెనీ. జనతా కర్ఫ్యూ దెబ్బకి ప్రజలు సూపర్ మార్కెట్లకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడటంతో, బిగ్‌బాస్కెట్‌కు ఆర్డర్లు పెరిగాయి. కానీ, ఆ సరుకును కొనుగోలుదారుల ఇళ్లకు చేర్చడానికి తగినంతమంది మనుషులు లేరు. ఈ సమయంలో ఉబెర్, బిగ్ బాస్కెట్ చేతులు కలిపాయి. ఒకరికి పని దొరికింది. ఒకరికి సరుకు డెలివరీ వ్యవస్థ లభించింది. ఇద్దరి బిజినెస్ అనూహ్యంగా పెరిగింది. ఐటీసీ కూడా డామినోస్ పిజ్జా డెలివరీ సిబ్బందిని తమ ఉత్పత్తుల్ని చేరవేయడానికి వాడుకుంటున్నది.

స్విగ్గీ, జొమాటో... ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీలో నువ్వా నేనా అన్నట్టు పోటీపడే ప్రత్యర్థి సంస్థలు. కానీ, మారికో అనే సంస్థకు సేవలు అందించే విషయంలో మాత్రం రెండూ కలిసి పనిచేశాయి. అలాగే, డెట్టాల్, లైఫ్‌బాయ్‌ల దాయాది పోరు ఇప్పటిది కాదు. ఒకదాని మీద ఒకటి ప్రకటనల యుద్ధమూ చేశాయి. 'మా సబ్బే క్రిముల్ని బాగా కడిగేస్తుందంటే, కాదు మా సబ్బే కడిగేస్తుందని' సవాళ్లు విసురుకున్నాయి. ఇదంతా గతం. ప్రస్తుతం మనుగడే ముఖ్యం. అందుకే, 'ఏ సబ్బుతో కడుకున్నా పర్లేదు. చేతులు కడుక్కుంటే చాలు' అంటూ ప్రకటనల్లో కొత్త స్వరం అందుకున్నాయి. ఇద్దర్నీ బతికించే ఫార్ములా ఇది.

### మారాల్సిందే

సృష్టిలో మార్పు తప్ప మరేదీ శాశ్వతం కాదు. మార్పును స్వాగతించే జీవులే పరిణామక్రమంలో బతికిబట్టకడతాయి. మిగతావన్నీ కాలగర్భంలో కలిసిపోతాయి. ప్రపంచ సంక్షోభాలు నేర్పించిన పాఠం ఇది. వ్యక్తులైనా వ్యవస్థలైనా ఒంటబట్టించుకోవాల్సిందే. కరోనా దెబ్బకు కుదేలైన తొలి వ్యాపారం ఆతిథ్య రంగం. టూరిస్టులు లేకపోవడంతో... స్టార్ హోటళ్లన్నీ ఖాళీ అయిపోయాయి. ఇలానే కొనసాగితే సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితి. దీంతో 'అవుట్ ఆఫ్ ద బాక్స్' ఆలోచన చేశాయి. గదులను క్వారంటైన్‌లో ఉన్నవారికి అద్దెకు ఇవ్వడానికి ముందుకొచ్చాయి. ఫలితంగా ఎంతో కొంత వ్యాపారం వచ్చింది. 'ఫైవ్ స్టార్ విందు' అంటే ఎవరికైనా మోజే! అదీ కొంచెం తక్కువ ధరలో వస్తే ఇంకా సంతోషం! ఎటూ కస్టమర్లు స్టార్ హోటళ్లకు వెళ్లే పరిస్థితి లేదు కాబట్టి, ఫైవ్‌స్టార్ భోజనాన్నే ఇళ్లకు పంపే ఏర్పాట్లు చేస్తున్నాయి ఐదు నక్షత్రాల హోటళ్లు. జాగ్రత్తగా వడ్డించడానికి ఓ మనిషినీ పంపుతారు. దీంతో సిబ్బందికి ఎంతోకొంత పని ఉంటున్నదిప్పుడు.

**నిజమే, బతకడం ముఖ్యం! ఇది గెలుపు పాఠాల వేళ కాదు..**
**బతుకు సూత్రాల సమయం!**

## జంట... కన్నులపంట



క్వారంటైన్ కాలంలోనూ బాలీవుడ్ జంట.. రణ్‌వీర్, దీపికా అభిమానులను ఉత్సాహంలో ముంచెత్తుతున్నారు. సోషల్ మీడియాలో ఫ్యాన్స్‌తో నిత్యం కనెక్ట్ అవుతున్నారు. క్వారంటైన్‌లో ఉంటూనే.. సరదాగా గడుపుతున్నామని చెప్పడానికి తమ ఫొటోలను మిన్నీ, మిక్కీ మౌజ్ ఇలస్ట్రేషన్‌లో పోస్ట్ చేశారు. మిక్కీ మౌజ్‌గా దీపిక, మిన్నీ మౌజ్‌గా రణ్‌వీర్... కనువిందుగా కనిపిస్తున్నారు. మీరూ చూడండి.

## దేవత... దేవకి!



గొప్పగొప్ప రాజుల కథలు వినే ఉంటాం. మహామహా దాతల గురించి చదివే ఉంటాం. ఆ జాబితాలో చేరేందుకు ఈ సామాన్యురాలికి సకల అర్హతలూ ఉన్నాయి. ఉత్తరాఖండ్‌లోని చమోలి జిల్లాకు చెందిన దేవకి భండారి తన జీవిత కాల పొదుపును పీఎం-కేర్స్ ఫండ్‌కు విరాళంగా ఇచ్చింది. పుట్టి బుద్ధి ఎరిగినప్పటి నుంచీ పైసాపైసా కూడబెడుతూ అరవై ఏండ్లు వచ్చేనాటికి ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పెన్షన్ డబ్బులతో కలిపి 10లక్షల రూపాయలు ఆదా చేసింది. ఈ మొత్తాన్ని ప్రభుత్వానికి అందచేసింది. 'నాకు పిల్లలు లేరు. అద్దె ఇంట్లో ఒంటరిగా జీవిస్తున్నా. భారతీయులంతా నా కుటుంబ సభ్యులే. కరోనా మహమ్మారి నుంచి కొంతమందిని రక్షించడానికైనా ఈ డబ్బు ఉపయోగపడితే చాలు' అంటున్నది దేవకి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ఆమె దాతృత్వాన్ని ప్రశంసించారు.

## థ్యాంక్ యూ... రోబో



వెంటిలేటర్ మీద ఉన్న కరోనా బాధితులను చూసుకోవడానికి రోబోలు సాయపడుతున్నాయి. అమెరికాకు చెందిన క్లౌడ్ మైండ్స్ సంస్థ రూపొందించిన 'క్లౌడ్ జింజర్' అనే రోబో కరోనా పేషెంట్లకు విజయవంతంగా వైద్యసేవలు అందిస్తున్నదని ఆ సంస్థ ప్రకటించింది. క్యాలిఫోర్నియా, బీజింగ్‌లలోని ఆధునిక వైద్యశాలల్లో ఇవి విధుల్లో ఉన్నాయి. రోగికి వేళకు తగిన ఆహారం అందిస్తున్నాయి. తరచూ శరీర ఉష్ణోగ్రతను, బీపీని పరీక్షిస్తున్నాయి. తమ పర్యవేక్షణలో ఉన్న వ్యక్తిని ఉత్సాహంగా ఉంచేందుకు డ్యాన్స్ కూడా చేస్తాయని నిర్వాహకులు చెబుతున్నారు. వీటికి రిమోట్ ఉంటుంది. దవాఖాన ఉద్యోగుల్లో ఎవరో ఒకరు నియంత్రిస్తారు. అర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, హైస్పీడ్ ఇంటర్నెట్, సెన్సర్ టెక్నాలజీ.. వీటి తయారీలో ఉపకరిస్తాయి. పేషెంట్ల వీడియో కాన్ఫరెన్సు తర్వాత... డాక్టర్లు ఈ రోబోలకు తగిన సూచనలు ఇస్తారు. ఆ ఆదేశాన్ని ఇవి కచ్చితంగా పాటిస్తాయి.

### వంటింటి చిట్కాలు



- పులుసులు, కూరల్లో చింతపండు రసానికి బదులు టమాట గుజ్జు వేస్తే రుచి పెరుగుతుంది.
- బిస్కెట్లు నిల్వ ఉంచిన డబ్బాలో కొద్దిగా పంచదార వేస్తే మెత్తబడవు.
- కారం డబ్బాలో చిటికెడు ఇంగువ కలిపితే పురుగుపట్టదు. ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది.
- పలుచగా అయిన గ్రేవీలో ఉడికించిన బంగాళాదుంపను మెత్తగా చేసి కలిపితే చిక్కగా తయారవుతుంది.
- అన్నం వండేటప్పుడు అందులో కొద్దిగా వంటనూనె వేస్తే, అన్నం ముద్దవకుండా పొడిపొడిగా వస్తుంది.
- కూరల్లో కారానికి బదులు పచ్చిమిరపకాయలు వాడితే శరీరంలోని కొలెస్ట్రాల్ తగ్గుతుంది.
- కూరల్లో వేసే పచ్చిబఠాణీలు తొందరగా నానాలంటే వేడినీటిలో కొద్దిగా వంట సోడా వేసి, రెండు గంటలు ఉంచాలి. తర్వాత కూరలో ఉపయోగించుకోవచ్చు.
- బొంబాయి రవ్వను వేగించి నిల్వచేస్తే పురుగుపట్టకుండా ఉంటుంది.
- ఫ్లోర్ మీద ఒలికి పోయిన నూనెను శుభ్రం చేయాలంటే, దాని మీద ఏదైనా పిండి చల్లి తుడిస్తే సులభంగా శుభ్రం అవుతుంది.

## ఇవి సాధారణ సమస్యలు కావు..
# క్యాన్సర్ కారకాలు!



సలహా

**కొందరికి బాగా తలనొప్పి వస్తుంది. పని ఒత్తిడిలే అనుకుంటారు. ఆయాసం వస్తే.. తిన్నది జీర్ణంగాక కావచ్చు అనుకుంటారు. విపరీతమైన గొంతునొప్పి వస్తే.. వాతావరణంలో మార్పులనుకుంటారు. కానీ.. వీటిలో ఏది తీవ్రంగా ఉన్నా అది క్యాన్సర్‌కు దారితీస్తుందనే విషయం తెలుసుకోరు!**

**జ్వరంగా** ఉందనుకోండి.. ఏం చేస్తాం? డాక్టర్ దగ్గరకు గానీ.. మెడికల్ షాప్‌కు గానీ వెళ్లడానికి కుదరదు. కారణం బిజీలైఫ్. ఏవైనా గడ్డలైతే ఏం చేస్తాం? వేడి చేయడం వల్ల అలా అయుండొచ్చు.. గతంలో తగిలిన దెబ్బల చిహ్నాలై ఉండొచ్చు అనుకుంటాం. కానీ ఇవేంటి అని జాగ్రత్త పడని వాళ్లు చాలామంది ఉన్నారు. ఇలాంటి వాళ్లకు క్యాన్సర్ గురించి తెలియదు. పైగా వీటన్నింటినీ లైట్‌గా తీసుకుంటారు.

**ఎందుకు?:** నిరక్షరాస్యత.. గ్రామీణ నేపథ్యం.. ఆర్థిక పరిస్థితులు.. అమాయకత్వం వంటివి ఇలాంటి ఆరోగ్య సమస్యలకు ఒక కారణం అయితే బిజీలైఫ్ మరో కారణం. ఫోన్లోనో లేక ఇంటర్నెట్‌లోనో వైద్య సలహాలు పొందుతారు. వీటివల్ల తాత్కాలిక ఉపశమనం వస్తుండొచ్చు కానీ దీర్ఘకాలికంగా అలాగే ఉంటే మాత్రం క్యాన్సర్ ముప్పు పొంచి ఉన్నట్లే.

**అవగాహన అవసరం:** క్యాన్సర్‌ను గుర్తించాలంటే ముందు ఆ వ్యాధిపట్ల అవగాహన కావాలి. తొలి దశలోనే దానిని గుర్తిస్తే ఆధునిక వైద్య చికిత్సలను అనుసరించి నయం చేసుకోవచ్చు. అందుకోసం అత్యాధునిక విధానంలో చికిత్స అందించేందుకు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ప్రాథమిక స్థాయిలోనే క్యాన్సర్ పని పడితే ఆరోగ్యంగా ఉండొచ్చు. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించాలంటే కొన్ని సర్వ సాధారణ లక్షణాలను గుర్తించాల్సి ఉంటుంది. ముఖ్యంగా తలనొప్పి, గొంతునొప్పి, ఆయాసం, దగ్గు, కడుపు ఉబ్బరం, మూత్ర వ్యవస్థలో తేడాలు, మలవిసర్జన సమస్యలు గుర్తించి డాక్టర్‌ను సంప్రదిస్తే క్యాన్సర్‌ను అరికట్టవచ్చు.

**తలనొప్పి:** మామూలుగా అందరికీ వస్తుంది. చికాకు, పనుల ఒత్తిడి, ఎండ, కొన్ని రకాల వాసనలు, ఆకలి వంటి కారణాలతో మైగ్రెయిన్ లేక అప్పుడప్పుడు తలనొప్పి రావటం సహజమే. తలనొప్పి లక్షణాలు కన్పించగానే సొంత వైద్యం చేసుకునేందుకు ఎడాపెడా ఇష్టమొచ్చిన మందులు వాడితే లివర్, కిడ్నీలపై తీవ్రమైన ప్రభావం పడుతుంది. కాబట్టి ముందుగా చేయాల్సింది తలనొప్పికి కారణం తెలుసుకోవాలి. నిర్దిష్ట కాలం పాటు సరైన మందులు వాడాలి. ఇలా చేస్తేనే సమస్యను అధిగమించవచ్చు.

**గొంతునొప్పి:** చల్లటి పదార్థాలు తీసుకోవడం వల్ల.. వాతావరణంలో మార్పుల వల్ల.. ఏదైనా కొత్తప్రదేశానికి వెళ్లినప్పుడు.. గొంతు సమస్యలు వస్తుంటాయి. ఈ సమస్యలు రెండు మూడు రోజుల్లో తగ్గకపోతే డాక్టర్ సలహా ప్రకారం కోర్సుగా మందులు వాడాల్సి ఉంటుంది. థైరాయిడ్ క్యాన్సర్, గొంతు క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ లక్షణాలు తొలిదశలో ఇలాగే ఉంటాయి.

**దగ్గు, ఆయాసం:** సిగరెట్లు తాగేవారు తమకు ఇలాంటివి అలవాటే అనుకుంటారు కానీ వీరికి లంగ్ క్యాన్సర్‌తో పాటు అనేక రకాల ఇతర క్యాన్సర్స్ వచ్చే ముప్పు ఎక్కువ. గొంతులో నస, ఆగని దగ్గు, ఆయాసం టీబీ వంటివి లంగ్ క్యాన్సర్ లక్షణాలు.



**కడుపు ఉబ్బరం, మంట:** ఆహార వేళల్లో టైమ్ సెన్స్ లేకపోవడం, నోరూరించే అనారోగ్య ఆహారపదార్థాలు తినడం, నిద్రలేమి, ఒత్తిడి వంటి కారణాల వల్ల కడుపులో మంట, త్రేన్పులు, ఉబ్బరం, ఆకలి తగ్గటం, వికారం వంటి లక్షణాలు కనిస్తుంటాయి. ఇవి పిల్లలు, పెద్దలు అందరిలో ఉంటాయి. సరైన జీవనశైలి అలవర్చుకుంటే ఇలాంటి సమస్యలు రావు. నీరు ఎక్కువగా తాగాలి. పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ఇవి జీర్ణ వ్యవస్థను మెరుగు పరుస్తాయి. ఎండోస్కోపి, స్కానింగ్ లాంటి పరీక్షలతో జీర్ణాశయంకు సంబంధించిన క్యాన్సర్స్, లివర్, ప్యాంక్రియాజ్, గాల్ బ్లాడర్ క్యాన్సర్స్‌ను తొలిదశలోనే కనుక్కోవచ్చు.

**మూత్ర వ్యవస్థలో తేడాలు:** మూత్రంలో రక్తం పడటం, మూత్రం ఆగి రావడం, మంటగా ఉండటం మొదలైనవి చూస్తూ వేడి చేసిందనుకుంటారు. సాధారణంగా నీళ్లు తక్కువగా తాగటం, ఇన్‌ఫెక్షన్స్, కిడ్నీ స్టోన్స్ వంటి కారణాల వల్ల ఈ లక్షణాలు కనిపిస్తాయి. లక్షణాలు తీవ్రంగా ఉండి చికిత్సలకు లొంగకపోతే యూరినరి బ్లాడర్‌కు సంబంధించిన క్యాన్సర్స్ కావచ్చు అని గమనించుకోవాలి. 50 ఏళ్ల పైబడిన పురుషులలో ప్రోస్టేట్ గ్రంధి సమస్యలు, క్యాన్సర్ లక్షణాలు ఈ విధంగానే ఉండవచ్చు. నెలసరి మధ్య రక్తస్రావం, పొట్ట భారంగా ఉండటం, ఆకలి మందగించటం, స్త్రీలు నెలసరి ముందు ఉంటే సమస్యలుగా (PMS) పొరబడవచ్చుకాని కొన్ని సందర్భాలలో ఒవేరియన్, యుటెరైన్ క్యాన్సర్స్ కావచ్చు.

**మలవిసర్జనలో తేడాలు :** అజీర్తి, విరోచనాలు, మలంలో రక్తం వంటి సింప్టమ్స్ ఆహారపు అలవాట్లు మారినప్పుడు పైల్స్, ఫిషర్స్, ఫిస్టులా వంటి సమస్యలున్నప్పుడు కన్పించవచ్చు. కాని ఎప్పుడూ మలవిసర్జన సమయంలో పడే రక్తాన్ని పైల్స్ అనుకున్నట్లయితే పొరబడుతున్నట్లే. దక్షిణ భారతదేశంలో పురుషులలో ఎక్కువగా కన్పించే కోలన్ క్యాన్సర్ లక్షణాలు కూడా కావచ్చు.

**పరీక్షలు:** మామూలు గడ్డలే అని, పాలగడ్డలు అని రొమ్ములో దీర్ఘకాలంపాటు కన్పించే కణితులను అశ్రద్ధ చేస్తే కణితి ఇతర భాగాలకు పాకే ప్రమాదం పొంచిఉన్నట్లే, అలసట, రక్తహీనతతోపాటు చర్మం మీద ఊదా రంగు మచ్చలు, తేలికగా కమిలిపోవటం బ్లడ్ క్యాన్సర్‌గా హెచ్చరించవచ్చు. గోళ్లలో మార్పు లు, ముందుకు వంగినట్లు ఉండటం లివర్, లంగ్ క్యాన్సర్స్‌కు సూచనలు కావచ్చు. సిగ్మాయిడోస్కోపి, కొలనోస్కోపి వంటి పరీక్షలతో సమస్య ఏమిటో తేలిపోతుంది. ఇలాంటి లక్షణాలు కన్పించే సరికే క్యాన్సర్ ఇతర భాగాలకూ వ్యాపించి చికిత్సకు లొంగకుండా తయారవుతుంది. చాలావరకు క్యాన్సర్ ముదిరిన దశలోనే ట్రీట్‌మెంట్ చేయించుకుంటారు. ఇలా చేయొద్దు. అంతకు ముందే మీకు అనుమానం ఉంటే రెగ్యులర్ హెల్త్ చెకప్స్, స్క్రీనింగ్ టెస్టు, గైనిక్ చెకప్ చేయించుకోవాలి.

డా. సీహెచ్ మోహన వంశీ
చీఫ్ సర్జికల్ అంకాలజిస్ట్,
ఒమెగా హాస్పిటల్స్
హైదరాబాద్: 9848011421
కర్నూల్: 08518 273001
గుంటూర్: 08632 223300



## రేడియో ఆన్ కరోనా!



ఎంతసేపూ టీవీ, ఫోన్! ఇవేకాదు.. ఇప్పుడు దేశమంతా రేడియోని ట్యూన్ చేసే పనిలో పడింది. లాక్‌డౌన్ కారణంగా చాలామంది రేడియోలో పాటలు, వార్తలు వినడానికి ఇష్టపడుతున్నారని మార్కెట్ కన్సల్టింగ్ సంస్థ ఏజెడ్ రిసెర్చ్ పార్ట్‌నర్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన సర్వేలో తేలింది. మెట్రో నగరాల్లో దాదాపు 82శాతం మంది రేడియో వినడానికే మొగ్గుచూపుతున్నారట. ముంబై, ఢిల్లీ, పుణే, బెంగళూరు, కోల్‌కతా, హైదరాబాద్‌లలోని ప్రజలు మరీ ఎక్కువగా రేడియోకి అలవాటు పడిపోయారట. ఇది చాలా శుభపరిణామమని సంతోషపడుతున్నది రేడియో మాధ్యమం. లాక్‌డౌన్ పీరియడ్‌లో శ్రోతల సంఖ్య... పాతికశాతం పెరిగినట్టు లెక్కలు చెబుతున్నాయి.

## జనరల్ నాలెడ్జ్



1. మన రాష్ట్రంలో అసెంబ్లీ స్థానాల సంఖ్య?
2. 'ఏడు తరాలు' పుస్తక మూల రచయిత ఎవరు?
3. ల్యూకో సైట్లు అంటే ఏంటి?
4. ఇండియాలో అత్యధిక అక్షరాస్యత కలిగిన రాష్ట్రం?
5. దేశంలో కేంద్రపాలిత ప్రాంతాల సంఖ్య?

### జవాబులు

జనరల్ నాలెడ్జ్: 1. 119, 2.హెలెక్స్ హేలీ, 3. తెల్లరక్తకణాలు, 4. కేరళ, 5. 8
అర్థాలేంటి: 1. Call, 2. Wall 3. Angry, 4. Hungry 5. transportation, 6. Tall

## దారి కనుక్కోండి



# వెండి నాణెం

కథ



**పూర్వం** భీమయ్య అనే పేదవాడు ఉండేవాడు. ఒకసారి పనిమీద బంధువుల ఊరికి బయల్దేరాడు. మధ్యాహ్నానికి ఒక పట్టణానికి చేరుకున్నాడు. బాగా ఆకలి వేసింది. దగ్గర్లోని పేదరాసి పెద్దమ్మ ఇంటికి వెళ్ళాడు. ఆమె ఇంటి పక్కనే కల్లు దుకాణం ఉంది. ఆ దుకాణం యజమానురాలి పేరు సూరమ్మ. ఆ పేదవాడు వెళ్ళేటప్పటికి సూరమ్మ చేపలు వేయిస్తోంది. భీమయ్య ఇదేమీ పట్టించుకోలేదు. నేరుగా పేదరాశి పెద్దమ్మ దగ్గరికెళ్ళాడు. ఆమెకు డబ్బిచ్చి, కడుపునిండా భోజనం చేశాడు. బయటికొచ్చి తన దారిన తాను వెళ్ళసాగాడు. ఇంతలో సూరమ్మ గోలగోలగా అరుస్తూ అతని దగ్గరకెళ్ళింది. సూరమ్మ అరుపులకు చుట్టుపక్కలవాళ్ళు గుమిగూడారు. ఆమె ఎందుకు అలా అరుస్తున్నదో భీమయ్యకు అర్థం కాలేదు. అదే అడిగాడు. 'ఈ పెద్దమనిషి నా చేపల వాసన పీల్చి, డబ్బులివ్వకుండా చక్కా పోతున్నాడు' అంది సూరమ్మ. ఆ మాటలకు భీమయ్య తెల్లబోయాడు. 'చేపల వాసన పీల్చినందుకు డబ్బులివ్వాలా! ఎంత?' అయోమయంగా అడిగాడు. ఒక వెండి నాణెం ఇవ్వాల్సిందేనని దబాయించింది సూరమ్మ. 'ఇది చాలా అన్యాయం. నేనివ్వను' అన్నాడు భీమయ్య. అతనితో సూరమ్మ వాదనకు దిగింది. చివరకు వాళ్ళిద్దరూ పట్టణాధికారి దగ్గరకెళ్ళారు. జరిగినదంతా ఆయనతో చెప్పారు. 'అవునయ్యా.. నువ్వు చేపల వేపుడు వాసన పీల్చడం వల్ల ఆ కూర రుచి తగ్గుతుంది. కాబట్టి ఆమెకు డబ్బులివ్వాల్సిందే' చెప్పాడు పట్టణాధికారి. భీమయ్యకు ఏమీ పాలుపోలేదు. అయోమయంగా ఆయన్నే చూస్తూ నిలబడ్డాడు. భీమయ్య అవస్థ చూసి పట్టణాధికారి చిరునవ్వు నవ్వాడు. 'చూడు భీమయ్యా.. నేనిచ్చిన తీర్పు ప్రకారం నువ్వు వెండి నాణేన్ని ఎండకు ఎదురుగ్గా పెట్టు. సూరమ్మ వచ్చి ఆ నాణం నీడను పట్టుకొని వెళ్తుంది. చెల్లుకు చెల్లు' అన్నాడు పట్టణాధికారి. ఇది విన్న తరువాత సూరమ్మ ముఖం మాడిపోయింది. అత్యాశకు పోయినందుకు తనను తానే నిందించుకుంది. పట్టణాధికారిని, భీమయ్యను క్షమాపణ కోరింది. భీమయ్య సంతోషంగా తన దారిన తాను వెళ్ళిపోయాడు.



## పెద్దల మాట



చరిత్రలో అనామకంగా మిగిలిన మేధావులు మహిళలు మాత్రమే.
- వర్జీనియా వుల్ఫ్

## జర నవ్వుకో!

**గీత :** నీకు సెల్ ఎందుకే ఉంది.. అస్తమానం స్విచ్ఛాఫ్ చేయడానికా?
**సీత :** నా సెల్లా.. దానికేమయింది, నిక్షేపంగా పనిచేస్తోంది.
**గీత :** పనిచేస్తోందా..? మరి ఎన్నిసార్లు కాల్ చేసినా స్విచ్ఛాఫ్ అని చెబుతోంది.
**సీత :** ఆహా.. అది నా ఫోన్ కాలర్ ట్యూన్‌లే!!

***

'హాఫ్ టికెట్ ఇవ్వండి' సినిమా థియేటర్‌కి వెళ్లి క్లర్క్‌ని అడిగాడు వెంకట్.
'సినిమా హాల్లో.. హాఫ్ టికెట్ ఏంటండి?' అడిగాడు బుకింగ్ క్లర్క్.
'సగం సినిమానే చూడాలనుకుంటున్నా కాబట్టి!' అంటూ సమాధానమిచ్చాడు వెంకట్.

## చుక్కలు కలుపండి



## అర్థాలేంటి?

పక్కన ఇచ్చిన పదాలకు ఇంగ్లీషు అర్థాలు రాయండి.



1. పిలుపు
2. గోడ
3. కోపం
4. ఆకలి
5. రవాణా
6. పొడవైన

## పద్యం

చావు వచ్చినపుడు సన్యసించేదెట్లు
కడకు మొదటి కులము చెడినయట్లు
పాపమొకటి గలదు ఫలమేమి లేదయా!
విశ్వదాభిరామ వినురవేమ.



**భావం :** అవసాన దశకు వచ్చాక సన్యాసం స్వీకరించి లాభం ఏమిటి? అంటే.. పూర్వాశ్రమంలో చేసినవన్నీ తప్పులన్నట్టేగా! గతంలో జరిగిన పాపం ఎటూ పోదు. దాని ఫలితం అనుభవించక తప్పదు. సన్యసిస్తే మాత్రం మంచి ఫలితం వస్తుందా? అని ఈ పద్య సారాంశం.

## A Town Mouse and A Country Mouse

A Town Mouse and a Country Mouse were friends. The Country Mouse one day invited his friend to come and see him at his home in the fields. The Town Mouse came and they sat down to a dinner of barleycorns and roots the latter of which had a distinctly earthy flavor.

The flavour was not much to the taste of the guest and presently he broke out with "My poor dear friend, you live here no better than the ants. Now, you should just see how I fare! My larder is a regular horn of plenty. You must come and stay with me and I promise you shall live on the fat of the land."

So when he returned to town he took the Country Mouse with him and showed him into a larder containing flour and oatmeal and figs and honey and dates.

The Country Mouse had never seen anything like it and sat down to enjoy the luxuries his friend provided. But before they had well begun, the door of the larder opened and some one came in. The two Mice scampered off and hid themselves in a narrow and exceedingly uncomfortable hole. Presently, when all was quiet, they ventured out again. But some one else came in, and off they scuttled again. This was too much for the visitor. "Good bye," said he, "I'm off. You live in the lap of luxury, I can see, but you are surrounded by dangers whereas at home I can enjoy my simple dinner of roots and corn in peace."

### స్టోరీ బాక్స్




# చిత్రం



బాలగోవిందరాజు, రామ్‌మోహన్‌రావు, సునీల్ నారంగ్, మురళీమోహన్‌రావు, కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, అభిషేక్ నామా, అనుపమ్

## తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ 25లక్షల విరాళం

**క**రోనా వైరస్‌ను నిరోధించేందుకు ప్రభుత్వం చేస్తున్న పోరాటానికి తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ మద్దతుగా నిలిచింది. తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి ఇరవై ఐదు లక్షల విరాళాన్ని అందించి దాతృత్వాన్ని చాటుకుంది. శుక్రవారం మంత్రి కేటీఆర్‌కు ఛాంబర్ అధ్యక్షుడు మురళీమోహన్ రావు, ప్రధాన కార్యదర్శి సునీల్ నారంగ్ చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, నిర్మాత పి.రామ్‌మోహన్‌రావు, అభిషేక్‌నామా, అనుపమ్, బాలగోవిందరాజు తదితరులు పాల్గొన్నారు. 'కరోనా మహమ్మారి రూపంలో దేశం పెను విపత్తును ఎదుర్కొంటున్నది. ఈ వైరస్ కారణంగా ఆరోగ్యపరంగా, ఆర్థికంగా ఎంతో మంది జీవితాలు ప్రమాదంలోకి నెట్టబడ్డాయి. కరోనా వ్యాప్తిని అరికట్టడానికి ప్రభుత్వాలు అవిరాళ కృషిని చేస్తున్నాయి. కరోనాపై జరుగుతున్న ఈ పోరాటంలో ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి' అని ఛాంబర్ ప్రతినిధులు తెలిపారు.



దిల్‌రాజు, కేటీఆర్, శిరీష్

### దిల్‌రాజు చెక్ అందజేత

కరోనా బాధితుల సహాయార్థం తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి పది లక్షల్ని అందివ్వనున్నట్లు ప్రముఖ నిర్మాత దిల్‌రాజు ప్రకటించిన విషయం తెలిసిందే.ఈ మేరకు శుక్రవారం మంత్రి కేటీఆర్‌ను కలిసిన దిల్‌రాజు, శిరీష్ ఆయనకు చెక్‌ను అందించారు.

### బ్రహ్మానందం 3 లక్షలు



తెలుగు సినీ కార్మికులకు అండగా చిరంజీవి ఆధ్వర్యంలో ఏర్పాటైన కరోనా క్రైసిస్ ఛారిటీ మనకోసంకు (సీసీసీ) శుక్రవారం ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం మూడు లక్షల విరాళాన్ని ప్రకటించారు



చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఏసీ బాలగంగిరెడ్డికి మాస్కులు, శానిటైజర్‌లు అందజేసిన ప్రముఖ సినీ దర్శకుడు శేఖర్ కమ్ముల



తమన్నా

## సవాలుగా స్వీకరించా!

**న**టన విషయంలో తాను భాషాపరమైన పరిమితుల్ని విధించుకోలేదని చెబుతోంది మిల్కీబ్యూటీ తమన్నా. ఏ భాషలో నటించినా పాత్రకు పరిపూర్ణంగా న్యాయం చేయడంపైనే దృష్టిపెడతానని చెప్పింది. పాత్రలపరంగా కూడా నవ్యతను ప్రదర్శించాలన్నదే తన సిద్ధాంతమని పేర్కొంది. ఆమె మాట్లాడుతూ 'దక్షిణాది సినిమాల్లో వరుస అవకాశాలు రావడం వల్ల హిందీ చిత్రసీమకు దూరంగా ఉంటున్నా. గత కొన్నేళ్లుగా అభినయపరంగా సవాళ్లతో కూడిన పాత్రల్నే ఎంచుకుంటున్నా. కెరీర్‌లో ఒక స్థాయికి వచ్చాక మూసధోరణిలో సినిమాలు చేస్తే అభిమానులు హర్షించరు. అందుకే కెరీర్‌లో గుర్తుండి పోయే సినిమాలు చేయాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నా' అని తెలిపింది. ప్రస్తుతం ఈ అమ్మడు తెలుగులో గోపీచంద్ సరసన 'సీటీమార్' అనే సినిమాలో నటిస్తోంది. ఇందులో ఆమె తెలంగాణ కబడ్డీ టీమ్ కోచ్ పాత్రలో నటిస్తోంది. ఈ సినిమా గురించి చెబుతూ 'నేను తొలి సారి నటిస్తున్న క్రీడా నేపథ్య చిత్రమిది. ఈ పాత్ర కోసం ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నా. ముఖ్యంగా తెలంగాణ యాసలో చక్కగా మాట్లాడటానికి శిక్షణ తీసుకుంటున్నా. క్రీడాకారుల ఔన్నత్యాన్ని తెలిపే పాత్ర కావడంతో ఈ సినిమాను ఓ సవాలుగా స్వీకరించా' అని చెప్పింది.

### నిర్మాతల మండలికి...



మోహన్, శ్రీనివాసరావు, ప్రసన్నకుమార్

కరోనా వైరస్ ప్రభావం కారణంగా షూటింగ్‌లు నిలిచిపోవడంతో సినీ పరిశ్రమ ఇబ్బందులను ఎదుర్కొంటున్నది. నిర్మాతలు కష్టాల్ని అనుభవిస్తున్నారు. వారికి ఆపన్నహస్తం అందించేందుకు నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు ముందుకొచ్చారు. నిర్మాతల మండలికి పది లక్షల పదకొండు వేల నూటపదకొండు రూపాయల్ని విరాళంగా అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిర్మాతల సంక్షేమం కోసం ఈ డబ్బును వినియోగించాలని చదలవాడ శ్రీనివాసరావు కోరారు.



చిరంజీవి

## పోలీసులకు సెల్యూట్

**లా**క్‌డౌన్‌ను సమర్థవంతంగా అమలు చేసే విషయంలో ఉభయ తెలుగు రాష్ట్రాల పోలీసులు అద్భుతంగా పనిచేస్తున్నారని కొనియాడారు అగ్ర నటుడు చిరంజీవి. ప్రజారోగ్య పరిరక్షణకు పోలీసులు నిద్రాహారాలు మాని కష్టపడుతున్నారని, ఓ పోలీస్ బిడ్డగా వారికి సెల్యూట్ చేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన తన ట్విట్టర్ ఖాతాలో ఓ వీడియోను అభిమానులతో పంచుకున్నారు. 'పోలీసుల పనితీరు వల్లే లాక్‌డౌన్ విజయవంతంగా అమలవుతోంది. పోలీసుల కృషి వల్లే కరోనా వ్యాప్తి అదుపులోకి వచ్చింది. కరోనా మహమ్మారిని అంతమొందించడంలో సామాన్య ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలి. పోలీసు వారు చేస్తున్న ఈ అమోఘమైన ప్రయత్నానికి ఒక పోలీసు బిడ్డగా వారందరికి చేతులెత్తి సెల్యూట్ చేస్తున్నా. జైహింద్' అని వీడియో సందేశంలో చిరంజీవి పేర్కొన్నారు.

### చిరంజీవి స్ఫూర్తినిచ్చారు-డీజీపీ మహేందర్‌రెడ్డి



పోలీసులపై చిరంజీవి ప్రశంసలకు తెలంగాణ డీజీపీ మహేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. 'ఓ పోలీసు కుటుంబానికి చెందిన వ్యక్తిగా మీ ప్రశంసలు మాకెంతో విలువైనవిగా భావిస్తున్నాం. కోవిడ్19పై జరుగుతున్న ఈ పోరాటంలో మా పోలీస్ సైన్యానికి మీ మాటలు ఎంతో ధైర్యానిస్తాయి. కేవలం పోలీస్ బలగానికే కాకుండా మిమ్మల్ని ప్రేమించే ప్రజలకు, అభిమానులకు స్ఫూర్తిగా నిలుస్తాయి' అని ట్విట్టర్‌లో డీజీపీ మహేందర్ రెడ్డి వ్యాఖ్యానించారు.

### పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం కోసం



అక్షయ్ కుమార్

**బా**లీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్ మరోమారు తన పెద్ద మనసును చాటుకున్నారు. గతంలోనే ప్రధానమంత్రి సహాయ నిధికి ఇరవై ఐదు కోట్ల విరాళాల్ని ప్రకటించి అందరిలో స్ఫూర్తిని నింపిన అక్షయ్ తాజాగా పారిశుద్ధ్య కార్మికులకు చేయూతనందించారు. కార్మికులకు అవసరమైన పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్స్, మాస్కులు, టెస్టింట్ కిట్స్ కొనుగోలు కోసం ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌కు మూడు కోట్ల విరాళాన్ని అందించారు అక్షయ్‌కుమార్.

### వైద్య సిబ్బందికి ఉచిత వసతి



సోనూసూద్

**బా**లీవుడ్ నటుడు సోనూసూద్ ముంబయిలోని తన హోటల్‌ను కరోనా రోగులకు చికిత్సను అందిస్తున్న వైద్య సిబ్బంది కోసం ఉచితంగా కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ప్రజల ప్రాణాలను కాపాడేందుకు రోజంతా శ్రమిస్తున్న వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బందికి చిన్న సాయం చేసే అవకాశాన్ని గౌరవంగా భావిస్తున్నా. ముంబయిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి వారంతా సేవ చేస్తున్నారు. వాళ్లు విశ్రాంతి తీసుకునేందుకు ఒక చోటు కావాలి. అందుకు మా హోటల్‌ను వినియోగించుకోవాలని మున్సిపల్ అధికారులతో పాటు ప్రైవేట్ ఆసుపత్రి వర్గాలకు తెలియజేశా' అని ఓ ప్రకటనలో తెలిపారు.





# కడచూపూ కరువాయె..

**మహారాష్ట్రలో అనారోగ్యంతో భర్త మృతి • లాక్‌డౌన్ నేపథ్యంలో తిరిగి వెళ్లలేని స్థితిలో భార్య**

**కూలీ కోసం వచ్చి చిక్కుకున్న గిరిజన మహిళ • అంత్యక్రియలు పూర్తి.. విలపిస్తున్న జానకి**



జానకి

**కోటపల్లి :** మనిషికీ మనిషికి సామాజిక దూరం పెంచిన కరోనా, చివరకు భర్త కడచూపునకు నోచుకోకుండా చేసింది. కూలీ కోసం రాష్ట్రం దాటి వచ్చిన ఆ వృద్ధురాలు, లాక్‌డౌన్ నేపథ్యంలో తిరిగి స్వగ్రామానికి వెళ్లలేని దయనీయ స్థితిని తెచ్చింది. ఇప్పటికే భర్త అంత్యక్రియలు పూర్తికాగా, తన బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆ భార్య లోలోపలే కుమిలిపోతున్నది. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా ఏటపల్లి తాలుకాలోని తండాకు చెందిన జానకి, దుర్వాపుచ్చి దంపతులకు ముగ్గురు కొడుకులు, కూతురు ఉన్నారు. జానకి నెల క్రితం కూలీ పనుల కోసం మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం రాంపూర్‌కు వచ్చింది. ఇక్కడ ఓ రైతు పొలంలో పని చేస్తున్నది. ఈ క్రమంలోనే ఈ నెల 5న ఆమె భర్త దుర్వాపుచ్చి అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు సదరు మహిళకు సమాచారం ఇచ్చారు. విషయం తెలిసిన జానకి తన భర్తను చివరిసారిగా చూసుకోవాలని తల్లడిల్లింది. 160 కిలోమీటర్ల దూరంలోని తన తండాకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేసింది. లాక్‌డౌన్‌తో సాధ్యం కాక వెళ్లలేకపోయింది. ఆమె బంధువుల ప్రయత్నాలూ ఫలించలేదు. చివరకు అదే రోజు భర్త అంత్యక్రియలు చేశారని తెలియడంతో కన్నీరుమున్నీరైంది. ఇకనైనా తనను స్వగ్రామానికి పంపించాలని వేడుకుంటున్నది.



# మాస్క్.. మస్ట్

- కరోనా నియంత్రణకు తప్పనిసరి
- బయటకు వెళ్తే ఖర్చీఫ్ అయినా కట్టుకోవాల్సిందే
- తాజాగా సర్కారు ఉత్తర్వులు
- నిబంధనలు పాటించాలని కలెక్టర్ విజ్ఞప్తి



**కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ :** కరోనా కట్టడికి కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర సర్కారు, అనుక్షణం అప్రమత్తంగా ఉంటున్నది. వైరస్ నియంత్రణకు అన్ని రకాలుగా చర్యలు చేపడుతూనే, ప్రజలను అలర్ట్ చేస్తున్నది. అంటువ్యాధుల ముప్పును సమర్థవంతంగా అడ్డుకునేందుకు సింగపూర్ తరహాలో బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మేయడాన్ని బుధవారం నుంచి నిషేధించింది. ఇప్పటికే ప్రజలందరూ మాస్కులు ధరిస్తున్నా, బయటకు వెళ్లే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ధరించాలని తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కరీంనగర్ కలెక్టర్ కే శశాంక శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చిన్నా పెద్దా తేడాలేకుండా ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలని విజ్ఞప్తి చేశారు. మెప్మా స్వయం సహాయక బృందాలు మాస్కులు తయారు చేసి తక్కువ ధరకు అందజేస్తున్నాయని తెలిపారు. కొనలేనివారు ఖర్చీఫ్ లేదా తెల్లని బట్టను ముక్కు, నోటికి కట్టుకోవాలని సూచించారు. అన్ని శాఖల ఉద్యోగులు విధిగా మాస్కులతో రావాలని ఆదేశించారు. మాస్కులు వేసుకునే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, ఒకసారి వినియోగించిన తర్వాత మరోసారి వాడాలంటే నీటితో శుభ్రపరచాలని సూచించారు. మాస్కు తీసి వేసే సమయంలో శానిటైజర్ లేదా సబ్బుతో 40 సెకన్ల వరకు చేతులను శుభ్రం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రతిఒక్కరూ సామాజిక దూరం పాటించాలని, వైద్యులు, పోలీసులు, ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా ప్రజలు నడుచుకోవాలని విజ్ఞప్తి చేశారు.



కరీంనగర్‌లో మాస్కులతో పోలీసులు

# కరోనాపై కదం

- సిరిసిల్ల జిల్లాలో వైరస్ నియంత్రణకు పకడ్బందీ చర్యలు
- మర్కజ్ ప్రార్థనలకు హాజరైన యువకుడికి పాజిటివ్‌తో మరింత అలర్ట్
- రంగంలోకి అధికార యంత్రాంగం
- శరవేగంగా నివారణ చర్యలు
- సుభాష్‌నగర్ చుట్టూ కిలోమీటర్ పరిధిలో దిగ్బంధం
- ఇంటింటికీ వైద్య పరీక్షలు చేసిన బృందాలు
- పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ



వేములవాడ : సుభాష్‌నగర్‌లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

**వేములవాడ, నమస్తే తెలంగాణ/సిరిసిల్ల టౌన్/కలెక్టరేట్ :** కరోనా కట్టడికి జిల్లా అధికారులు పకడ్బందీగా నివారణ చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలు, మంత్రి కేటీఆర్ మార్గదర్శకత్వంలో లాక్‌డౌన్‌ను విజయవంతంగా అమలు చేస్తున్నారు. ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రాకుండా చూస్తున్నారు. జిల్లా సరిహద్దుల్లో నాలుగు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి రాకపోకలు నియంత్రిస్తున్నారు. ఆయాచోట్ల రెవెన్యూ సిబ్బందికి తాజాగా విధులను కేటాయిస్తూ కలెక్టర్ కృష్ణభాస్కర్ ఉత్తర్వులు ఇచ్చారు. అత్యవసర సర్వీసులు, నిత్యావసర సరుకులు రవాణా చేసే వాహనాలను మాత్రమే జిల్లాలోకి అనుమతించాలని సూచించారు. విదేశాల నుంచి, ఇతర అనుమానిత ప్రాంతాల నుంచి వచ్చిన వారిని స్వీయ గృహ నిర్బంధంలో ఉండేలా చూడాలని ఆదేశాలు కూడా జారీ చేశారు. అనుమానితులను గుర్తించేందుకు గ్రామ, మండల కమిటీలు కూడా ఏర్పాటు చేశారు. ఇటు ఇప్పటికే విదేశాల నుంచి వచ్చిన వారిని గుర్తించి క్వారంటైన్ చేశారు. ఇందులో చాలా మందికి నెగెటివ్ రావడంతో ఇండ్లకు తరలించారు. ఇదే సమయంలో అంతటా పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. హైపో క్లోరైట్ ద్రావణాన్ని పిచికారీ చేస్తున్నారు. జిల్లా దవాఖానలో సేఫ్టీ టన్నెల్‌ను ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, దవాఖాన సూపరింటెండెంట్ మురళీధర్‌రావు ప్రారంభించారు.

### నలుగురిలో ఒకరికి పాజిటివ్..

ఢిల్లీ మర్కజ్‌లో మార్చి 13 నుంచి 15వరకు జరిగిన మతపరమైన ప్రార్థనలకు వేములవాడలోని సుభాష్‌నగర్‌కు చెందిన నలుగురు యువకులు వెళ్లినట్లు ఈ నెల 31న గుర్తించారు. వెంటనే ఆ నలుగురికి వైద్య పరీక్షలు చేశారు. అప్పుడు నెగెటివ్ రావడంతో వేములవాడలోని బాలుర సంక్షేమ వసతి గృహంలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డుకు తీసుకెళ్లారు. ఏప్రిల్ 2న నెగెటివ్ రావడంతో బుధవారం మరోసారి వైద్యపరీక్షలు చేశారు. గురువారం రాత్రి అందులో ఒకరికి పాజిటివ్ వచ్చినట్లు డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ రావు తెలిపారు. సదరు యువకున్ని హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. యువకుడి కుటుంబసభ్యులను ఐసోలేషన్ వార్డుకు తీసుకెళ్లారు.

### శరవేగంగా నివారణ చర్యలు..

మర్కజ్ వెళ్లొచ్చిన వారిలో ఒకరికి పాజిటివ్ రావడంతో అధికారులు శరవేగంగా నివారణ చర్యలు చేపట్టారు. సుభాష్‌నగర్ ప్రాంతాన్ని కంటైన్మెంట్ ఏరియా (నియంత్రిత ప్రాంతం)గా ప్రకటించి, కాలనీ పరిధిలో కిలో మీటరు వరకు దిగ్బంధించారు. బద్దిపోశమ్మ వీధి, వడ్ల కమ్మరి వీధి, కూరగాయల మార్కెట్, ఆలయ ప్రధాన రహదారులను మూసివేశారు. వైద్యాధికారులు ఆవుల సుమన్‌మోహన్‌రావు, రేగులపాటి మహేశ్‌రావు ఆధ్వర్యంలో 34 వైద్య బృందాలతో 1700 నివాసాల్లో ఇంటింటికీ సర్వే చేశారు. 25,433 జనాభా ఉండగా, ఇందులో 6,272 మందిని ఆరోగ్యపరంగా సర్వే చేశామన్నారు. అనుమానంగా ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని వైద్యాధికారులు వెల్లడించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించేందుకు మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్‌రూంను కూడా ఏర్పాటుచేశారు.

### పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ

కరోనా పాజిటివ్ రావడంతో జిల్లా అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. ఎస్పీ రాహుల్ హెగ్డే సుభాష్‌నగర్‌లో పర్యటించారు. పట్టణానికి చేరుకునే తిప్పాపూర్ బస్టాండ్ వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి, వాహనాల రాకపోకలను పరిశీలించారు. ప్రజలు బయటకు రావద్దని, అవసరమైతే నిత్యావసర సరుకులను ఇంటికే పంపిస్తామని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రి సమయంలో కలెక్టర్ కృష్ణభాస్కర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. జ్వరం, దగ్గు లాంటి లక్షణాలుంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులను సంప్రదించాలని ఆయన సూచించారు. లాక్‌డౌన్‌కు ప్రజలు సహకరించాలని కోరారు.



వేములవాడ: సుభాష్‌నగర్‌లో పరిస్థితులపై ఆరాతీస్తున్న కలెక్టర్ కృష్ణభాస్కర్



వేములవాడలోని సుభాష్‌నగర్‌లో సర్వే చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది




సిరిసిల్ల టౌన్ : డిస్ ఇన్‌ఫెక్షన్ టన్నెల్‌ను పరిశీలించి ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య

### లక్ష్మీ గణపతి కాంప్లెక్స్‌లో ఐసోలేషన్ వార్డు..

ఇప్పటి వరకు చెక్కపల్లి రహదారిలోని బాలుర వసతి గృహంలో 25 పడకలతో ఐసోలేషన్ వార్డు ఉండగా, తాజాగా రాజన్న ఆలయ వసతి గృహమైన లక్ష్మీ గణపతి వసతి సముదాయంలో 95 గదులతో ఏర్పాటు చేశారు. కరోనా నెగెటివ్ వచ్చిన ముగ్గురితోపాటు పాజిటివ్ వచ్చిన యువకుడికి సంబంధించిన 12 మంది కుటుంబ సభ్యులను కూడా ఈ వార్డుకు తరలించినట్లు వైద్యాధికారి తెలిపారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
BUSINESS OPPRTUNITY
★ఇంట్లోనే ఉండి తక్కువ పెట్టుబడితో
డబ్బులు సంపాదించుకునే సౌకర్యము
ఈ సదావకాశాన్ని వినియోగించుకోండి.
Ph: 9381157359
NT-252880

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు
సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం.
4 లైన్ల ప్రకటన కేవలం
150/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
40/- మాత్రమే
3+1 స్కీం కలదు
GST 5% వర్తించును
ప్రకటనల విభాగం
9182 777 571
9182 777 194









మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్

## సామాజిక దూరం పాటించేలా చూడండి

**ప్రభుత్వ విప్ బాల్క సుమన్**

**చెన్నూర్‌లో కూరగాయల మార్కెట్ పరిశీలన**

**చెన్నూర్, నమస్తే తెలంగాణ :** కూరగాయల మార్కెట్‌లో ప్రజలు సామాజిక దూరం పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ సూచించారు. చెన్నూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కూరగాయల మార్కెట్ చాలా బాగుందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అర్చన గిల్డా, వైస్ చైర్మన్ నవాజొద్దీన్, జడ్పీటీసీ తిరుపతి, ఎంపీపీ మంత్రి బాపు, జైపూర్ ఏసీపీ నరేందర్, మున్సిపల్ కమిషనర్ బాపు, సీఐ ప్రమోద్‌రావు, తాసిల్దార్ రాంచందర్, చెన్నూర్ ఎస్ఐ సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.



గోదావరిఖని చౌరస్తాలో ఆటో డ్రైవర్లకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే చందర్

## ఆకలి తీర్చడం మన బాధ్యత

**ఎమ్మెల్యే కోరుకంటి చందర్**

**గోదావరిఖని, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్‌తో ఇబ్బందులు పడుతున్న నిరుపేదలు, అన్నార్తుల ఆకలి కష్టాలు తీర్చడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. శుక్రవారం విజయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామగుండంలోని 30, 37వ డివిజన్లలో నిరుపేదలు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సమీపంలో వలస కూలీలు, పలువురు పారిశుధ్య కార్మికులకు బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఖని ప్రధాన చౌరస్తాలో లయన్స్ క్లబ్, విజయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 300 మంది ఆటో డ్రైవర్లకు బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, మన చుట్టూ ఉండే అసహాయులు, అభాగ్యులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని పిలుపునిచ్చారు. విపత్కర పరిస్థితుల్లో తమ ప్రాణాలకు తెగించి సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివని కొనియాడారు. లాక్‌డౌన్ అనంతరం ఆటో డ్రైవర్లకు జీవిత బీమా కల్పిస్తామని చెప్పారు. ఇక్కడ మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్ రావు, కార్పొరేటర్లు ఉన్నారు.



శంకరపట్నం: తాడికల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రసమయి

## ప్రతి గింజనూ కొంటాం

**ఎమ్మెల్యే రసమయి బాలకిషన్**

**శంకరపట్నం/తిమ్మాపూర్ రూరల్:** రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ కొంటామని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ రైతులకు భరోసానిచ్చారు. తాడికల్, మొలంగూర్, కరీంపేట్, నుస్తులాపూర్, మొగిలిపాలెం, రేణికుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, మాట్లాడారు. టోకెన్ల ప్రకారమే ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కేంద్రాల వద్ద సబ్బులు, శానిటైజర్లు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. అనంతరం శంకరపట్నంలో పాత్రికేయులకు బియ్యం పంపిణీ చేశారు. ఎంపీపీ సరోజన, జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ వీరారెడ్డి, తాసిల్దార్ జగత్‌సింగ్, ఎంపీడీవో వినోద, విండో చైర్మన్లు సంజీవరెడ్డి, మధుకర్ రెడ్డి, కోటయ్య, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్ ఉన్నారు.

## ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలి

**జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్**

**జగిత్యాల నమస్తే తెలంగాణ/సారంగాపూర్ :** రోళ్లవాగు ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సూచించారు. బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునికీకరణ పనులను శుక్రవారం సంబంధిత శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, రోళ్లవాగు ప్రాజెక్టు సామర్థ్యాన్ని 0.25 టీఎంసీ నుంచి ఒక టీఎంసీకి పెంచేందుకు ప్రభుత్వం ₹65కోట్లతో పనులు చేపడుతున్నదన్నారు. ఇవి పూర్తయితే బీర్‌పూర్, ధర్మపురి మండలాల్లోని 30 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. అనంతరం సారంగాపూర్‌కు చెందిన శ్రీకాంత్, వారి మిత్రుల ఆధ్వర్యంలో మాస్కులు పంపిణీ చేశారు. అంతకుముందు జగిత్యాల పట్టణంలోని 22వ వార్డులో రాచకొండ నరేందర్, వామన్ మిత్ర బృందం ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే, మున్సిపల్ అధ్యక్షురాలు బోగ శ్రావణి నిత్యావసర సరుకులు అందజేశారు. ఆయా చోట్ల ఎస్సారెస్పీ సీఈ శివకుమార్, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుర్రా రాజేందర్ రెడ్డి, కౌన్సిలర్ అల్లె గంగాసాగర్, తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాల: బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ అధ్యక్షురాలు

## ❖ శెభాష్ శశాంక

కరోనా కట్టడిలో నిరంతరం శ్రమిస్తున్న కరీంనగర్ కలెక్టర్ కే శశాంక, విపత్కర పరిస్థితుల్లోనూ సామాజిక బాధ్యతను చాటారు. లాక్‌డౌన్‌తో బ్లడ్ బ్యాంకుల్లో రక్తం కొరత ఏర్పడగా, తనవంతు కర్తవ్యం నెరవేర్చారు. కరీంనగర్ ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సీపీ కమలాసన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్‌తో కలిసి రక్తదానం చేశారు. మనం దానం చేసే ప్రతి రక్తపు బిందువూ మరొకరికి ప్రాణం పోసే అమృత బిందువు అవుతుందని చెప్పారు. ప్రస్తుతం ఎంతో మంది కొవిడ్–19 బాధితులు అపాయంలో ఉన్నారని, ఇలాంటి వారిని ఆపత్కాలంలో ఆదుకునేందుకు ప్రతి పౌరుడూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇదే శిబిరంలో రెవెన్యూ, పోలీసు సిబ్బంది కూడా రక్తదానం చేశారు.

- కరీంనగర్‌హెల్త్



రక్తదానం చేస్తున్న కలెక్టర్ శశాంక




రక్తదానం చేస్తున్న సీపీ కమలాసన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ జీవీ శ్యాం ప్రసాద్‌లాల్

# సైబర్ రొమాన్స్.. పడితే ఖల్లాస్

■ సోషల్ మీడియా వేదికగా మోసగాళ్ల బరితెగింపు ■ యువకులు, ఒంటరి వ్యక్తులకు 'వలపు వల' ■ అందమైన అమ్మాయిల ప్రొఫైల్స్‌తో ఎర ■ డేటింగ్ సైట్లు, ఫ్రెండ్‌షిప్ యాప్‌ల పేరిట మోసాలు ■ తీయని మాటలతో ముంచే కాల్‌సెంటర్లు ■ ఎదురుతిరిగితే బ్లాక్‌మెయిల్ ■ దేశంలో ఏటా ₹2వేల కోట్ల దందా ■ అప్రమత్తంగా ఉండాలంటున్న సైబర్‌క్రైమ్ పోలీసులు

పర స్త్రీపై వ్యామోహం మనిషిని ఎంతకైనా దిగజారేలా చేస్తుంది. ఇలాంటి వారి బలహీనతను ఆసరాగా చేసుకొని సైబర్ నేరగాళ్లు బరితెగిస్తున్నారు. సోషల్ మీడియాలో డేటింగ్ వెబ్‌సైట్‌లు, ఫ్రెండ్‌షిప్‌యాప్‌ల పేరిట 'వలపు వల' విసురుతూ.. అమ్మాయిలతో స్నేహం, రొమాంటిక్ చాటింగ్ అంటూ ఉచ్చులోకి దింపుతున్నారు. తీరా వీరి చేతికి చిక్కాక, గుట్టుగా రికార్డ్ చేసి, బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతూ అందినకాడికి గుంజుతున్నారు. బయటకు తెలిస్తే పరువు పోతుందన్న భయంతో బాధితులు లోలోన కుమిలిపోతుండగా, మోసగాళ్లు కోట్లు కొల్లగొడుతున్నారు. ఇలాంటి సైట్ల జోలికి వెళ్లకపోవడమే మంచిదని సైబర్‌క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. **- హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ**



### ముగ్గులోకి దింపి మోసం..

సోషల్ మీడియా వేదికగా మోసగాళ్లు బరితెగిస్తున్నారు. అవివాహితులు, విద్యార్థులు, ఒంటరివారిని లక్ష్యంగా చేసుకొని నిండా ముంచుతున్నారు. ముందుగా వీరిని ఆకర్షించేందుకు ఫేస్‌బుక్ వంటి మాధ్యమాల్లో అమ్మాయిల పేరుతో ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపిస్తారు. లేదా వారు ఎక్కువగా లాగిన్ అయ్యే వెబ్‌సైట్లలో డేటింగ్‌సైట్లకు సంబంధించిన అడ్వర్టయిజ్‌మెంట్లను పోస్ట్ చేస్తారు. లేదా వారి ఈ మెయిల్స్ అడ్రస్‌లు సంపాదించి, నేరుగా వాటికే పంపుతారు. లేదా ఫోన్ నంబర్లకు ఎస్‌ఎంఎస్‌లు పంపిస్తారు. ఒక్కసారి రిక్వెస్ట్‌ను అంగీకరించగానే వారి ప్రణాళిక మొదలవుతుంది. మొదట ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్‌లలో చాటింగ్‌తో ప్రారంభమవుతుంది. ఆ తర్వాత అది ఆడియో, వీడియో కాల్స్ దశకు చేరుతుంది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య లైంగికపరమైన సంభాషణలు, చర్యలు (ఫోన్‌లోనే) జరుగుతాయి. బాధితుడికి తెలియకుండా తతంగమంతటినీ రికార్డు చేస్తారు. ముందుగా రిజిస్ట్రేషన్ పేరిట కొంతమొత్తం లాగుతారు. తర్వాత డేటింగ్‌కు వచ్చే అమ్మాయి భద్రత కోసమంటూ భారీ మొత్తంలో డిపాజిట్ చేయాలంటారు. తీయని గొంతుతో మాట్లాడే అమ్మాయి రొమాంటిక్ సంభాషణలతో సదరు బాధితుడిని ముగ్గులోకి దించుతుంది. తన అవసరాలకంటూ చిన్న మొత్తంలో ఆమె కూడా డబ్బు లాగడానికి ప్రయత్నిస్తుంది. ఇలా వీలైనంత మేర మొత్తం వసూలు చేస్తారు. బాధితుడికి ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే బెదిరింపులకు దిగుతారు. వీడియో చాటింగ్ రికార్డులను బయటపెడుతామంటూ బ్లాక్‌మెయిల్ చేస్తారు. ఎవరికీ చెప్పుకోలేక.. ఏం చేయాలో తెలియక బాధితుడు నిండా మునుగుతాడు. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారికి సోషల్‌మీడియా ద్వారా పరిచయమైన మహిళ అతడి నుంచి ₹12 లక్షల వరకు స్వాహా చేసింది. ఈ విషయం బయటపడితే పరువుపోతుందన్న భయంతో ఆ వ్యాపారి పెదవి విప్పలేదు.

### కాల్‌సెంటర్ ఆదాయం నెలకు ₹2కోట్లకుపైనే..

డేటింగ్ పేరుతో ఆకర్షించే ముఠాలు దేశ్యాప్తంగా కాల్ సెంటర్లను ఏర్పాటు చేశాయి. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, బెంగుళూర్ వంటి నగరాలలో యువతులను ఉద్యోగాల్లో నియమించుకొని, వారి ద్వారా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. కొన్నిచోట్ల వాయిస్ చేంజ్ యాప్‌లతో యువకులే యువతుల్లాగా ఫోన్‌లో మాట్లాడి, దండుకుంటున్న ఘటనలూ వెలుగు చూస్తున్నాయి. హైదరాబాద్ పోలీసులు కోల్‌కతాలోని పలు సెంటర్లపై దాడులు చేసి నిర్వాహకులను అరెస్టు చేసిన ఉదంతాలున్నాయి. కాల్‌సెంటర్‌లో పనిచేసే ఒక్కో యువతి రోజుకు ₹10వేల నుంచి ₹50 వేల వరకు బాధితుల నుంచి వసూలు చేయాలని టార్గెట్లు విధిస్తున్నట్లు సమాచారం. ఈ విధంగా ఒక్కో కాల్‌సెంటర్ నెలకు ₹2 కోట్ల నుంచి ₹5 కోట్ల వరకు అక్రమంగా సంపాదిస్తున్నట్లు తెలిసింది. ఇలా సైబర్ రొమాన్స్ కోసం ఇంటర్నెట్‌లో వివిధ పేర్లతో 14వేలకు పైగా వెబ్‌సైట్లు ఉండగా, వాటి చాటున మన దేశంలో ఏటా ₹2వేల కోట్ల వరకు మోసాలు జరుగుతున్నాయన్నది అనధికారిక అంచనా. ఇంటర్‌నెట్ ఆధారంగా జరిగే సైబర్ మోసాలలో సైబర్ రొమాన్స్ నాలుగో స్థానంలో ఉంది.

### సర్వీస్ ప్రొవైడర్లతో కుమ్మక్కు..

వలలో పడ్డ యువకుడికి, మోసగాళ్లు నియమించిన అమ్మాయికి మధ్య సాగే 'రొమాంటిక్' సంభాషణ కనిష్ఠంగా 20 నిమిషాలు ఉంటుంది. ఇందుకోసం కాల్‌సెంటర్ల ముఠా ఇచ్చే ప్రీమియం నంబర్‌కే యువకులు ఫోన్ చేయాలని చెప్తారు. ఈ నంబర్లు కొన్నిసార్లు తొమ్మిది అంకెల్లోనే ఉంటాయి. దీనికి ఫోన్ చేసినప్పుడు ఒక నిమిషానికి ₹15 నుంచి ₹20 వరకు కట్ అవుతుంది. యువతి మాట్లాడే సమయాన్ని బట్టి ఆమెకు కూడా కమిషన్ ఉంటుంది. కొన్నిసార్లు ఈ ముఠాలు సర్వీస్ ప్రొవైడర్ల నుంచి ల్యాండ్‌లైన్ నంబర్లను లీజుకు తీసుకొని, సాఫ్ట్‌వేర్ సాయంతో అధిక మొత్తంలో యువకుల ఫోన్ నుంచి బిల్ కట్ చేయించి తమ ఖాతాల్లో వేసుకుంటారు. గతంలో ఇలాంటి ముఠాలను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రెండుసార్లు పట్టుకున్నారు. ఇప్పుడు కాల్‌సెంటర్లు కాకుండా నేరుగా నిర్వాహకులు సాఫ్ట్‌వేర్ సహాయంతో ఈ మోసాలకు పాల్పడుతున్నారు.

### బట్టలు విప్పించి..

గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన త్యాగి (పేరు మార్చాం) ఇటీవలే ఓ ప్రైవేట్ ఉద్యోగంలో చేరాడు. పలు డేటింగ్ సైట్లలో సభ్యత్వం తీసుకున్నాడు. ఓ యువతి అతడిని వీడియో చాటింగ్ చేద్దామని ఆహ్వానించింది. ఇద్దరూ వెబ్‌క్యామ్ ముందు చేరారు. ఆ యువతి తన ముఖం కనిపించకుండా వస్త్రాలను తొలగించి నగ్నంగా నిలుచున్నది. ఇటువైపు త్యాగిని కూడా అలాగే బట్టలు విప్పేయాలని చెప్పింది. ఇద్దరి మధ్య అలా దాదాపు ఓ అరగంటపాటు చాటింగ్ జరిగింది. మూడు గంటల తర్వాత త్యాగి ఫోన్‌కు ఓ లింకుతో కూడిన సమాచారం వచ్చింది. దాన్ని క్లిక్ చేయగా, తాను బట్టలు లేకుండా ఉన్న వీడియో కంటపడింది. అదే సమయంలో ఫోన్ చేసిన యువతి.. ఈ వీడియోను ఫేస్‌బుక్‌లో పెట్టానని, దానిని తొలగించాలంటే వెంటనే తన అకౌంట్‌కు ₹లక్ష ట్రాన్స్‌ఫర్ చేయాలని బెదిరించింది. త్యాగి తన వద్దనున్న ₹80వేలను వెంటనే ట్రాన్స్‌ఫర్ చేయడంతో ఆమె ఆ వీడియోను తొలగించింది. ఆ యువతి బ్యాంక్ ఖాతాను బట్టి ఉత్తరాదికి చెందినవారని తెలుస్తున్నదని పోలీసులు చెప్పారు.

### అప్రమత్తతతోనే అడ్డుకట్ట..

సైబర్ రొమాన్స్ లేదా డేటింగ్ వెబ్‌సైట్ల ద్వారా జరిగే మోసాలను అప్రమత్తతతోనే ఎదుర్కోవాలని సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు. చాలావరకు వెబ్‌సైట్లు, యాప్‌ల నిర్వాహకులు తాము అందించే డేటింగ్ వెబ్‌సైట్ల ద్వారా మోసాలు జరిగితే బాధ్యత తమది కాదంటూ కొన్ని షరతులను పెడుతుంటారు. చాలామంది వీటిని పట్టించుకోరు. సోషల్‌మీడియా, డేటింగ్ వెబ్‌సైట్స్, ఫ్రెండ్‌షిప్ యాప్స్ ఏవైనా సరే.. వాటిని పరిమితి మేరకే ఉపయోగించాలి. అవతలి వైపు అమ్మాయి మాట్లాడుతున్నదనే ఆరాటంలో విచక్షణ కోల్పోతే అది మున్ముందు బ్లాక్‌మెయిలింగ్‌కు దారితీస్తుందన్నది గుర్తుంచుకోవాలి. అలాంటి వాటి జోలికి వెళ్లకపోవడమే మంచిది. ఇంటర్నెట్ ద్వారా జరిగే మోసాలపై అప్రమత్తంగా ఉండడమే రక్ష.

# ఎంత పనాయె కొడుకా..

■ సంబురంగా వచ్చి నన్నొదిలిపోతివా..
■ ఈత నేర్చుకుంటా అని మాకు దుఃఖం మిగిల్చితివా..
■ తనయుడి మృతితో గుండెలు బాదుకున్న తండ్రి
■ మృతదేహంపై పడి కన్నీరుమున్నీరు ■ రాములపల్లెలో విషాదం


సిద్ధార్థ (ఫైల్)

**కరీంనగర్ రూరల్:** సరదాగా పొలం వద్దకు తండ్రితో వెళ్లిన బాలుడు అనుకోని రీతిలో ప్రాణాలు కోల్పోయాడు. అక్కడే ఉన్న ఓ నీటిగుంతలో ఈత నేర్చుకునేందుకు ప్రయత్నించి మృత్యుఒడికి చేరాడు. కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ పరిధిలోని శ్రీరాములపల్లెకు చెందిన మేర్గు శ్రీనివాస్‌కు ఒక కొడుకు, కూతురు. లాక్‌డౌన్‌తో ఇంటి వద్దే ఉంటున్న తన కొడుకు సిద్ధార్థ(14), మేనల్లుడు సాద్విక్‌ను వెంట తీసుకొని శుక్రవారం ఉదయం 10గంటల ప్రాంతంలో పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. అక్కడ తన పనుల్లో నిమగ్నమయ్యాడు. ఈక్రమంలో కొడు కు సిద్ధార్థ ఈత నేర్చుకునేందుకని నడుముకు డబ్బా కట్టుకొని సమీపంలోని మానేరువాగు నీటిగుంతలో దూకాడు. ఆ డబ్బా ఒక్కసారిగా ఊడి మునిగిపోతుండగా, సాద్విక్ గమనించాడు. బిగ్గరగా అరుస్తూ వెళ్లి మామ శ్రీనివాస్‌కు చెప్పాడు. ఆయన అక్కడికి చేరుకునేలోగానే సిద్దార్థ్ నీట మునిగి మరణించాడు. గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని వెలికితీయగా, మృతదేహంపై పడి ఆ తండ్రి ఒక్కసారిగా బోరుమన్నాడు. కన్నుమూసి తెరిచేలోపే కొడుకు నీటమునిగి చనిపోవడంతో హృదయవిదారకంగా రోదించాడు. 'ఎంత పనాయె కొడుకా.. సంబురంగా వచ్చి నన్నొదిలి వెళ్లిపోతివా బిడ్డా.. మాకు పుట్టెడు దుఃఖం మిగిల్చితివా' అంటూ గుండెలు బాదుకున్నాడు. తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఎల్లాగౌడ్ తెలిపారు.

## నిత్యావసరాలను అందుబాటులో ఉంచాలి

■ అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్

**కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రజలకు నిత్యావసరాలు అందుబాటులో ఉంచాలని విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులకు అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ సూచించారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో మూడు టీంలను నియమించి వారికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సరుకులు నిర్ణీత ధరలకు విక్రయించాలని, బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. టీం సభ్యులు ప్రతి రోజూ ఆకస్మిక తనిఖీలు చేసి నివేదికలు సమర్పించాలన్నారు. దుకాణాదారులు సామాజిక దూరం పాటించేలా చూడాలన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : సిరిసిల్ల ఎస్పీ

**బోయినపల్లి:** లాక్ డౌన్ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్పీ రాహుల్ హెగ్డే హెచ్చరించారు. నర్సింగాపూర్ చెక్‌పోస్టును శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా పరిధిలో ఇప్పటి వరకు లాక్‌డౌన్ ఉల్లంఘించి రోడ్లపైకి వచ్చిన 380 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

## ఏడుగురిపై కేసు

**సిరిసిల్ల క్రైం:** సిరిసిల్లలో లాక్‌డౌన్ ఉల్లంఘించిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వెంకటనర్సయ్య తెలిపారు. శుక్రవారం వీరితో పాటు తనిఖీల్లో 50 వాహనాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. సిరిసిల్లలోని గీతానగర్‌కు చెందిన ఎంపఆరిఫ్ ఫేస్‌బుక్‌లో విద్వేషపూరితమైన పోస్టులు చేయడం తో ఆయనపైనా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. సిరిసిల్లలోని గాంధీ చౌరస్తాలో సీఐ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మి వేయరాదని, 3 కిలోమీటర్ల పరిధి దాటివెళ్లవద్దని సూచించారు.

## కలప స్వాధీనం

**వీర్నపల్లి:** మండలకేంద్రంతో పాటు, ఎర్రగడ్డతండాలో అటవీశాఖ అధికారు లు దాడులు చేశారు. పలువురి ఇండ్లలో అక్రమంగా నిల్వ ఉంచిన ₹80వేల విలువైన కలపను సిరిసిల్ల అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు రేంజ్ అధికారి షేక్ బాబా ఖాదర్‌వాలీ తెలిపారు. ఎస్‌ఎఫ్‌వోలు బాబురాజు, శ్రీనివాస్, చంద్రారెడ్డి, బీట్ అధికారులు వసుమతి, లావణ్య, విజయ, స్రవంతి ఉన్నారు.

## ఐరిస్‌లో ఆన్‌లైన్ తరగతులు

**తిమ్మాపూర్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్ సందర్భంగా ఐరిస్ వరల్డ్ స్కూల్ విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాస్‌లు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6 నుంచి వర్చువల్ స్కూల్ ప్లాట్‌ఫాం ద్వారా ఆన్‌లైన్ స్టడీ సపోర్టు క్లాస్‌లు అందిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## క్షౌరశాలలు తెరిపించాలని మంత్రికి వినతి

**తెలంగాణ చౌక్:** లాక్‌డౌన్ అమలుతో ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంట నే క్షౌరశాలలు తెరిపించి ఆదుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌కు జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం మొండయ్య శుక్రవారం విజ్ఞప్తి చేశారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు క్షౌరశాలలకు అనుమతించాలని కోరారు.

# ఆకలి తీర్చి.. అభయమిచ్చి

■ పేదలు, కూలీలకు అండగా మానవతా మూర్తులు ■ నిత్యావసరాలు, నగదు, ఆహారం పంపిణీ ■ కరోనా కట్టడిలో శ్రమిస్తున్న ఉద్యోగులకూ సాయం

ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు మానవతామూర్తులు కదిలి వస్తున్నారు. లాక్‌డౌన్ మొదలైనప్పటి నుంచి రోజువారీగా పేదలు, కూలీలకు భరోసా ఇస్తున్నారు. కడుపునిండా తిండి పెట్టడంతోపాటు నిత్యావసరాలు, నగదు పంపిణీ చేస్తున్నారు. ఇటు కరోనా కట్టడిలో అహర్నిశలు శ్రమిస్తున్న పోలీసులు, పారిశుధ్య కార్మికులకూ సాయం అందిస్తున్నారు.


జమ్మికుంట: భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న జడ్పీ అధ్యక్షురాలు విజయ, తదితరులు


సిరిసిల్ల క్రైం: ఎస్పీ రాహుల్‌హెగ్డేకు శానిటైజర్లను అందజేస్తున్న టీఆర్కే ట్రస్టు సభ్యులు


36వ డివిజన్‌లో సరుకులు పంపిణీ చేస్తున్న మేయర్

కరీంనగర్ జిల్లా..

**కార్పొరేషన్, నమస్తే తెలంగాణ/ కరీంనగర్ హెల్త్/ కరీంనగర్ రూరల్/ హుజూరాబాద్/ హుజూరాబాద్‌టౌన్/ జమ్మికుంట/ సైదాపూర్/ చిగురుమామిడి:** తులసి, శ్రీహల్ది, ఎస్సారార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు రోజంతా మినరల్ వాటర్ సరఫరా చేశారు. ఈ కార్యక్రమాన్ని నగరకపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో మేయర్ సునీల్‌రావు ప్రారంభించారు. అనంతరం 42వ డివిజన్‌లో కార్పొరేటర్ మేచినేని వనజ అశోక్‌రావు ఆధ్వర్యంలో నిత్యావసరాలు పంపిణీ చేశారు. అనంతరం 57వ డివిజన్‌తోపాటు 36వ డివిజన్‌లో కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ, ఇంజినీర్ ఉస్మాన్ ఆరీఫ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్, వాసుదేవా హాస్పిటల్ సంయుక్తంగా కరీంనగర్‌లోని 44వ డివిజన్‌లోని నిరుపేదలకు కార్పొరేటర్ మెండి శ్రీలత, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఎంసీహెచ్‌లో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు పులిహోర ప్యాకెట్లు, పండ్లు అందజేశారు. నగరంలోని కాశ్మీజీనగర్‌లో వలస కూలీలకు ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సరుకులు పంపిణీ చేశారు. హుజూరాబాద్ మున్సిపల్ కార్మికులకు హెచ్‌పీ పెట్రోల్ బంక్ యజమాని అనగోని శ్రీనివాస్ గౌడ్ అన్నదానం చేశారు. జమ్మికుంటలో బాల్య మిత్రుల సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ చౌక్ వద్ద శుక్రవారం 200 మంది వలస కూలీలకు భోజన ప్యాకెట్లను జడ్పీ అధ్యక్షురాలు విజయ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అలాగే ఏ రాజేంద్రప్రసాద్ (హీరో హోండా), ఏకదంత భక్త మండలి సభ్యులు అయిత మహేశ్ 100 మంది నిరుపేదలకు భోజన ప్యాకెట్లను అందజేశారు. లస్మన్నపల్లిలో 27 మంది వృద్ధులకు బియ్యం, వంట సామగ్రిని ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా రెడ్డి యూత్ సభ్యులు అందించారు. కొత్తపల్లిలో 60మంది వలస కూలీలకు ₹500 చొప్పున మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులకు ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో రాగి జావ పంపిణీ చేశారు. రేకుర్తిలో 20 వలస కార్మిక కుటుంబాలకు ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసరాలు అందించారు. మొగ్దుంపూర్‌లో పేదలకు స్వేరో సర్కిల్‌శాఖ, ఫిట్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సరుకులు అందించారు. చిగురుమామిడిలో జర్నలిస్టులకు టీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి తలా 25కిలోల బియ్యంతోపాటు శానిటైజర్, మాస్కులను అందించారు. ముదిమాణిక్యంలో పచ్చిమట్ల ప్రవీణ్‌కుమార్‌గౌడ్ 600 కుటుంబాలకు ఐదు కిలోల చొప్పున కూరగాయలను పంపిణీ చేశారు. హుజూరాబాద్‌కు చెందిన మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ పది మంది జర్నలిస్టులకు ₹10 వేల విలువైన నిత్యావసరాలు, 20 మంది పేద ముస్లిం కుటుంబాలకు ₹20వేల విలువైన బియ్యం పంచారు. కాట్రపల్లిలో 30 మంది కూలీలకు తాడూ రి కుమారస్వామి, శ్రీనివాస్ కూరగాయలు పంపిణీ చేశారు. కృష్ణానగర్‌కాలనీ వాసులు పారిశుధ్య కార్మికుడు లింగమూర్తిని సన్మానించారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి పేదలకు భోజనం పంపిణీ చేశారు.


కరీంనగర్‌లో పోలీసులకు మజ్జిగ అందజేస్తున్న ప్రియా డెయిరీ సిబ్బంది


కరీంనగర్ రూరల్: కొత్తపల్లిలో వలస కూలీలకు డబ్బులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు

రాజన్న సిరిసిల్ల జిల్లా..

**ఎల్లారెడ్డిపేట/ చందుర్తి/ కోనరావుపేట/ బోయినపల్లి/ముస్తాబాద్/ సిరిసిల్ల రూరల్ / సిరిసిల్ల టౌన్/గంభీరావుపేట:** సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని తుర్కకాశీపల్లెలో వంద కుటుంబాలకు టీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ జిల్లా నాయకుడు షేక్ అలీ కూరగాయలను పంచారు. పెద్దూరులోని పేదలకు నిత్యావసర సరుకులను కౌన్సిలర్ చెన్నమనేని కీర్తి, లింగంపల్లి సత్యనారాయణ అందజేశారు. ఆర్కే చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు తోట రామ్‌కుమార్, సభ్యులు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రాహుల్ హెగ్డేను కలిసి శానిటైజర్లను అందజేశారు. సిరిసిల్ల హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 63 మందికి నిత్యావసర సరుకులు, భోజనం పంపిణీ చేశారు. ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ స్వగ్రామం కొదురుపాకలో మూడో రోజూ అన్నదానం చేశారు. 200మంది వలస కూలీలకు వార్డు సభ్యులతో కలిసి టీఆర్‌ఎస్ నాయకులు బొల్లవేని తిరుపతి యాదవ్, అనుముల భాస్కర్ భోజనం అందించారు. బోయినపల్లిలో 'మన గల్ఫ్ నేస్తం' వారు అందించిన రెండు క్వింటాళ్ల బియ్యం, నిత్యావసర సరుకులను వలస కూలీలకు సర్పంచ్ లతశ్రీ, ఎస్‌ఐ శ్రీనివాస్ పంపిణీ చేశారు. గొల్లపల్లికి చెందిన ఉపాధ్యాయుడు బండి బల్‌రాం ఐదు, అంబేద్కర్ చైతన్య యూత్ సభ్యులు 15, ఆదర్శయూత్ సభ్యులు ఆరు పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులకు ఎండీ లాల(ఎన్‌ఆర్‌ఐ) ₹10 వేలు, కేశెట్టి కిరణ్ క్వింటాల్ బియ్యం అందించారు. మర్రిగడ్డలో సెస్ డైరెక్టర్ అల్లాడి రమేశ్, ఎస్‌ఐ సునీల్ ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది, సెస్ సిబ్బందికి మాస్కులు, గ్లౌజ్‌లు పంపిణీ చేశారు. మామిడిపల్లిలో పది వలస కార్మికుల కుటుంబాలకు తన కొడుకు ప్రణీత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఆర్‌ఎంపీ వైద్యుడు నార్ల ప్రేమ్‌చంద్ బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. రైతు బెదిరె కుంటయ్య 10 వలస కుటుంబాలకు ₹200 చొప్పున ఆర్థిక సాయం చేశారు. ముస్తాబాద్‌లోని 30 మంది పారిశుధ్య కార్మికులకు సొంత ఖర్చులతో ఎంపీపీ జనగామ శరత్‌రావు నిత్యావసర వస్తువులు అందజేశారు. పోతుగల్‌లో 50 మంది ఇటుకబట్టీ కార్మికులకు అధికారులు నిత్యావసరాలు పంపిణీ చేశారు. గంభీరావుపేటలోని వృద్ధాశ్రమంలో 23 మందికి నెల రోజులకు సరిపడా బియ్యంతోపాటు సామగ్రిని ఆశ్రమ నిర్వాహకుడు మల్లుగారి నర్సాగౌడ్‌కు హైదరాబాద్‌లోని నవతేజ కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకులు అందించారు.


ముస్తాబాద్: జీపీ కార్మికులకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న ఎంపీపీ శరత్‌రావు, జడ్పీటీసీ


కోనరావుపేట: మామిడిపల్లిలో ఇటుకబట్టీల కూలీలకు బియ్యం, నిత్యావసరాలు అందిస్తున్న ఆర్‌ఎంపీ

# 50 ఇండ్లకో క్లస్టర్ ఏర్పాటు చేయాలి

■ కంటైన్మెంట్ ఏరియాల్లో సర్వే చేయాలి
■ కరీంనగర్ కలెక్టర్ శశాంక

**(కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ/ కరీంనగర్ హెల్త్)**
కరోనా కంటైన్మెంట్ ప్రాంతాల్లో 50 ఇండ్లకో క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని, ఇంటింటికీ ఆరోగ్య సర్వే నిర్వహించాలని అధికారులను కలెక్టర్ శశాంక ఆదేశించారు. కరీంనగర్ జిల్లా రెవెన్యూ, వైద్యాధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మూడు, నాలుగు క్లస్టర్లకు హెల్త్ సూపర్‌వైజర్, సహాయకుడిగా మున్సిపల్ ఉద్యోగిని అటాచ్ చేయాలని సూచించారు. ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు ఉదయం, సాయంత్రం ఇండ్లను సందర్శించి వివరాలు సేకరించాలన్నారు. మర్కజ్ వెళ్లి వచ్చిన వారిని క్వారంటైన్ చేయాలని చెప్పారు. క్వారంటైన్‌లో ఉన్న వారికి నిత్యావసరాలు అందించాలని, ఆర్‌ఆర్‌టీంలు హోం క్వారంటైన్లను రోజుకు రెండుసార్లు తనిఖీ చేయాలన్నారు. పీహెచ్‌సీ, ఎంవోస్ వలసవచ్చిన వారిని గుర్తించాలని కోరారు. శాతవాహన కాలేజీ, ప్రభుత్వ, చల్మెడ ఆనందరావు వైద్యశాలలు, హోం క్వారంటైన్‌లో ఉన్నవారి మణికట్టుకు స్టాంప్ వేశామన్నారు. వారికి నిర్ధారణ పరీక్షలు చేసిన అనంతరం 14 రోజుల పాటు హోం క్వారంటైన్‌లో ఉండాలని పంపించామని చెప్పారు. అన్ని మండలకేంద్రాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేయించాలన్నారు. వీరికి గ్రామీణ వైద్యులు చికిత్స అందించవద్దని, ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి పౌరుడూ సామాజిక దూరం పాటించాలని సూచించారు. ఇక్కడ అదనపు కలెక్టర్ జీవీ శ్యాం ప్రసాద్‌లాల్, బల్దియా కమిషనర్ క్రాంతి, డీఆర్వో పవన్‌కుమార్, డీఎంఅండ్‌హెచ్‌వో సుజాత, డాక్టర్ రవీందర్‌సింగ్ ఉన్నారు.

# కొనసాగుతున్న కొనుగోళ్లు


సిరిసిల్ల రూరల్: మాట్లాడుతున్న నర్సయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ కళ

**సిరిసిల్ల రూరల్ /వేములవాడ రూరల్ /కోనరావుపేట/ఎల్లారెడ్డిపేట:** జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పదో వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని ఆర్‌బీఎస్ జిల్లా కన్వీనర్ గడ్డం నర్సయ్య ప్రారంభించారు. తంగళ్లపల్లి మండలం కస్బెకట్కూర్, చింతలపల్లి, ఒబులాపూర్‌లో ఎంపీపీ పడిగెల మానస ప్రారంభించారు. తంగళ్లపల్లిలోని కేంద్రాన్ని డీఆర్డీవో పీడీ కౌటిల్యారెడ్డి తనిఖీ చేశారు. వేములవాడ మండలం అనుపురం, నాంపెల్లి గ్రామాల్లో కేంద్రాలను ప్రారంభించగా జడ్పీటీసీ మ్యాకల రవి, ఎంపీపీ బూర వజ్రమ్మ పాల్గొన్నారు. కోనరావుపేట మండలంలోని మల్కపేట, ధర్మారం గ్రామాల్లో కేంద్రాలను ఎంపీపీ చంద్రయ్యగౌడ్, సింగిల్‌విండో చైర్మన్లు రామ్మోహన్‌రావు, నర్సయ్య, సర్పంచులు, పోతిరెడ్డిపల్లి, వెంకటాపూర్‌లో జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెన్‌కాబ్ చికెన్ ధరలు (రూ.)

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 85.00 | రిటైల్ లైవ్ | 107.00 |
| డ్రెస్‌డ్ | 155.00 | స్కిన్‌లెస్ | 177.00 |

గుడ్ల ధరలు (వందకు)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 365.00 | వరంగల్ | 368.00 |
| మెదక్ | 365.00 | కరీంనగర్ | 368.00 |
| రంగారెడ్డి | 365.00 | డజన్ ధర | 54.00 |

• కరోనా కష్టాలు

## ఎగుమతుల్లో కోటిన్నర ఉద్యోగాలు మాయం



**దేశీయ** ఎగుమతుల విభాగంలో కోటిన్నర వరకు ఉద్యోగాలు మాయం కాబోతున్నాయి. కరోనా వైరస్‌తో ప్రపంచ వాణిజ్యం పూర్తిగా నిలిచిపోవడంతో భవిష్యత్తులో సగం ఆర్డర్లు నిలిచిపోవడంతో కోట్లాది మంది ఉపాధి అవకాశాలు కోల్పోనున్నారని ఎఫ్‌ఐఈవో వెల్లడించింది. మరోవైపు బ్యాంకుల నిరర్థక ఆస్తులు కూడా మరింత పెరిగే ప్రమాదం ఉన్నదని హెచ్చరించింది. ముఖ్యంగా దుస్తులు, జ్యూవెల్లరీ, హస్తకళలు, ఇంజినీరింగ్, టెక్స్‌టైల్స్, ఇతర రంగాల్లో అధికంగా ఉండనున్నదని తెలిపింది.

## 1.5 లక్షల ఐటీ ఉద్యోగాలు మటాష్

కరోనా వైరస్ రక్కసి ఐటీ సంస్థలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. దీంతో వచ్చే కొన్ని నెలల్లో దేశవ్యాప్తంగా 1.5 లక్షల మంది ఐటీ ఉద్యోగులు తమ ఉపాధిని కోల్పోబోతున్నారు. ఇప్పటికే పలు సంస్థలు తమ సిబ్బందిలోని పలువురికి పింక్ స్లిప్‌ను కూడా జారీచేశాయి. ఈ వైరస్‌తో దేశ ఆర్థిక వ్యవస్థతోపాటు కార్పొరేట్ల ఆదాయ, లాభాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నది.

## ఇండిగో విమానాల్లో మీల్స్ రద్దు



**కరోనా** వైరస్‌ను అరికట్టడానికి సామాజిక దూరం పాటించాలన్న సూచనలమేరకు ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో కీలక నిర్ణయం తీసుకున్నది. లాక్‌డౌన్ పూర్తయిన తర్వాత తమ విమాన సర్వీసుల్లో బోర్డ్ మీల్స్‌ను రద్దు చేయనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. విమానాశ్రయ చెక్-ఇన్ కౌంటర్ల వద్ద కనీసం ఒక్క మీటర్ దూరం పాటించాలని, శానిటైజర్లు విరివిగా వినియోగించాలని డీజీసీఏ ఆదేశాలు జారీచేసింది.

## ఈ-లావాదేవీలు రెండింతలు



**లాక్‌డౌన్** కారణంగా ఈ-లావాదేవీలు అమాంతం పెరిగాయి. గత నెల 24 నుంచి 31 వరకు ఏకంగా 7.2 కోట్ల లావాదేవీలు జరిగాయి. గతేడాది ఇదే సమయంలో జరిగిన 3.44 కోట్లతో పోలిస్తే రెండు రెట్లు పెరిగాయి. వీటి విలువ తెలియకపోయినప్పటికీ, ఏప్రిల్ 9న ఒకేరోజు రూ.2,004 కోట్ల లావాదేవీలు జరిగినట్లు తెలుస్తున్నది.

## మాకూ రిలీఫ్ ప్యాకేజీ ఇవ్వండి: ట్రక్కర్లు



**రిలీఫ్** ప్యాకేజీ ఇవ్వాలని ట్రక్కర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. లాక్‌డౌన్ కారణంగా దేశవ్యాప్తంగా కోటికి పైగా ట్రక్కులు నిలిచిపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొవాల్సి వస్తున్నదని వారు వాపోతున్నారు. 4 లక్షల ట్రక్కుల్లో రూ.40 వేల కోట్లకు పైగా సరుకులు రోడ్డుపైన నిలిచిపోయాయని ఏఐఎంటీసీ వర్గాలు వెల్లడించాయి.

## 180 విమానాల్లో సరుకు రవాణా



180 విమానాల్లో 258.24 టన్నుల సరుకును రవాణా చేసినట్లు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ప్రకటించింది. లాక్‌డౌన్ కారణంగా నిలిచిపోయిన అత్యవసర సరుకుల రవాణాకు కేంద్ర ప్రభుత్వం 'లైఫ్ లైన్ ఉడాన్'ను ప్రవేశపెట్టింది. వీటిలో 114 విమానాలు ఎయిర్ ఇండియా, అలయెన్స్ ఎయిర్‌కు సంబంధించినవి ఉన్నాయి.

## 1.37 లక్షల మంది పీఎఫ్ విత్‌డ్రా



**కరోనా** వైరస్ వ్యాప్తిని కట్టడి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లాక్‌డౌన్ కారణంగా పెన్షన్ ఫండ్ నుంచి 75 శాతం వరకు విత్‌డ్రా చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతించడంతో గత పదిరోజుల్లో సబ్‌స్క్రైబర్లు రూ.280 కోట్ల నిధులను వెనక్కితీసుకున్నారు. ఈ విషయాన్ని ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్‌వో) సంస్థ శుక్రవారం వెల్లడించింది. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన పథకం కింద 1.37 లక్షల మంది చందాదారులకు రూ.279.65 కోట్లు చెల్లించామమని ఈపీఎఫ్‌వో ఒక ప్రకటనలో పేర్కొంది. కేవైసీ నిబంధనలకు అనుగుణంగా ఉన్న క్లెయిమ్స్‌ను కేవలం 72 గంటల్లోనే పరిష్కరిస్తున్నామని తెలిపింది. ఈపీఎఫ్‌వో వద్ద నమోదైన నాలుగు కోట్ల మంది ఉద్యోగులు, మూడు నెలల కనీస వేతనం, డీఏ లేదా ఈపీఎఫ్ మొత్తంలో 75 శాతం ఏది తక్కువైతే ఆ మొత్తాన్ని నాన్ రిఫండబుల్ అడ్వాన్స్ కింద పొందవచ్చని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే.

# చైనాను వీడండి

## ఎట్టిపరిస్థితుల్లో అక్కడ ఉండొద్దు

### డ్రాగన్‌పై ఆధారపడటం శ్రేయస్కరంకాదు

### తమ సంస్థలకు అగ్రదేశాల అల్టిమేటం • భారీ ఉద్దీపనలు ప్రకటించిన జపాన్



**చైనా దిగుమతులపై అధికంగా ఆధారపడుతున్న దేశాలకు కరోనా వైరస్ గొప్ప గుణపాఠం నేర్పుతున్నది. కొద్ది నెలల క్రితం వుహాన్‌లో ఈ వైరస్ తెరమీదకు వచ్చిన వెంటనే చైనాలో లాక్‌డౌన్లు విధించడంతో ఆ దేశంలోని అనేక పరిశ్రమల నుంచి ప్రపంచ దేశాలకు సరఫరాలు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో ఇక దిగుమతుల కోసం చైనాపై ఆధారపడటం ఏమాత్రం శ్రేయస్కరం కాదని భావిస్తున్న అమెరికా, జపాన్ లాంటి దేశాలు చైనా నుంచి తమ కంపెనీలను వెనక్కు రప్పించేందుకు చర్యలు చేపడుతున్నాయి. ఇలాంటి పలు సంస్థలు ఇప్పుడు భారత్ లాంటి వర్ధమాన దేశాలవైపు చూస్తున్నాయి. చైనాకు ఏ మాత్రం తీసిపోనంత భారీ స్థాయిలో శ్రామికశక్తిని, మార్కెట్‌ను కలిగి ఉండటం, మానవవనరులు చౌకగా అందుబాటులో ఉండటం భారత్‌కు సానుకూల అంశాలు.**

బిజినెస్ డెస్క్

అంతర్జాతీయ ఉత్పత్తి రాజధాని (గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ క్యాపిటల్)గా భాసిల్లుతున్న చైనాను ప్రపంచ దేశాలు కొద్దినెలల క్రితం వరకు తమ వర్క్‌షాప్‌గా చెప్పుకొన్నాయి. కానీ అది గతం. ఇకపై చైనాకు ఆ వైభవం కొనసాగే పరిస్థితులు కనిపించడం లేదు. చైనాపై అధికంగా ఆధారపడినందుకు ప్రపంచ దేశాలు ఇటీవల భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సిరావడమే ఇందుకు ప్రధాన కారణం. ప్రపంచంలో ఎక్కడా లేనంత భారీ స్థాయిలో వస్తువులను ఉత్పత్తిచేస్తున్న చైనా.. 2009 నుంచి ప్రపంచంలోనే అతిపెద్ద ఎగుమతిదారుగా కొనసాగుతున్నది. ప్రపంచ దేశాలకు అనేక రకాల వస్తువులను ఎగుమతిచేస్తూ రోజురోజుకూ ఆర్థికంగా ఎంతో బలపడుతున్న చైనా.. ఈ ఏడాది తమ ఉత్పత్తులతోపాటు ప్రాణాంతక కరోనా వైరస్‌ను కూడా ప్రపంచానికి ఎగుమతి చేసింది. అదే ఇప్పుడు చైనా కొంప ముంచుతున్నది. కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు ప్రస్తుతం యావత్ ప్రపంచ ప్రజలంతా వ్యక్తిగత దూరాన్ని పాటిస్తున్నారు. ఇదేవిధంగా చైనాతో ఆర్థిక దూరాన్ని (ఎకనమిక్ డిస్టెన్స్‌ను) పాటించడం శ్రేయస్కరమని పలు దేశాలు భావిస్తున్నాయి. ఈ దిశగా రెండు దేశాలు ఇప్పటికే (అమెరికా, జపాన్) కసరత్తు కూడా మొదలుపెట్టాయి. కరోనా వైరస్ వల్ల ఎదురైన భారీ నష్టం నుంచి గుణపాఠం నేర్చుకొంటున్న అమెరికా, జపాన్.. ఇప్పుడు చైనాలోని తమ సంస్థలను వెనక్కు రప్పించేందుకు చర్యలు చేపడుతున్నాయి. ఈ విషయంలో అమెరికా కంటే జపాన్ ముందంజలో ఉన్నది. కరోనా వైరస్‌పై పోరాడేందుకు దేశంలో ఎమర్జెన్సీ (అత్యయిక పరిస్థితి) విధించిన జపాన్ ప్రధాని షింజో అబే.. ఈ మహమ్మారి వల్ల తమ ఆర్థిక వ్యవస్థకు వాటిల్లిన నష్టాన్ని తగ్గించుకొనేందుకు దాదాపు లక్ష కోట్ల డాలర్లతో భారీ ఉద్దీపనల ప్యాకేజీని ప్రకటించారు. 'రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఎన్నడూ లేనంత సంక్షోభాన్ని ఇప్పుడు జపాన్ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్నది. ఈ నేపథ్యంలో జపనీయుల ప్రాణాలను, ఉద్యోగాలను కాపాడుకోవాల్సిన అవసరమున్నది. అందుకే 108 ట్రిలియన్ యెన్లతో కూడిన భారీ ఉద్దీపనల ప్యాకేజీని ప్రకటిస్తున్నాం. దీని విలువ మా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో దాదాపు 20 శాతం మేరకు ఉంటుంది' అని ఆయన వివరించారు. చైనా నుంచి వెలుపలికి వచ్చే జపాన్ సంస్థలకు చేయూతనిచ్చేందుకు ఈ ప్యాకేజీలో 220 కోట్ల డాలర్లను కేటాయించారు. ఇందులో చైనా నుంచి జపాన్‌కు తిరగొచ్చే సంస్థలకు 200 కోట్ల డాలర్ల సాయాన్ని, చైనా నుంచి ఇతర దేశాలకు తరలివెళ్లే జపాన్ సంస్థలకు 20 కోట్ల డాలర్ల సాయాన్ని అందజేయనున్నట్టు షింజో అబే తెలిపారు. తద్వారా చైనాలోని జపాన్ సంస్థలు స్వదేశానికి తిరిగి రావాలని, లేదంటే మరో దేశానికి తరలిపోవాలని, చైనాలో మాత్రం ఉండవద్దని ఆయన స్పష్టమైన సందేశమిచ్చినట్టయింది.

**అమెరికన్ కంపెనీల నిష్క్రమణ వేగవంతం**

మరోవైపు చైనా నుంచి అమెరికా కంపెనీలు వైదొలగడం గతంలోనే ప్రారంభమైంది. చైనా-అమెరికా మధ్య వాణిజ్య యుద్ధం మొదలవడంతో దాదాపు 50 అమెరికన్ కంపెనీలు ఇప్పటికే చైనా నుంచి నిష్క్రమించాయి. ఇప్పుడు కరోనా వైరస్ కారణంగా ఈ ప్రక్రియ మరింత వేగవంతమవుతున్నది. ప్రస్తుతం మరో 200కుపైగా అమెరికన్ కంపెనీలు చైనా నుంచి భారత్‌లోకి రావాలని యోచిస్తున్నట్టు యూఎస్‌ఐఎస్‌పీఎఫ్ అధ్యక్షుడు ముఖేశ్ అఘీ తెలిపారు. అమెరికాలో సంస్కరణలను వేగవంతం చేయడంతోపాటు విధాన నిర్ణయ ప్రక్రియలో పారదర్శకతను పెంపొందించాల్సిందిగా కొత్త ప్రభుత్వానికి యూఎస్‌ఐఎస్‌పీఎఫ్ సిఫారసు చేయనున్నదని చెప్పారు.

### భారత్‌కు లబ్ధి

**చైనా** నుంచి విదేశీ కంపెనీల నిష్క్రమణలతో ప్రధానంగా ఐదు దేశాలకు లబ్ధిచేకూరే అవకాశాలు కనిపిస్తున్నాయి. వీటిలో భారత్ ముందు వరుసలో ఉన్నది. చైనాకు ఏమాత్రం తీసిపోనంత భారీస్థాయిలో కార్మికులను, మార్కెట్‌ను కలిగి ఉండటం, శ్రామికశక్తి చౌకగా అందుబాటులో ఉండటం ఇందుకు ప్రధాన కారణాలు. ఈ ఐదు దేశాల్లో భారత్ తర్వాత వియత్నాం, థాయ్‌లాండ్, మలేషియా, ఇండోనేషియా కూడా ఉన్నాయి. కరోనా వైరస్ వ్యాప్తి చెందక ముందు వరకు వియత్నాం దాదాపు 5 వేల రకాల ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేస్తున్నది.

## మీ సేవలు నిలిపేస్తాం

### చైనా టెలికం సంస్థకు అమెరికా హెచ్చరిక

**వాషింగ్టన్:** అమెరికా మార్కెట్లో చైనా టెలికం (అమెరికాస్) సంస్థ సర్వీసులను నిలిపివేస్తామని అగ్రరాజ్యం హెచ్చరించింది. న్యాయ, భద్రతాపరమైన సమస్యల దృష్ట్యా ఈ చర్య చేపట్టనున్నట్టు అమెరికా న్యాయ విభాగం ప్రకటించింది. అమెరికాలో అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ సేవలందించేందుకు వీలుగా చైనా టెలికం (అమెరికాస్)కు ఇచ్చిన అన్ని అనుమతులను ఉపసంహరించుకోవాలని అమెరికా రక్షణ, విదేశాంగ, అంతర్గత భద్రతా శాఖలు సహా పలు కీలక ప్రభుత్వ విభాగాలు ఫెడరల్ కమ్యూనికేషన్స్ కమిషన్ (ఎఫ్‌సీసీ)కు సిఫారసు చేసినట్టు న్యాయ విభాగం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ సిఫారసు ఆమోదం పొందితే అమెరికాలో చైనా టెలికం సంస్థకు చెందిన లక్షల మంది ఫోన్, ఇంటర్నెట్ ఖాతాదారులకు సేవలు నిలిచిపోతాయి.

## ప్రాసస్ భారీ విరాళం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** స్విగ్గీ, బైజు వంటి సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన కన్జ్యూమర్ ఇంటర్నెట్ సేవల సంస్థ ప్రాసస్..ప్రధాన మంత్రి సహాయ నిధికి రూ.100 కోట్ల విరాళం ఇస్తున్నట్లు ప్రకటించింది. కరోనా వైరస్‌ను కట్టడి చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి తమవంతుగా సహాయం అందించాలనే ఉద్దేశంతో ఈ విరాళాన్ని ప్రకటించినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

## స్పెన్సర్‌తో ఫ్లిప్‌కార్ట్

**హైదరాబాద్, ఏప్రిల్ 10:** ఇంటివద్దకే నిత్యావసర వస్తువులు అందించాలనే ఉద్దేశంతో ప్రముఖ రిటైల్ సంస్థ స్పెన్సర్‌తో జతకట్టింది ఫ్లిప్‌కార్ట్. ఇరు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం స్పెన్సర్‌లో లభించే ప్రతి వస్తువును ఫ్లిప్‌కార్ట్ ద్వారా బుకింగ్ చేసుకునే అవకాశం ఉన్నది. పైలట్ ప్రాజెక్టు కింద ఈ సేవలను హైదరాబాద్‌లో ప్రారంభించినట్లు కంపెనీ సీఈవో కృష్ణమూర్తి తెలిపారు. లాక్‌డౌన్ కారణంగా నిత్యావసర వస్తువులు లేక ఇబ్బందులు పడుతున్న వారికి ఇది ఉపయోగకరంగా ఉంటుందని ఆయన చెప్పారు.

## భారత్‌కు ఏడీబీ అండ

### రూ.16,500 కోట్ల తక్షణ సాయం అందించేందుకు రెడీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా మహమ్మారిపై అలుపెరుగకుండా పోరాడుతున్న భారత్‌కు ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) అండగా నిలిచింది. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో భారత్‌కు 220 కోట్ల డాలర్ల (దాదాపు రూ.16,500 కోట్ల) ఆర్థిక సాయాన్ని అందించేందుకు ఏడీబీ సిద్ధమైంది. ఈ మేరకు ఏడీబీ అధ్యక్షుడు మసత్సుగు అసకవా కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు హామీ ఇచ్చారు. కరోనా వైరస్‌పై పోరు కోసం భారత్ చేపడుతున్న చర్యలను అసకవా శ్లాఘించారు. దేశవ్యాప్తంగా ఆరోగ్య అత్యవసర కార్యక్రమాన్ని చేపట్టడంతోపాటు లాక్‌డౌన్ వల్ల నష్టపోతున్న వ్యాపారులు, పేదలు, మహిళలు, కార్మికులకు తక్షణ ఉపశమనాన్ని కలిగించేందుకు 2,300 కోట్ల డాలర్ల (రూ.1.7 లక్షల కోట్ల) ఆర్థిక ప్యాకేజీని ప్రకటించిన నరేంద్ర మోదీ సర్కార్‌ను అసకవా కొనియాడారు. 'ప్రస్తుత అత్యవసర పరిస్థితుల్లో భారత్‌కు అండగా నిలిచేందుకు ఏడీబీ కట్టుబడి ఉన్నది. దేశ ఆరోగ్య విభాగానికి చేయూతనివ్వడంతోపాటు కరోనా మహమ్మారి వల్ల పేదలు, అసంఘటిత కార్మికులు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై పడుతున్న దుష్ప్రభావాన్ని తగ్గించేందుకు వీలుగా 220 కోట్ల డాలర్ల తక్షణ సాయాన్ని అందించేందుకు మేము సిద్ధమవుతున్నాం. అంతేకాకుండా ఈ విపత్కర సమయంలో ప్రైవేటు రంగాల ఆర్థిక అవసరాలను తీర్చేందుకు కూడా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. అవసరమైతే ముందుముందు భారత్‌కు మరింత సహాయాన్ని అందించేందుకూ మేము సిద్ధమే' అని అసకవా ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## రియల్‌కు లక్ష కోట్ల నష్టం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొవిడ్-19 మహమ్మారి కారణంగా దేశీయ రియల్ ఎస్టేట్ రంగానికి దాదాపు లక్ష కోట్ల రూపాయల నష్టం సంభవించింది. దేశంలోని అన్ని రంగాల్ని మళ్లీ గాడిలో పెట్టేందుకు జీడీపీలో కనీసం 10 శాతం సొమ్మును ఆర్థిక ఉద్దీపన ప్యాకేజీ కింద ప్రకటించాలని నరెడ్కో కేంద్రాన్ని కోరింది. ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడితేనే భవిష్యత్తులో నిలదొక్కుకోగలుగుతామని నరెడ్కో అధ్యక్షుడు నిరంజన్ హీరానందానీ అభిప్రాయపడ్డారు. ప్రస్తుత సమయంలో ఆర్థిక ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించాలని సూచించారు.

**ఇండ్ల ధరల నియంత్రణ**

దేశంలో ఇండ్ల ధరను నియంత్రించాల్సిన అవసరముందని ఆర్బీఐ తాజా అధ్యయనం తెలియజేసింది. ఎన్సీఆర్‌తోపాటు ముంబై వంటి నగరాల్లో ఐదు శాతం ఇండ్ల రేట్లు తగ్గుముఖం పట్టాయని, దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం రేటు సుమారు 16 శాతం పెరిగిందని అభిప్రాయపడింది.

# ఆట

## 5వేల మందికి సచిన్ సహాయం



**ముంబై:** భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ మరోమారు తన సహృదయతను చాటుకున్నాడు. ప్రమాదకర కరోనా వైరస్‌పై పోరాడేందుకు ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.50లక్షల విరాళమిచ్చిన మాస్టర్ తాజాగా ఆపన్నులకు అండగా నిలిచేందుకు సిద్ధమయ్యాడు. అప్నాలయ అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి నెలకు ఐదు వేల మందికి సరుకులు పంపిణి చేసేందుకు సచిన్ ముందుకొచ్చాడు. ఈ విషయాన్ని అప్నాలయ తమ అధికారిక ట్విట్టర్ ద్వారా పేర్కొంది. 'మా సంస్థకు సహాయం చేస్తున్నందుకు సచిన్‌కు కృతజ్ఞతలు. నెలకు ఐదు వేల మందికి అవసరమయ్యే రేషన్ సరుకులను సచిన్ సమకూరుస్తున్నాడు' అని ట్వీట్ చేసింది.

## ఒలింపిక్స్ 2021లోనూ కష్టమే!



ముటో

**టోక్యో:** టోక్యో ఒలింపిక్స్ 2021లో జరిగేది కూడా అనుమానమేనా. అంటే కరోనా వైరస్ కారణంగా ప్రస్తుత పరిస్థితులు చూస్తే దాదాపు అలాగే అనిపిస్తున్నది. అవును కొవిడ్-19 సృష్టిస్తున్న విలయతాండవంలో అన్ని దేశాలు తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కొంటున్నాయి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే..వచ్చే ఏడాది కూడా విశ్వక్రీడల నిర్వహణ సాధ్యం కాకపోవచ్చని టోక్యో గేమ్స్ సీఈవో తొషిరో ముటో శుక్రవారం అన్నాడు. వైరస్ వ్యాప్తిని దృష్టిలో జపాన్‌లో ప్రధాని షింజో అబె.. ఎమర్జెన్సీ విధించిన సంగతి తెలిసిందే.

## ఆటగాళ్ల బకాయిలు చెల్లించిన బీసీసీఐ

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ)..ఆటగాళ్లందరి బకాయిలను చెల్లించింది. సెంట్రల్ కాంట్రాక్టుల్లో ఉన్న క్రికెటర్లతో పాటు దేశవాళీ ఆటగాళ్లకు చెల్లించే త్రైమాసిక వేతనాలను బోర్డు మొత్తం క్లియర్ చేసింది. కరోనా వైరస్ కారణంగా ఏ ఒక్కరు ఇబ్బంది పడొద్దనే ఉద్దేశంతో బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నదని సభ్యుడు ఒకరు పేర్కొన్నారు. 'గత నెల 24 నుంచి దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ నడుస్తున్నా..ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు బీసీసీఐ అన్ని రకాల సిద్ధమైంది' అని బోర్డు అధికారి అన్నారు.

# ఫిట్‌నెస్‌పై దృష్టి..

• ఆన్‌లైన్ షెడ్యూల్‌తో ప్రతిరోజు ప్రాక్టీస్
• నమస్తే తెలంగాణతో యువ షట్లర్ శ్రీకృష్ణ ప్రియ

**అభివృద్ధి పథంలో అగ్రగామి అనుకున్న యూరప్ దేశాలు కరోనా వైరస్ బారిన పడి విలవిలలాడుతుంటే. ఆర్థిక వ్యవస్థ కంటే ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని భావించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహమ్మారిని దీటుగా ఎదుర్కొంటున్నాయని శ్రీకృష్ణ ప్రియ కుదరవల్లి పేర్కొంది. విపత్కర పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తోటి వారికి సాయం అందించాలంటున్న ఈ అమ్మాయి ఫిట్‌నెస్‌పై దృష్టి పెడుతూ ముందుకు సాగుతున్నది. అందుబాటులో ఉన్న వనరులతో తన ఆటతీరుకు మెరుగులు అద్దుకుంటున్న కృష్ణప్రియ చెప్పిన విషయాలు ఆమె మాటల్లోనే..**





శ్రీకృష్ణ ప్రియ

నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి

సాధారణంగా నెలకు రెండు, మూడు టోర్నీలు ఆడేదాన్ని. కానీ కొవిడ్-19 కారణంగా నెల రోజుల నుంచి ఇంటికే పరిమితమయ్యా. ఉదయం, సాయంత్రం ఫిట్‌నెస్ సంబంధించి వ్యాయామాలు కొనసాగిస్తున్నాను. మొదటి నుంచి నాకు బయట తిరగడం పెద్దగా ఇష్టం ఉండదు. ఎక్కువగా కుటుంబంతోనే ఉంటా.. టోర్నీలకు వెళ్లిన సందర్భాల్లోనూ మా వాళ్లు నా వెంట ఉండాల్సిందే. అందుకే నాకు లాక్‌డౌన్ ఇబ్బందిగా అనిపించడం లేదు.

**ఆన్‌లైన్ షెడ్యూల్‌తో ప్రాక్టీస్**

లాక్‌డౌన్ కదా అని ఇంట్లో ఖాళీగా ఉండటం లేదు. ఫిట్‌నెస్ ట్రైనర్ రవి పంపిన షెడ్యూల్ ప్రకారం ప్రాక్టీస్ కొనసాగిస్తున్నా. ఏ ప్లేయర్‌కైనా ఫిట్‌నెస్ అనేది చాలా ముఖ్యం. ఇందులో భాగంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రైనర్ సూచించిన విధంగా ఎక్సర్‌సైజ్‌లు చేస్తున్నా. పుల్లెల గోపీచంద్ అకాడమీలో డబుల్స్ ప్లేయర్ కోన తరుణ్ అన్నతో అప్పుడప్పుడు ఇంట్లోనే షటిల్ ఆడుతున్నా. ఆన్‌కోర్ట్ బ్యాడ్మింటన్ ఆడటం మినహా మిగిలిదంతా ఎప్పటి లాగానే అనిపిస్తున్నది.

**లాక్‌డౌన్.. మన కోసమే కదా..!**

కరోనా వైరస్ కారణంగా ఏర్పడిన లాక్‌డౌన్ పరిస్థితుల దృష్ట్యా ఇంట్లో ఉండటమే ఉత్తమం. విశ్వమారి వ్యాప్తిని అరికట్టేందుకు వైద్య సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. ప్రాణాలను కూడా లెక్కచేయకుండా సేవలు అందిస్తున్నారు. ఇలాంటి తరుణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు నడుచుకుందాం.

**మనం చాలా ముందున్నాం..**

యూరప్ దేశాలతో పోల్చుకుంటే.. వైరస్ ప్రభావం ఇక్కడ తక్కువగా ఉంది. దీనికి మన పాలకులు తీసుకున్న కఠిన నిర్ణయాలే కారణం. ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతుందని తెలిసినా ధైర్యంగా లాక్‌డౌన్ విధించారు. దీంతోనే వైరస్ వ్యాప్తిని అరికట్టగలిగాం.

### అమ్మ ప్రోద్బలంతోనే..



క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నవారిని ఆదుకోవాలని.. చిన్నప్పటి నుంచి అమ్మానాన్నలు (శ్రీనివాస్, మాధవి) ఎప్పుడు చెబుతూనే ఉంటారు. అందుకే ఈ సమయంలో నాకు తోచినంత సాయం చేయాలనుకున్నా. ఈ విషయం కుటుంబ సభ్యులతో చర్చిస్తే.. నాకంటే ఎక్కువ సంతోషపడ్డారు. అందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి నా వంతుగా రూ.5 లక్షల విరాళం అందించాను.

## రోబోతో సాతియాన్ ప్రాక్టీస్



**బెంగళూరు:** లాక్‌డౌన్ సమయాన్ని క్రీడాకారులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. కొందరు ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడంపై దృష్టి పెడితే..మరికొందరు తమ ఆటతీరుకు మరిన్ని మెరుగులు అద్దుకుంటున్నారు. భారత టేబుల్ టెన్నిస్ స్టార్ ప్లేయర్ సాతియాన్..రోబోతో కలిసి ప్రాక్టీస్ చేస్తున్నాడు. ప్రత్యేకంగా జర్మనీ నుంచి తెప్పించుకున్న రోబో సహాయంతో తాను రోజు ఆడుతున్నానని పేర్కొన్నాడు.

## సిగ్నల్ కోసం చెట్లపైకి అంపైర్



అనిల్

**న్యూఢిల్లీ:** కరోనా కారణంగా ఏర్పడ్డ లాక్‌డౌన్ వల్ల ఐసీసీ ప్యానెల్ అంపైర్ అనిల్ చౌదరి ఎదుర్కొంటున్న కష్టాలు అన్నిఇన్ని కాదనిపిస్తున్నది. చాలా రోజుల తర్వాత సొంతూరు ఉత్తర్‌ప్రదేశ్ శామ్లీ జిల్లాలోని దాగ్రోల్‌కు పోయివద్దామనుకున్న అనిల్ పడరాని పాట్లు పడుతున్నాడు. సెల్‌ఫోన్ సిగ్నల్ కోసం చెట్లెక్కాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నాడు.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

నమస్తే తెలంగాణ
# నిపుణ
[ హైదరాబాద్ ]
శనివారం 11 ఏప్రిల్ 2020




**ప్రపంచంలో నేడు ఎంత సాధించినా ప్రతినిత్యం ఏదో ఒకటి కొత్తదానికి అన్వేషించాల్సి పరిస్థితి ఏర్పడుతుంది. ఎంతో అభివృద్ధి సాధించామనుకున్నా ప్రకృతి నిత్యం ఏదో ఒక సవాలు విసురుతూనే ఉంటుంది. ఆ పరీక్షలో నెగ్గాలంటే కావల్సింది పరిశోధనలే. అయితే దేశంలో అనుకున్నంత స్థాయిలో పరిశోధనలు జరగట్లేదు. ఈ లోటు తీర్చడానికి కేంద్రం 2006లో ఐసర్‌లను ప్రారంభించింది. ఐసర్‌లలో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైన నేపథ్యంలో ఐసర్ వివరాలు నిపుణ పాఠకుల కోసం..**

# పరిశోధనల ఐసర్

- **ఐసర్:** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (ఐసర్).
- ప్రధానమంత్రి శాస్త్రసాంకేతిక అడ్వైజరీ కౌన్సిల్ సిఫారసు మేరకు వీటిని ప్రారంభించారు. బేసిక్ సైన్సెస్‌లో ప్రామాణికమైన పరిశోధనలే ప్రధాన లక్ష్యం. అతిపెద్ద టెలిస్కోప్ నిర్మాణం నుంచి టీబీ, కరోనా వరకు పలు పరిశోధనల్లో ఈ సంస్థలు విశేష కృషి చేస్తున్నాయి.
- సైన్స్ ఎడ్యుకేషన్, రిసెర్చ్ రంగాలను మిళితం చేసి అత్యున్నత విద్యను అందించడానికి కేంద్రం ఐఐఎస్ఈఆర్‌లను ఏర్పాటుచేసింది.
- మొదట 2006లో పుణె, కోల్‌కతాల్లో ఐసర్ క్యాంపస్‌లను కేంద్రం ప్రారంభించంది. తర్వాత 2007లో మొహాలీలో, 2008లో తిరువనంతపురం, భోపాల్‌లలో, 2015లో తిరుపతి, 2016లో బెర్హంపూర్‌లో ఐసర్ క్యాంపస్‌లను ప్రారంభించింది.
- ఐసర్‌లలో యూజీ, పీజీ, పీహెచ్‌డీలతోపాటు ఇంటర్న్‌షిప్‌లను కూడా అందిస్తున్నాయి.
- **ప్రత్యేకతలు:** పరిశోధన, బోధనలో అభిరుచి, అధిక సమర్థత కలిగిన ఫ్యాకల్టీలు, బోధనతోపాటు అత్యాధునిక పరిశోధనలను చేయడం, ఆయా విభాగాల్లో నిరంతరం ఇంటర్న్‌షిప్, థీసిస్‌లను అందించడం ఈ సంస్థల ప్రత్యేకత.
- **కోర్సులు:** బీఎస్, బీఎస్-ఎంఎస్ డ్యూయల్ డిగ్రీ.

**బీఎస్ డిగ్రీ**
- ఇది నాలుగేండ్ల కోర్సు.
- బీఎస్ ఇన్ ఇంజినీరింగ్ సైన్సెస్, ఎకనామిక్స్ కోర్సులను కేవలం ఐసర్ భోపాల్ క్యాంపస్ మాత్రమే అందిస్తుంది.

**బీఎస్-ఎంఎస్ డిగ్రీ**
- ఇది ఐదేండ్ల డిగ్రీ కోర్సు.
- బీఎస్-ఎంఎస్‌లో బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, డాటా సైన్స్, ఎర్త్&క్లైమెట్ సైన్సెస్/ఎర్త్&ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, జియాలజికల్ సైన్సెస్, మ్యాథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్ ఉన్నాయి.

**నోట్:** ఈ కోర్సులు పూర్తి రెసిడెన్షియల్ ఫుల్‌టైం కోర్సులు.

**అర్హతలు:** 2019/2020లో ఇంటర్ (సైన్స్ స్ట్రీమ్) ఉత్తీర్ణులు. ఆయా రాష్ట్ర బోర్డుల్లో టాప్-20 పర్సంటైల్ వచ్చి ఉండాలి. ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీతోపాటు బయాలజీ లేదా మ్యాథ్స్‌లలో ఏదైనా ఒక సబ్జెక్టు తప్పనిసరిగా చదివి ఉండాలి.

### పరీక్ష విధానం
- ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్
- మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఫిజిక్స్ నుంచి ప్రశ్నలు వస్తాయి.
- ప్రతి సబ్జెకు నుంచి 15 ప్రశ్నల చొప్పున మొత్తం 60 ప్రశ్నలు ఇస్తారు.
- పరీక్ష కాలవ్యవధి 180 నిమిషాలు (3 గంటలు).
- ప్రతి కరెక్ట్ జవాబుకు 3 మార్కులు. తప్పు జవాబుకు ఒక మార్కు కోతవిధిస్తారు.




### స్టేట్ బోర్డు చానల్‌కు సంబంధించిన ముఖ్యతేదీలు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 30 (సాయంత్రం 5 గంటల వరకు)
- హాల్‌టికెట్ల డౌన్‌లోడింగ్- మే 18 నుంచి
- ఐఐఎస్ఈఆర్ ఆప్టిట్యూడ్ టెస్ట్- మే 31 (ఉదయం 9 నుంచి 12 గంటల వరకు)
- **రాష్ట్రంలో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్, వరంగల్.

**నోట్:** కేవీపీవై, ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ చానళ్ల ద్వారా ప్రవేశానికి సంబంధించిన తేదీల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

| ఐసర్ క్యాంపస్ | సీట్ల సంఖ్య |
|---|---|
| (బీఎస్-ఎంఎస్ డ్యూయల్ డిగ్రీ) | |
| బెర్హంపూర్ | 185 |
| భోపాల్ | 252 |
| కోల్‌కతా | 233 |
| మొహాలి | 239 |
| పుణె | 280 |
| తిరువనంతపురం | 280 |
| తిరుపతి | 193 |
| భోపాల్ (బీఎస్ డిగ్రీ) | 115 |
| (బీఎస్ ఇంజినీరింగ్-73, ఎకానమిక్ సైన్సెస్-42) | |

- **వెబ్‌సైట్:** http://www.iiseradmission.in
- పూర్తి వివరాల కోసం కింది చిరునామా, ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.

The Chairperson
Joint Admissions Committee 2020
Indian Institute of Science Education & Research Thiruvananthapuram
Maruthamala PO, Vithura,
Thiruvananthapuram – 695551,
Kerala, India.
Email: ask-jac2020@iisertvm.ac.in
Phone : 0471-2778200, 0471-2778182

### ప్రవేశం కల్పించే విధానం
- మూడు విధానాల్లో ప్రవేశాలు కల్పిస్తారు. కేవీపీవై, జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంక్, స్టేట్ అండ్ సెంట్రల్ బోర్డుల చానల్ ద్వారా.

1. కేవీపీవై ఫెలోషిప్ 2020-21 విద్యాసంవత్సరం నుంచి పొందనున్నవారికి.
2. ఐఐటీ -జేఈఈ (అడ్వాన్స్‌డ్) 2020లో కామన్ ర్యాంక్ లిస్ట్‌లో 10వేల ర్యాంక్‌లోపు వచ్చినవారికి.
3. స్టేట్, సెంట్రల్ బోర్డ్స్‌లో ఐఐఎస్ఈఆర్ నిర్దేశించిన కటాఫ్ మార్కులు సాధించి, సంస్థ నిర్వహించే ఐఐఎస్ఈఆర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఐఏటీ)లో వచ్చిన ర్యాంక్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

**గమనిక:** మన రాష్ట్ర అభ్యర్థులు 500 మార్కులకు జనరల్/ఈడబ్ల్యూఎస్-468, ఓబీసీ-ఎన్‌సీఎల్-465, ఎస్సీ-454, ఎస్టీ-457, పీహెచ్‌సీ-454 మార్కులు వచ్చిన వారు ఐఏటీ రాయడానికి అర్హులు.

- **స్కాలర్‌షిప్‌లు:** కేవీపీవై చానల్ వారికి నిబంధన ప్రకారం కేవీపీవై స్కాలర్‌షిప్ ఇస్తారు. మిగిలిన రెండు చానల్ విద్యార్థులకు పరిమిత సంఖ్యలో డీఎస్‌టీ అందించే ఇన్‌స్పైర్ స్కాలర్‌షిప్స్ ఇస్తారు.

... కేశవపంతుల వేంకటేశ్వరశర్మ

# Phylum Annelida includes over..



**1. What is the po..2 & Pco...2 in the systemic arteries?**
1) $Po_2$ 40 mm Hg, $Pco_2$ 45 mm hg
2) $Po_2$ 95 mm Hg, $Pco_2$ 104 mm Hg
3) $Po_2$ 95 mm Hg, $Pco_2$ 40 mm Hg
4) Po..2 45 mm Hg, Pco..2 40 mm Hg

**2. Choose the wrong statement.**
1) Solubility of $Co_2$ in blood is 20-25 times higher than that of $O_2$
2) The total volume of air accommodated in the lungs at the end of a forced inspiration is called the vital capacity
3) $O_2$ can bind with haemoglobin in a reversible manner to form oxyhaemoglobin
4) Every 100 ml of deoxygenated blood delivers approximately 4 ml of $Co_2$ to the alveoli

**3. Match the items listed under column-I with those given under column-II. Choose the appropriate option from the given choices.**

| Column-I | Column-II |
|---|---|
| A. Residual volume (RV) | p. 4000 ml - 4600 ml |
| B. Inspiratory Reserve volume (IRV) | q. 1100 ml - 1200 ml |
| C. Vital Capacity (VC) | r. 1000 ml - 1100 ml |
| D. Expiratory Reserve Volume (ERV) | s. 3000 ml - 3500 ml |
| E. Inspiratory Capacity (IC) | t. 25000 ml - 3000 ml |

1) A-t, B-q, C-s D-r, E-p
2) A-q, B-r, C-s D-t, E-p
3) A-q, B-t, C-p D-r, E-s
4) A-r, B-t, C-p D-q, E-s

**4. When you hold your breath which of the following gas changes in the blood would first lead to the urge to breathe?**
1) Falling $O_2$ concentration
2) Raising $Co_2$ concentration
3) Falling $Co_2$ concentration
4) Raising $Co_2$ concentration & Falling $O_2$ concentration

**5. Select correct combination of statements for lymph..**
A. It helps to maintain fluid balance of the body
B. It is contained in lymphatic vessels & lymphatic organs in mammals
C. It is derived from tissue fluid
D. It contains less antibodies than plasma
E. It flows in both directions
F. It helps to conserve proteins & remove bacteria
1) A, B, C, E 2) B, C, D, F
3) A, D, E, F 4) C, D, E, F

**6. Which one of the following statements is not correct?**
1) Rhodopsin is the purplish red protein present in rods only
2) Retinal is the light absorbing portion of visual photo pigments
3) In retina the rods have the photo pigment rhodopsin while cones have three different photo pigments
4) Retinal is a derivative of Vitamin-C

**7. The yellowish pigmented spot at the posterior pole of the human eye lateral to the blind spot is..**
1) Crista 2) Saccule
3) Iris 4) Macula lutea

**8. In mammalian eye, the 'fovea' is the centre of the visual field, where..**
1) Only rods are present
2) The optic nerve leaves the eye
3) More rods than cones are found
4) High density of cones occur, but has no rods

**9. Which one of the following is the functional unit of hearing?**
1) Utricle
2) Organ of zuckerkandl
3) Organ of corti
4) Vestibular apparatus

**10. The diurnal rhythms are regulated by lated by..**
1) Adrenaline 2) Melatonin
3) Serotonin 4) Vasopressin

**11. A chemical signal that has both endocrine & neural roles is..**
1) Cortisol 2) Melatonin
3) Calcitonin 4) Epinephrine

**12. Prostaglandins are modified form of..**
1) Fatty acids 2) Amino acids
3) nucleotides 4) disaccharides

**13. Atrial natriuretic factor is released by..**
1) Heart 2) Brain
3) Kidney 4) Pancreas

**14. Assertion (A):** Earthworms are hermaphrodites

**Reason (R):** Both the male & female reproductive organs are present in the same individual
1) Bothe A & R are false
2) A is false R is true
3) Both A & R are correct. R is the correct explanation of A
4) Both A, R correct. But R is not the correct explanation to A

**15. Phylum Annelida includes over..**
1) 15,000 species
2) 9,000 species
3) 60,000 species
4) 9,00,000 species

**16. Read the following statements regarding chilopodes & identify correct combination..**
A. Referred to as centipedes
B. Each trunk segment bears two pairs of legs
C. Respiration by trachea
D. Excretion by malpighian tubules

**The correct ones are..**
1) All except (A)
2) All except (C)
3) All except (D)
4) All except (B)

**17. Study the following statements about monoplacophora..**
A. shell is spirally coiled
B. Represented by Neomenia
C. Heart is unique with two pairs of atria & a pair of ventricles
D. Serial repetition of internal organs

**The correct statements are**
1) All except (A) 2) (A) Only
3) All except (C) 4) All except (B)

**18. The body cells in cockroach discharge their nitrogenous waste in the haemolymph mainly in the form of..**
1) Urea 2) Ammonia
3) Potassium urate
4) Calcium carbonate

**19. Fructose is absorbed into the blood through mucosa cells of intestine by the process called..**
1) Active transport
2) Simple diffusion
3) Facilitated transport
4) Co-transport mechanism

**20. Match the column-I, with column-II, column-III choose the correct option..**

| column-I (Substrate) | column-II, (Enzyme) | column-III (Product) |
|---|---|---|
| 1. Lactose | A. Lipase | I. Galactose |
| 2. Monoglycerides | B. Trypsin | II. Maltose |
| 3. Starch | C. Lactose | III. Fatty acids |
| 4. Peptones | D. Amylose | IV. Dipeptides |

**Answer codes..**
1) 1-A-I, 2-C-II, 3-B-III, 4-D-IV
2) 1-D-I, 2-A-II, 3-B-III, 4-C-IV
3) 1-C-I, 2-A-II, 3-D-III, 4-B-IV
4) 1-C-I, 2-A-II, 3-D-III, 4-B-IV

**21. Chylomicrons are..**
1) Neural signals that stimulate intestinal secretions
2) Small fat globules coated with protein
3) Small granules found in gastric juice
4) Protein molecules coated with fat

**22. The centrosome duplicates during the..**
1) S-Phase of cell cycle
2) G..2 Phase of cell cycle
3) Prophase of cell cycle
4) G..1 Phase of cell cycle

**23. select the correct statement related to mitosis..**
1) Amount of DNA in the parent cell is first halved & then distributed into two daughter cells
2) Amount of DNA in the parent cell is first doubled & then distributed into two daughter cells
3) Amount of DNA in the parent cell is first halved & then distributed into four daughter cells
4) Amount of DNA in the parent cell is first doubled & then distributed into four daughter cells

### Answers

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1-3 | 2-2 | 3-3 | 4-2 | 5-2 | 6-4 |
| 7-4 | 8-4 | 9-3 | 10-2 | 11-4 | 12-1 |
| 13-1 | 14-3 | 15-2 | 16-4 | 17-4 | 18-3 |
| 19-3 | 20-3 | 21-2 | 22-1 | 23-2 | |



**Modala Mallesh**
**Subject Expert**
**Palem, Nakerkal,**
**Nalgonda**
**9989535675**

# అన్ని డిష్‌లలో స్వయంప్రభ చానల్స్ !

- విద్యసంబంధమైన స్వయం ప్రభ చానల్స్ ఇక నుంచి అన్ని డిష్ టీవీల ద్వారా అందుబాటులో ఉంటాయని కేంద్రమానవ వనరుల శాఖ మంత్రి ప్రకటించారు. అధిక నాణ్యత గల పాఠ్యాంశాలను అందించే 32 డీటీహెచ్ చానళ్ల సమూహమైన స్వయం ప్రభ చానల్ ఇప్పుడు టాటా స్కై, ఎయిర్‌టెల్ డీటీహెచ్‌లలో కూడా అందుబాటులో ఉంటాయి. స్వయంప్రభ చానళ్లు ఇప్పటివరకు డీడీ-డీటీహెచ్, డిష్ టీవీ, జియోటీవీ యాప్‌లో మాత్రమే అందుబాటులో ఉండేవి.
- ఎక్కువ మంది విద్యార్థులకు ఈ విద్యా ప్రసారాలు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రయత్నంలో భాగంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి రమేష్ పోఖ్రియాల్ నిశాంక్, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రి ప్రకాష్ జవదేకర్ టాటా స్కై, ఎయిర్‌టెల్ డీటీహెచ్ ఆపరేటర్లను తమ డీటీహెచ్ ప్లాట్‌ఫామ్‌లో కొన్ని స్వయంప్రభ చానళ్లను ప్రసారం చేయాలని అభ్యర్థించారు.




- వారి అభ్యర్థన మేరకు రెండు ఆపరేటర్లు తమ ప్లాట్‌ఫామ్‌లో మూడు స్వయంప్రభ చానళ్లను ప్రసారం చేయడానికి అంగీకరించారు. ఈ ప్రసారాలు ఉచితంగా అందిస్తారు. విద్యార్థులు ఈ లాక్‌డౌన్ సమయంలో ఇంట్లో టీవీల ద్వారా విద్యను కొనసాగించాలని మంత్రి నిశాంక్ సూచించారు.
- స్వయంప్రభ మొత్తం 32 చానల్స్ సమాహారం. వీటిలో కళలు, సైన్స్, వాణిజ్యం, ప్రదర్శన కళలు, హ్యూమానిటీస్ సబ్జెక్టులు, ఇంజనీరింగ్, టెక్నాలజీ, లా, మెడిసిన్, వ్యవసాయం మొదలైన విభిన్న విభాగాలను కవర్ చేసే అధిక నాణ్యతగల విద్యాపాఠ్యాంశాల ఆధారిత కోర్సుల విషయాలను అందిస్తారు.
- ఎయిర్‌టెల్ టీవీలో - చానల్ నం.475, చానల్ నం.476, చానల్ నం.477లలో స్వయంప్రభను చానెళ్లను వీక్షించవచ్చు.
- **టాటా స్కై:** చానల్ నం.756. ఇది స్వయంప్రభ చానల్ కోసం విండోను ఏర్పాటు చేస్తుంది.
- **డిష్ టీవీ:** చానల్ నం.946, చానల్ నం.947, చానల్ నం. 949, చానల్ నం.950.
- విద్యార్థులు ఈ చానళ్లలో, NIOS యూట్యూబ్ చానల్‌లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 6 గంటల రికార్డ్ ప్రసారంతో విద్యా కార్యక్రమాలు చూడవచ్చు. తరువాత మధ్యాహ్నం 1 నుంచి 7 గంటల వరకు 6 గంటల లైవ్‌సెషన్ ఉంటుంది. ప్రతి ప్రసారం కోసం, నలుగురు వేర్వేరు విషయ నిపుణులు ఒక్కొక్కటి ఒకటిన్నర గంటల సెషన్ తీసుకుంటారు. అభ్యాసకులు ఇంటి నుంచి ఫోన్‌కాల్ ద్వారా కూడా ప్రశ్నలు అడగవచ్చు.